25-2Pg1exHMNWJQE.qxd:25-2Pg1exHMNWJQE.qxd 01/01/01 9:29 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు fb.com/vaartha
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-2-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 24 పేజీలు: 12 వెల: 6.50

2వేలమంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై ట్రంప్ వేటు 9లో

భారతీయ వంటకాల్లో 'మఖానా' సూపర్‌ఫుడ్: ప్రధాని

ప్రజల మేలుకే 'సూపర్ సిక్స్'

సోమవారం ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నజీర్


గవర్నర్ ప్రసంగాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

జీవన ప్రమాణాలు పెంచే పలు సంక్షేమ పథకాలు

గత ప్రభుత్వం నిలిపిన 93 కేంద్ర పథకాల్లో 74 పునరుద్ధరించాం

రూ.2.68 లక్షలకు పెరిగిన తలసరి ఆదాయం

ఉభయసభల ప్రసంగంలో గవర్నర్ నజీర్

అసెంబ్లీలో 11వ బ్లాక్‌కు పరిమితమైన వైఎస్సార్సీసభ్యులు

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టామని, అర్హులైన అందరికీ సొంతిల్లు ఉండాలనేది మా ఆకాంక్ష అని గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. ప్రజలకోరిక మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని సోమవారం ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైందని, గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఎంతో నష్టపోయిందని గవర్నర్ వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు >>2

వైఎస్సార్సీకి ప్రతిపక్ష హోదా రాదు..

ఆ పార్టీ సభ్యులు హుందాగా వ్యవహరించాలి: డి.సిఎం పవన్

విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి:ప్రతిపక్ష హోదా అడిగితే ఇచ్చేది కాదని ప్రజలు ఇస్తేనే వస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అత్యధిక మెజార్టీలో రెండో స్థానంలో ఉన్న పార్టీకి ప్రతిపక్ష హోదా ఇస్తారన్నారు. ఈ విషయంలో వైకాంగ్రెస్‌పార్టీ సభ్యులు హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మీడియా పాయింట్ వద్ద పవన్ మాట్లాడారు. వైకాపా సభ్యులు ప్రతిపక్ష హోదా కోరుతున్నారు. సభలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన మాకంటే ఒక్క సీట ఎక్కువ వచ్చినా వాళ్లకి ఆ హోదా దక్కేది. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే సభను

సోమవారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

అడ్డుకుంటామని చెప్పడం సరికాదు. ప్రజలు ఇచ్చిన 11 సీట్లను గౌరవించి అసెంబ్లీకి రండి. సమస్యలు , ప్రభుత్వ లోటుపాట్లు తెలియజేయండి. సంఖ్యకు అనుగుణంగా స్పీకర్ సమయం కేటాయిస్తారు. వైకాపా సభ్యులు హుందాగా ప్రవర్తించాలి. సభకు రాగానే ఆందోళన చేయడం ఆ పార్టీ దిగజారుడు తనానికి నిదర్శనం. ఫిక్స్ అయిపోండి 11 సీట్లతో ఈ ఐదేళ్లు వైకాంగ్రెస్‌కు ప్రతిపక్ష >>2

5 ఎమ్మెల్సీ సీట్లకు మార్చి 20న పోలింగ్

అదే రోజు సాయంత్రం కౌంటింగ్

షెడ్యూలు విడుదల చేసిన సిఇసి

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న ఐదుగురు సభ్యుల పదవీ కాలం మార్చి 29లోగా ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 3వ తేదీన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం కౌంటింగ్ ఉంటుంది.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన జంగా కృష్ణ మూర్తి, రామారావు, అశోక్ బాబు, యనమల రామకృష్ణుడు, తిరుమలనాయుడు పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సంఖ్యాబలం దృష్ట్యా ఎన్నికలు జరగనున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాలు కూడా ఎన్డీఏ కూటమి ఖాతాలో చేరే అవకాశం ఉంది. అయితే ఎన్డీఏ కూటమిలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఈ ఐదు సీట్లు ఎలా పంచుకుంటాయనేది ఆసక్తికరంగా మారింది. బీజేపీ కూడా ఎమ్మెల్సీ స్థానం కోరుతుందా, లేక టీడీపీ, జనసేన పార్టీలకు వదిలేస్తుందా అనేది చూడాల్సి ఉంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవుల కోసం కూటమిలో ఆశావహుల సంఖ్య అధికంగా ఉంది. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం స్థానాన్ని జనసేన అధినేత >>2

మరింతగా వాట్సప్ గవర్నెన్స్

ప్రజలకు అవగాహన పెంచండి

త్వరలో 500 సేవలకు విస్తరణ

బెల్టు షాపులను ఉపేక్షించొద్దు: సిఎం చంద్రబాబు

విజయవాడ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్తప్రతినిధి: మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సెల్ ఏర్పాటు చేసి, వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలు విస్తృతంగా ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ల కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఈ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.రాబోయే రోజుల్లో ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు 500 సేవలు కల్పించనుందని తెలిపారు. సోమవారం సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వాట్సాప్ గవర్నెన్స్ అమలు ప్రగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించి వారు ఈ సేవలను విస్తృతంగా ఉపయోగించుకునేలా చేయడంపై అధికారులందరూ ప్రత్యేక దృష్టి కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్లందరూ ఈ విషయంలో కీలకంగా పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వాట్సాప్ గవర్నెన్స్ కోసం ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, ఆయా జిల్లాల్లో వాట్సాప్ గవర్నెన్స్ అమలును పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చాలా సులభతరంగా అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని, ఇందులో వాట్సాప్ గవర్నెన్స్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల్లో ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా సులభంగా పొందేలా ప్రజల్లో అవగాహన కల్పించేలా క్యూఆర్ కోడ్ ప్రదర్శించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా

సోమవారం సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజల నుంచి వినతులు, వాటి పరిష్కారాలు కూడా మెరుగ పడాలన్నారు. అలాగే ప్రభుత్వానికి ప్రజలు చెల్లించాల్సిన బిల్లులు కూడా వాట్సాప్ ద్వారా విరివిగా జరిగేలా చూడాలని ఆ దిశగా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. చాలా మంది ప్రజల్లో వాట్సాప్ గవర్నెన్స్ ఎలా ఉపయోగించాలో సరైన అవగాహన లేదని, వారిలో అవగాహన పెంచేలా ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డ్ సచివాలయాల్లో కూడా ఆ ప్రాంత ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ పట్ల అవగాహన కల్పించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఇంట్లోనూ ఒక ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు నిపుణులు ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు.

డ్రోన్ పెట్రోలింగ్‌తో శాంతిభద్రతల పర్యవేక్షణ

డ్రోన్ పెట్రోలింగ్ శాంతిభద్రతల పర్యవేక్షణలో టెక్నాలజీని విరివిగా వాడుకుని సత్ఫలితాలు సాధించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పోలీసు గస్తీకి సమాంతరంగా డ్రోన్లను విరివిగా ఉపయోగించుకుని డ్రోన్ పెట్రోలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దానివల్ల పోలీసులకు గస్తీ ప్రక్రియ మరింత సులభతరమవ్వడమే కాకుండా సత్ఫలితాలు కూడా వస్తాయన్నారు. ఆర్టీజీఎస్‌లో డేటా లేక్ ఏర్పాటు ప్రక్రియలో భాగంగా జరుగుతున్న డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. మనకు నూతన సాంకేతికత ఆశ్చర్యంగా ఉన్నా, తద్వారా ఎంత మంచి జరుగుతుందో గుర్తించాలన్నారు.డ్రోన్ పెట్రోలింగ్‌ను అవసరమన్నారు. ఈవిషయంలో ఆయా విభాగాలు శ్రద్ధ పెట్టాలన్నారు.

ఆర్టీసీ బస్సులన్నిటికీ జీపీఎస్ ఉండాలి

రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులన్నిటికీ జీపీఎస్ వ్యవస్థ ఉండాలని సీఎం సూచించారు. తద్వారా ప్రయాణీకులకు తాము >>2

ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివి రెడ్డి రాజీనామా

ఎండి దినేష్ కుమార్ బదలీ

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి: ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవితో పాటు టీడీపీ ప్రాథమిక సభ్యత్వం, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు >>2

వల్లభనేని అక్రమాలపై విచారణకు 'సిట్'

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అక్రమాలపై సిట్ ఏర్పాటు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అక్రమ మైనింగ్, భూకబ్జాలు తదితర వ్యవహారాలపై నలుగురితో సిట్ ఏర్పాటు చేసింది. ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్ కుమార్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం, ఏలూరు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, తూర్పు గోదావరి ఎస్పీ నరసింహ కిషోర్‌లకు సిట్‌లో చోటు కల్పించింది. అక్రమ మైనింగ్ >>2

అసెంబ్లీకి వెళ్లినా.. మానినా..

ప్రజా సమస్యలపై పోరాడుతాం

విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి: అసెంబ్లీకి వెళ్ళినా,వెళ్ళకున్నా ప్రజా సమస్యలపై పోరాడతామని ఏపీ మాజీ సీఎం,వైకాంగ్రెస్‌పార్టీ నేత వైఎస్ జగన్ స్పష్టం చేసారు.అసెంబ్లీలో కూటమికి అధికార పక్షానికి వ్యతిరేకంగా ఉన్న తమ పార్టీకి ప్రతిపక్షహోదా ఇవ్వమంటున్నామన్నారు. ఇది ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు, దాని కోసం చట్టసభలో పోరాడుతున్నాం.సభను బాయ్‌కాట్ చేస్తే పారిపోవడం అనుకోవడం కూటమి పక్షాల అజ్ఞానమన్నారు.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే సమావేశాలను వైకాంగ్రెస్ బాయ్ కాట్ చేసింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గవర్నర్ ప్రసంగం సమయంలో తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ నినాదాలు చేసి ఆ తర్వాత పోడియం వద్ద నిరసనం వ్యక్తం చేసిన వైసీపీ ఎమ్మెల్యేలు, అనంతరం గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగానే బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. ఇక తాడేపల్లిలోనీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమైన వైఎస్‌జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. వైకాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం లేనందున అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదని వైసీపీ

ప్రతిపక్షహోదా ఇవ్వకపోవడం చాలా అన్యాయం

ఇక ప్రజల్లోనే ఉంటాం: మాజీ సిఎం జగన్

నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీకి వెళ్లినా, వెళ్లకున్నా ప్రజా సమస్యలపై పోరాటం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నేనింకా ముప్పై ఏళ్ల పాటు రాజకీయాల్లో వుంటాను అని మరోసారి వ్యాఖ్యానించారు వైఎస్ జగన్ నాతో పాటు వుండేవాళ్ళు నా వాళ్లు, 2028 ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఆ ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలి పేదలకు వైసీపీ ఇచ్చిన ఇళ్ల స్థలాలు వెనక్కి తీసుకోవడం కుదరదు. ఎక్కడైనా అలాంటి సంఘటలను జరిగితే వారికి అండగా ఉండాలని సూచించారు. గతంలో అసెంబ్లీకి చంద్రబాబు రాని సమయం లో కూడా ఆయన సభలో ఉంటే బాగుండేదని చెప్పా. వాళ్లేమో సభలో వైసీపీ లేకుండా నడపా లని చూస్తున్నారు. ఏది ఏమైనా ప్రజా సమ స్యలపై ప్రజా క్షేత్రంలో పోరాడిలి అంటూ వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగ న్మోహన్‌రెడ్డి. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం మీద వ్య తిరేకత తీవ్రంగా ఉంది. మనం యుద్ధ రంగంలో ఉన్నాం. విజయం దిశగా అడుగులు వేయాలి. ప్రజా సమస్యల విషయంలో రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు జగన్ నిజాయితీగా చిత్తశుద్ధితో ప్రజల తరపున పోరాటం చేయాలి. ప్రజలకు తోడుగా ప్రజల్లో ఉంటే గెలుపు సాధించినట్టే. అందుకనే ప్రజాసమస్యలపై పోరాటంలో వెనుకడుగు వేయొద్దు అన్నారు. ఈ ప్రభుత్వాన్ని చూసి భయపడాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరికి నేను భరోసా ఇస్తున్నాను. అండగా ఉంటాను. ప్రతిపక్షంలో మన సమర్థతను నిరూపించుకోవడానికి ఇదొక అవకాశం >>2

సోమవారం అసెంబ్లీ హాల్లో స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశ దృశ్యం

మార్చి 19వరకు అసెంబ్లీ

బిఎసిలో నిర్ణయం

సచివాలయం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త : వచ్చే నెల 19వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు సమావేశంకాగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయ సభల నుద్దేశించి బడ్జెట్‌పై ప్రసంగించారు.అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన అసెంబ్లీ మీటింగ్ హాల్లో జరిగిన బిఏసి సమావేశంలో పైవిధంగా నిర్ణయించారు.కనీసం 15రోజులకే తగ్గకుండా చర్చలు జరగాలని,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.అవసరమైన పక్షంలో మరో రెండు రోజుల పొడిగింపు >>2

వాకౌట్ చేసిన వైఎస్సార్సీ

గవర్నర్ ప్రసంగం ఆరంభంలోనే నినాదాలు చేస్తూ అసెంబ్లీ నుంచి బయటకు..

విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి: అసెంబ్లీ నుంచి వైసీపీ వాకౌట్ చేసింది.ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తున్నారు.ఈ క్రమంలో అసెంబ్లీలో వైఎస్సార్సీపీ సభ్యులు ఆందోళనకు దిగారు అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని గుర్తించండంటూ నినాదాలు చేసారు. ప్రజల గొంతుక వినిపించాలంటే ప్రతిపక్ష హదా ఇవ్వాల్సిందే అంటూ నిరసనకు దిగారు. అనంతరం గవర్నర్ ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రతిపక్షంగా గుర్తించాలని గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ప్రసంగం సమయంలో వైకాంగ్రెస్ పార్టీ సభ్యుల నినాదాలు చేసారు.11 నిమిషాల పాటు అసెంబ్లీలో నినాదాలు చేసి వెళ్లిపోయిన జగన్మోహన్ రెడ్డి, వైకాంగ్రెస్ పార్టీ సభ్యులు. గవర్నర్ ప్రసంగాన్ని బాయ్ కాట్ చేసి వెళ్లిపోతున్నట్లు పార్టీ నేతలు జగన్, బొత్స సత్యనారాయణలు వ్యాఖ్యానించారు.వారిని అనుసరించి ఇతర వైకాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బయటకు వచ్చేసారు.

ఆ ఊరికి అంబులెన్సొచ్చింది..

హర్షం వ్యక్తం చేసిన ప్రజలు

హిరమండలం(శ్రీకాకుళం జిల్లా), ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లా గిరిజన గ్రామాల్లో డోలీ బాధల నుంచి ఉపశమనం లభించింది. మారుమూల గ్రామాలలో ప్రజలకు రోగం వస్తే డోలీయే వారికి దిక్కు. అటువంటి డోలీ కష్టాలు తీరనున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో వెండర్ వ్యవస్థ ద్వారా రహదారి నిర్మాణాలు చేపట్టారు. ఇదే తరహాలో ఐటీడీఏ పరిధిలో సీసీరహదారులు, బీటీరోడ్లు నిర్మాణాలు చేపట్టారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, >>2

25-2pg2exHMNWJQE.qxd:25-2pg2exHMNWJQE.qxd 01/01/01 9:25 AM Page 1

ప్రజల మేలుకే 'సూపర్ సిక్స్'

>> మేలు చేస్తున్నామన్న గవర్నర్, అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్‌సీ దస్త్రంపై సంతకం చేశామని, అన్న క్యాంటీన్లు తెచ్చి పేదవాళ్ల ఆకలి తీరుస్తున్నామని తెలిపారు.

ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు, విద్యుత్ ఉండాలి. యువతకు మెరుగైన శిక్షణ ఇవ్వాలనేది మా విధానం. పీ4 విధానం ద్వారా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో పేదరికం నిర్మూలించేందుకు కట్టుబడి ఉన్నాం. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సరికొత్త విధానాలు తెచ్చాం. ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం ఎన్నికల్లో ప్రజలు మా ప్రభుత్వానికి తిరుగులేని మెజారిటీ ఇచ్చారన్నారు.వైఎస్సార్సీపీ పాలన వల్ల రాష్ట్రం 25 ఏళ్ల ఆదాయాన్ని కోల్పోయింది. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నాం. ప్రజల కోసం ఉచిత ఇసుక పాలసీ విధానం తెచ్చాం. సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తెస్తున్నాం. మా ప్రభుత్వం 8 నెలల్లోనే గణనీయమైన పురోగతి సాధించింది. గతప్రభుత్వం నిలిపిన 93 కేంద్ర పథకాల్లో 74 పథకాలు పునరుద్ధరించాం. నీటిపారుదల, రోడ్ల సంబంధిత రూ.10,125 కోట్ల బిల్లులు క్లియర్ చేశామన్నారు.తలసరి ఆదాయం కూడా రూ.2.68 లక్షలకు పెరిగిందని, వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు వృద్ధి చెందాయని అన్నారు. ఈ సందర్భంగా సంఘ సంస్కర్త కందుకూరి వ్యాఖ్యలను గవర్నర్ ప్రస్తావించారు. ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉంటుందని, అవకాశమిస్తే బయటకు వస్తుందని చెప్పారు. తమ ప్రభుత్వం స్వర్ణాంధ్ర2047 దిశగా వెళ్తోందని, సమాజ అభివృద్ధికి సంక్షేమం, అభివృద్ధి కలిసికట్టుగా వెళ్లాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండాలనేదే తమ విధానమని స్పష్టంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఐటీ విప్లవానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని కొనియాడారు. అమెరికాలోని ప్రవాస తెలుగువాళ్ల తలసరి ఆదాయం ఎక్కువని తెలిపారు. ప్రస్తుతం ఏపీ మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోందని, పరిపాలన, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధిలో ఏఐను వినియోగిస్తున్నామని చెప్పారు. స్వర్ణాంధ్ర2047కు పది సూత్రాలతో విజన్ రూపొందించాం. పేదరిక నిర్మూలన, మానవ వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, నీటి భద్రత, రైతుఅగ్రిటెక్, గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్, వ్యయ నియంత్రణ, విద్యుత్ ఇంధనం ప్రత్యేక దృష్టి పెట్టాం.పీపుల్ ఫస్ విధానంతో స్వర్ణాంధ్ర సాధనకు సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించాం. పేదలకు ఆహార భద్రత కోసం పీడీఎస్‌ను బలోపేతం చేశాం. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోడీ గారల నాయకత్వం పట్ల విశ్వాసాన్ని, నమ్మకాన్ని ఉంచుతూ ఎన్ డిఎ ప్రభుత్వ సంకీర్ణం యొక్క సంపూర్ణ మద్దతును ప్రతిబింబిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు శాసనసభ ఎన్నికలలో నా ప్రభుత్వానికి అపూర్వమైన తీర్పును ఇచ్చారు. ఈ ప్రభుత్వానికి లభించిన అఖండ, చారిత్రాత్మక మెజారిటీ ప్రజా సంకల్పానికి నిదర్శనం మాత్రమే కాదు, గత ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా బలమైన ప్రకటన కూడా అన్నారు.గత ప్రభుత్వంలో అన్నిరంగాల్లో జరిగిన దుర్వినియోగం వల్ల మనం ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితి గురించి నేను ఈ సభలో గతంలో చేసిన ప్రసంగాన్ని సభ దృష్టికి తీసుకొస్తున్నాను. గత ఐదేళ్లలో (2019- 24) జరిగిన దుర్మార్గపు పాలన రాష్ట్రాన్ని ఆర్థిక పతనం అంచుకు చేర్చింది. గత ప్రభుత్వం వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ఏడు శ్వేతపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేశాను. ఈ శ్వేతపత్రాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దుర్వినియోగాన్ని బయటపెట్టాయి. రాష్ట్ర వనరుల మళ్లింపు, సహజవనరుల దోపిడీ, ఎక్సైజ్, ఇసుక తవ్వకాల్లో లోపభూయిష్ట విధానాలతో రాష్ట్ర ఆదాయానికి గండిపడటం, ప్రభుత్వ పన్నులను దారి మళ్లించడం ద్వారా 25 సంవత్సరాల భవిష్యత్తు ఆదాయాన్ని కోల్పోవడం, అధిక రుణ స్థాయి మరియు అధిక వడ్డీ రేట్లకు రుణాలు తీసుకోవడం, భారత ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించి రుణాలు తీసుకోవడం, కేంద్ర ప్రాయోజిత పథకం నిధుల మళ్లింపు, అన్ని ప్రాజెక్టులను స్తంభింపజేయడం ద్వారా నీటిపారుదల రంగం పతనం, ఇంధన రంగం విధ్వంసం, రూ.1.35 లక్షల కోట్ల మేర అప్పులు ఉన్నాయి.అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండే గౌరవనీయ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు వారి దార్శనిక నాయకత్వంలో నా ప్రభుత్వం ఆరు హామీలను అమలు చేసేందుకు, ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర పునరుజ్జీవనం కోసం నిరంతరం కృషి చేస్తూ బ్రాండ్ ఆంధ్ర పూర్వ వైభవాన్ని పునరుద్ధరించడం ప్రారంభించాము. మొదటి కొద్ది రోజుల్లోనే, మేము మా వాగ్దానాలను నెరవేర్చడానికి మరియు ప్రజల జీవితాలలో స్పష్టమైన మెరుగుదలలను తీసుకురావడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నాము. అవేవంటే, ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడం, సామాజిక భద్రతా పింఛన్లను రూ.4,000/లకు పెంచడం, విద్యా రంగాన్ని బలోపేతం చేయడం కోసం 16,347 మంది ఉపాధ్యాయుల నియామకానికి మెగా డిఎస్ సిని ప్రకటించడం, ఉపాధి అవకాశాలను అంచనా వేయడానికి మరియు పెంచడానికి నైపుణ్య గణనను నిర్వహించడం, 204 అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, గుంతలు లేని రోడ్ల కోసం మిషన్, ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు.గత దుర్భలపాలన, దుష్పరిపాలన నుంచి బాధ్యతాయుతమైన, సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావడంలో గత ఎనిమిది నెలల్లో మా ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించింది. గత ప్రభుత్వం నిలిపివేసిన 93 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 74 పథకాలను పునరుద్ధరించి రూ.9,371 కోట్ల అప్పులు తీర్చాం. ఇది ప్రస్తుత మరియు భవిష్యత్తు సంవత్సరాలకు భారత ప్రభుత్వం నుండి మరిన్ని విడుదలలకు ప్రేరేపించింది. ఆర్థిక కార్యకలాపాలను పునరుద్ధరించడానికి, బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ పై విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి నీటిపారుదల, రోడ్లు, ఇతర పనులకు సంబంధించి రూ.10,125 కోట్ల బిల్లులను క్లియర్ చేశాం. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న రూ.2,488 కోట్ల ఆర్థిక సంఘం గ్రాంట్లను విడుదల చేయడం ద్వారా స్థానిక పాలనను బలోపేతం చేశాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తిరిగి నిర్మిస్తామని ఇటీవల శాసనసభ ఎన్నికలలో ఎన్.డి.ఏ. హామీ ఇచ్చినట్లుగా పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు, అమరావతి రాజధాని ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించాం. విశాఖ ఉక్కు కర్మాగారం పునరుద్ధరణ, కొత్త రైల్వే జోన్ ఏర్పాటు హామీలను నెరవేర్చాలనే మా నిబద్ధతకు ఇది నిదర్శనం. సుస్థిర వృద్ధి, శ్రేయస్సుకు దోహదపడే 22 కొత్త విధానాలను ప్రారంభించడం ద్వారా బలమైన పునాది వేశాం. మా ప్రయత్నాలు ఇప్పటికే ఫలితాలను ఇస్తున్నాయనే విషయాన్ని పంచుకోవడానికి నేను గర్విస్తున్నాను. భారీ పెట్టుబడుల కోసం



సోమవారం గవర్నర్ ప్రసంగాన్ని వింటున్న మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు తదితరులు

గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ, టాటా పవర్, గ్రీన్ కో గ్రూప్, బిపిసిఎల్, టిసిఎస్ వంటి అనేక అంతర్జాతీయ దిగ్గజాలను ఆకర్షిస్తున్నాం. ఇప్పటి వరకు ఇన్వెస్టర్లు రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు మరియు 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడినది. 2024- 25 మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గత సంవత్సరం రూ.14.22 లక్షల కోట్ల నుండి రూ.16 లక్షల కోట్లకు విస్తరించింది. ఇది 12.94 నామమాత్రపు వృద్ధి రేటు. మన తలసరి ఆదాయం కూడా గత సంవత్సరంలోని రూ.2.37 లక్షల నుంచి రూ.2.68 లక్షలకు పెరిగింది. వ్యవసాయం, అనుబంధ రంగాలు 15.86,పరిశ్రమలు 6.71 , సేవల రంగం 11.70 చొప్పున వృద్ధి చెందాయి. ఈ ప్రగతి అన్ని కీలక రంగాలలో గణనీయమైన పనితీరు వల్ల సాధ్యమయిందని అన్నారు.

పెరిగిన తలసరి ఆదాయం: కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామన్న గవర్నర్, తమ ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగిందని చెప్పారు. అవకాశాలిస్తే ప్రతి ఒక్కరూ మెరుగైన సేవలు అందిస్తారని అన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తామని వెల్లడించారు. ప్రతినెలా 1వ తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని, పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్నామని అన్నారు. విద్య, వైద్యం, మౌలికవసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్న గవర్నర్, బీసీవర్గాలు సమాజానికి వెన్నెముక అని వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. స్థానికసంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. తలసరి ఆదాయం కూడా రూ.2.68 లక్షలకు పెరిగిందని, వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు వృద్ధి చెందాయని అన్నారు. ఈ సందర్భంగా సంఘ సంస్కర్త కందుకూరి వ్యాఖ్యలను గవర్నర్ ప్రస్తావించారు. ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉంటుందని, అవకాశమిస్తే బయటకు వస్తుందని చెప్పారు. తమ ప్రభుత్వం స్వర్ణాంధ్ర2047 దిశగా వెళ్తోందని, సమాజ అభివృద్ధికి సంక్షేమం, అభివృద్ధి కలిసికట్టుగా వెళ్లాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండాలనేదే తమ విధానమని స్పష్టంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఐటీ విప్లవానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని కొనియాడారు. అమెరికాలోని ప్రవాస తెలుగువాళ్ల తలసరి ఆదాయం ఎక్కువని తెలిపారు. ప్రస్తుతం ఏపీ మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోందని, పరిపాలన, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధిలో ఏఐను వినియోగిస్తున్నామని చెప్పారు. రూ.2,488 కోట్ల ఆర్థికసంఘం గ్రాంట్‌తో స్థానిక పాలన బలోపేతం చేశామని గవర్నర్ నజీర్ తెలిపారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించామని, విశాఖ ఉక్కు పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు హామీలు నెరవేర్చామని గుర్తు చేశారు. సుస్థిర వృద్ధికి దోహదపడే 22 కొత్త విధానాల ద్వారా బలమైన పునాది వేశామన్న గవర్నర్, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టాటా పవర్ కంపెనీలను ఆకర్షించినట్లు తెలిపారు. గ్రీన్‌కో గ్రూప్, బీపీసీఎల్, టీసీఎస్ కంపెనీలను ఆకర్షించామని, ఇన్వెస్టర్లు ఇప్పటివరకు రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. ఆయా పెట్టుబడుల ద్వారా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరిగాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.16 లక్షల కోట్లకు విస్తరించిందని అన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీకి విచ్చేసిన గవర్నర్ నజీర్‌కు సీఎం చంద్రబాబు నాయుడు, శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు,శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్,అయ్యన్న పాత్రుడు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్వాగతం పలికారు. నేటి శాసనసభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్,డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు,ఇతర మంత్రులు కందుల రమేష్,నాదెండ్ల మనోహర్,నారా లోకేష్,వంగలపూడి అనిత గవర్నర్ నజీర్‌కు ప్రత్యేకంగా అభివాదాలు చేసి,పలుకరించారు. గవర్నర్ ప్రసంగ పాఠాన్ని సీఎం చంద్రబాబు ఆద్యంతం ఆసక్తిగా చదువుతూ కన్నించారు.

11వ బ్లాక్‌కు పరిమితమైన వైఎస్సార్సీ సభ్యులు: నేటి అసెంబ్లీలో వైకాంగ్రెస్ శాసనసభ్యులకు 11వ బ్లాక్‌ను కేటాయించారు.మాజీ సీఎం జగన్‌తో పహా మొత్తం ఆ పార్టీ శాసనసభ్యులు శాసన సభలో ఒక పక్కగా వున్న 11వ బ్లాక్ సీట్లులోనే కూర్చున్నారు.రెండు నిమిషాల తరువాత వారు వెళ్ళిపోయారు.సభను తమకు ప్రతి పక్ష హోదా కల్పించనందుకు నిరసనగా వారు బాయికాట్ చేస్తున్నట్లు ప్రకంటించారు.



సోమవారం 11వ బ్లాక్‌లో కూర్చొని గవర్నర్ ప్రసంగాన్ని వింటున్న వైఎస్సార్సీ శాసనసభ్యులు



సోమవారం హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో ఐఐటి 16వ వార్షికోత్సవంలో పాల్గొన్న రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

వైఎస్సార్సీకి ప్రతిపక్ష హోదా రాదు..

>> హోదా రాదు. వాళ్లని అవమాన పరచాలనో తగ్గించాలనో కాదు. ఆ హోదా ఇవ్వడానికి నిబంధనలు ఉన్నాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని సభ్యులు ప్రవర్తించాలి. ఓట్ల శాతాన్ని దృష్టిలో పెట్టుకుంటే వారు జర్మనీ వెళ్లిపోవాలి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రభుత్వం తరఫున సందేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న సమయంలో వైసీపీ వ్యవహరించిన తీరు బాగోలేదని విమర్శించారు. గత కొద్ది రోజులుగా గవర్నర్‌కు ఆరోగ్యం బాగోలేకపోయినప్పటికీ... సభకు వచ్చి ప్రసంగించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టుగా పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ సీనియర్ నాయకులు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నినాదాలు చేయడంతో పాటు, పేపర్లను సైతం చించివేశారని చెప్పారు. ప్రతిపక్ష హోదా అడిగితే వచ్చేది కాదని.. అది ప్రజలు ఇస్తేనే వస్తుందని అన్నారు. జనరల్‌గా అత్యధిక మెజారిటీ ఉన్నవారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు.నెక్స్ట్ స్టేజ్‌లో ఉన్నవారికి ప్రతిపక్ష హోదా ఇస్తారు. గతంలో మేము ప్రభుత్వంలో ఉన్నాం కదా.. ప్రతిపక్ష హోదా కావాలని అడిగితే ఇవ్వరు. కనీసం జనసేన కంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చినా వారికి ప్రతిపక్ష హోదా దక్కేది. ఈరోజు ప్రభుత్వంలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన. వైసీపీ నాయకులు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాం, ప్రసంగాలను అడ్డుకుంటామని అనడం సరైన విధానం కాదు అని వైసీపీపై విమర్శలు చేశారు. వైసీపీకి ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని... 11 సీట్లు ఇచ్చారని, దానిని గౌరవించి వారు అసెంబ్లీకి రావాలని సూచించారు. నిబంధనల ప్రకారం వారు మాట్లాడేందుకు ఇవ్వాల్సిన సమయం ఇస్తారని అన్నారు. వైసీపీ హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గొడవ పెట్టుకోవాలనే ఆలోచనతో అసెంబ్లీకి రావడం దిగజారుడు ఆలోచన విధానమమని పవన్ కల్యాణ్ విమర్శించారు. ఈ ఐదేళ్లలో వైసీపీకి ప్రతిపక్ష రాదని ఇందుకు వారు మానసిక సిద్ధమైపోవాలని అన్నారు. ఇది సీఎం చంద్రబాబు నాయుడు, జనసేన డిసైడ్ చేసేది కాదని... రూల్స్ ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

మరింతగా వాట్సప్ గవర్నెన్స్

>> ప్రయాణించాల్సిన బస్సు ఏ ప్రాంతంలో ఉంది, ఎక్కడ ఉంది, ఎంత సమయానికి వస్తుందనేది సులభంగా తెలిసిపోతుందని చెప్పారు. గూగుల్ సహ కారం తీసుకుని ఈ వ్యవస్థను త్వరితగతగిన ఏర్పాటు చేసుకో వాలన్నారు. పింఛన్ల పంపిణీకి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ పెట్టి పర్యవేక్షించే అవకాశాన్ని పరిశీలించాలన్నారు.

బెల్టు షాపులపై ఉక్కుపాదం

రాష్ట్రంలో బెల్టు షాపులపట్ల అధికారులు కఠినంగా ఉండాలని, వాటిని ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో బెల్టుషాపులు నడుస్తున్నాయని ఇది ఏమాత్రం ఆమోద యోగ్యం కాదన్నారు. వీటిపైన అధికారులు కఠినంగా వ్యవహ రించాలన్నారు. ఆయా బెల్టుషాపులకు ఎవరు, ఏ మద్యం షాపు నుంచి మద్యం సరఫరా చేశారనేదానిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బెల్టుషాపులను అరికట్టాలన్నారు. ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా మెరుగుపడుతోందని, అయితే అక్కడక్కడా ఇంకా కొన్ని సమస్యలు కనిపిస్తున్నాయని వాటిపైన కూడా దృష్టి పెట్టాలని కోరారు. ఆర్టీజీ సెక్రటరీ భాస్కర్ కాటంనేని మట్లాడుతూ డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ తదితర కార్యక్రమాలపై ఆర్టీజీఎస్ చేపడుతున్న ప్రగతి గురించి సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సాధరణ పరిపాలన ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, సీఎం కార్యదర్శులు పీఎస్ ప్రద్యుమ్న, రవిచంద్ర, రాజమోళి, ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 19వరకు అసెంబ్లీ

>> ఉండే అవకాశం ఉందని తెలిపారు. వారం రోజుల్లో 5రోజులు సభ జరపాలని నిర్ణయించారు.ఈ సమా వేశంలో జనసేన పార్టీకి చెందిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్,అసెంబ్లీ వ్యవహారల మంత్రి పయ్యావుల కేశవ్,భాజపా పక్షనేత విష్ణుకుమార్ రాజు,అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్,జివి ఆంజనేయులు పాల్గొన్నారు.

5 ఎమ్మెల్సీ సీట్లకు మార్చి 20న పోలింగ్

>> పవన్ కల్యాణ్ కోసం త్యాగం చేసిన ఎస్వీ ఎస్ఎన్ వర్మ, మైలవరం సీటును వదులుకున్న దేవినేని ఉమామహేశ్వరరావు సహా గత ఎన్నికల సమయంలో సీట్లు వదులుకున్న నేతలు, అవకాశం రాని లీడర్లు ఎమ్మెల్సీ పదవుల కోసం ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఎస్వీఎస్ఎన్ వర్మ ఎన్నికల సమయంలోనే ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని స్వయానా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. మరోవైపు సీనియర్ నేత అయిన దేవినేని ఉమామహేశ్వరరావును కూడా ఎమ్మెల్సీని చేసి గౌరవించాలని టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి.

ఎపి ఫైబర్ నెట్ చైర్మన్ జివి రెడ్డి రాజీనామా

>> టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబుకు తన రాజీనామా లేఖను పంపించారు.

వ్యక్తిగత కారణాలతో టీడీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, ఫైబర్‌నెట్ చైర్మన్ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు జీవీ రెడ్డి వెల్లడించారు. తనపై ఉంచిన విశ్వాసం అందించిన మద్దతుతో పాటు కీలక బాధ్యతలు నిర్వహించేందుకు అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ మరింత బలంగా ఎదిగి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇకపై పూర్తిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతానని భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలోనూ చేరే ఉద్దేశం లేదని జీవీ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో జీవీ రెడ్డి రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది.

ఇదే సందర్భంలో ఫైబర్ నెట్ ఎండీ దినేష్ కునార్ పై బదిలీ వేటును ప్రభుత్వం వేసింది. ఆయన వెంటనే సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

విచారణకు 'సిట్'

>> సహా వివిధ నేరాల్లో ప్రభుత్వానికి 195 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం వాటిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సిట్‌కు సూచించింది.

వారం - వర్జ్యం

తేది : 25-02-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
ద్వాదశి మ.12.48
ఉత్తరాషాఢ సా.6.30
వర్జ్యం రా.10.19-11.50
దు.ఉ.8.59-9.46
2) రా.11.12-11.49
రాహుకాలం - మ.3.00-4.30

వార్తాఫలం

మేషం: ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

వృషభం : వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. రుణవత్తిడులు తప్పవు.

మిథునం: ఆరోగ్యం పట్ల మెలకువ చాలా అవసరం. తీర్థయాత్రలు చేస్తారు. క్రయ విక్రయాలు.

కర్కాటకం: వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

సింహం: ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

కన్య : తండ్రి నుండి ధనలాభం పొందుతారు. వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు.

తుల : ముఖ్యమైన పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. రుణవత్తిడులు తొలగుతాయి.

వృశ్చికం: సోదరులను కలిసి కష్ట సుఖాలను పంచుకొంటారు.ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

ధనుస్సు: ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. ప్రయణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

మకరం: బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

కుంభం: పట్టుదలతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

మీనం: సంఘంలో పరపతి పెరుగుతుంది. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

ఆ ఊరికి అంబులెన్సొచ్చింది..

>> డీప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్‌కళ్యాణ్ సూచనలతో గుంతలు లేని రోడ్లు అనే కార్యక్రమం చేపట్టారు. అవి కాస్త సత్ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలోని హిరమండలం పరిధిలో పెద్దగూడ పంచాయతీలో 9 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇవన్నీ కొండ, లోయ ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ గ్రామాలకు చేరుకునేందుకు ఇప్పటి వరకు సరైన రహదారి మార్గం లేదు.అంబులెన్స్‌లు రాకపోకలు సాగించేందుకు వీల్లేదు. ఎవరికైనా రోగం వచ్చి మంచాన పడితే డోలీలే దిక్కు. పెద్ద గూడకు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తూరు మండలం గొట్టేపల్లి సబ్‌సెంటర్‌కి డోలీల ద్వారా తీసుకురావల్సిన దుస్థితి. ఇటీవల 1.50 కోట్ల రూపాయలతో సీతంపేట ఐటీడీఏ పరిధిలో రోడ్డు పనులు పూర్తి చేశారు. దీంతో గ్రామంలోకి అంబులెన్స్ రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారి మార్గం గుండా 20కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తూరు పీహెచ్‌సికి అంబులెన్స్ ద్వారా చేరుస్తుండడంతో గిరిజన గ్రామాలకు డోలీ బాధల నుంచి గట్టెక్కినట్లయ్యింది.



సోమవారం గవర్నర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న మంత్రులు ఆనం, ఫరూక్ తదితరులు

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న గవర్నర్ దంపతులు

నంద్యాల,పిబ్రవరి24,ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభోవోపేతంగా జరుగుతున్న నేపథ్యంలో ఏపి గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు సోమవవారంనాడు విజయవాడ నుండి హెలిక్యాప్టర్‌లో నుండిపెంటకు చేరుకున్నారు.అక్కడ ఏపి మంత్రులు ఆనం రామనారాయణారెడ్డి,ఎన్.ఎం.డి ఫరూక్,బిసి జనార్ధన్‌రెడ్డి,శ్రీశైలం ఏమ్మేల్య్ బుడ్డారాజశేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా కలేక్టర్ రాజకుమారి గణియా,ఎస్పి విక్రాంత్ పాటిల్,జాయింటు కలేక్టర్ సి.విష్ణు చరణ్‌లు సంయుక్తంగా పుష్పగుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం సుండిపెంట నుండి రోడ్డు మార్గంన వాహనంలో బయలుదేరి శ్రీశైలంలోని భ్రమరాంబా అతిధి గృహం వద్దకు చేరుకున్నారు.అక్కడ పోలిస్ గౌరవ వందనం స్వీకరించారు.తదనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనార్థం ఆలయం వద్దకు చేరుకున్నారు.ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వారికి మంత్రులు,శ్రీశైలం ఏమ్మేల్ య,కలేక్టర్,జేసి,శ్రీశైలదేవస్థానం కార్యనిర్వహాణాధికారి ఎం.శ్రీనివాసరావు,అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు.అనంతరం శ్రీస్వామిఅ

25-02Pg3exHMNWJQEKCR.qxd:25-02Pg3exHMNWJQEKCR.qxd 01/01/01 8:40 AM Page 1

సిఎంపై అనుచిత వ్యాఖ్యలు: శ్రీధర్‌రెడ్డిపై కేసు

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి: సీఎం చంద్రబాబు పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసిపి కార్యకర్త అవుతు శ్రీధర్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసారు.శ్రీధర్ రెడ్డి మీద నీళి నమోదు చేసిన విజయవాడ సూర్యరావుపేట పోలీసులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీధిదిశి సోషల్ మీడియా కార్యకర్త అవుతు శ్రీధర్ రెడ్డి.ఐ యాక్ట్ 2008 ప్రకారం కేసు నమోదు చేసిన పోలీసులు.సోషల్ మీడియా వేదికగా కించపరిచే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారి మీద ఐటీ యాక్ట్ క్రింద కేసు నమోదు, రౌడీ షీట్లు పీడీ యాక్ట్ ప్రయోగం.

సభ్యత్వాలు పోతాయనే ఇలా వచ్చి అలా వెళ్లారు: జగన్‌పై హోం మంత్రి అనిత విమర్శలు..

విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి: అసెంబ్లీ సమావేశాలకు ఇలా వచ్చి అలా వెళ్లిన వైకాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ జగన్‌పై హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర విమర్శలు గుప్పించారు. హాజరు కోసమే సభకు వచ్చారని తేటతెల్లమైందని వ్యాఖ్యానించారు. సభ్యత్వాలు పోతాయనే భయంతోనే వచ్చారని భావిస్తున్నట్లు తెలిపారు. వైకాంగ్రెస్‌పార్టీ నేతల తీరు అటెండెన్స్ వేయించుకుని వెళ్లినట్లుంది. సభ్యత్వాలు పోతాయనే భయంతోనే వచ్చారని భావిస్తున్నాం. హాజరు కోసమే సభకు వచ్చారని తేలిపోయింది. అవినీతి, అబద్దాల పునాదులపై ఆ పార్టీ పుట్టింది. గతంలో చెప్పిన అవాస్తవాలనే మళ్లీ చెబుతున్నారు. సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడతారిని భావించాం. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామనడం ఎక్కడా చూడలేదు. అబద్దాలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారు. 11 స్థానాల్లో గెలిచి ప్రతిపక్ష హోదా అడగడం హాస్యాస్పదం. సీనియర్లు కూడా జగన్‌కు వత్తాసు పలకడం దురదృష్టకరం అని అనిత అన్నారు. బడ్జెట్ సమావేశాలను మార్చి 21 వరకు నిర్వహించాలని శాసనసభా వ్యవహారాల కమిటీ నిర్ణయించిందని మంత్రి తెలిపారు.

పరిశ్రమల్లో బాయిలర్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

- తనిఖీ అధికారి జె. శ్రీనివాసరావు

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి: పరిశ్రమల్లో ఏర్పాటయ్యే బాయిలర్ ల నిర్వహణా విధానాలు తీసుకోవాల్సిన భద్రతా చర్యల పై బాయిలర్ ఆపరేటర్లకు పునఃశ్చరణ తరగతులను భోదించడం జరిగిందని విజయవాడ బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి విజయవాడ బాయిలర్ల తనిఖీ అధికారి జె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా బాయిలర్ల శాఖ ఆధ్వర్యంలో కృష్ణా మరియు యన్.టి.ఆర్. జిల్లా పరిసర ప్రాంతాల్లో పనిచేయుచున్న బాయిలర్ అటెండెన్స్ (ఆపరేటర్లు) పునఃశ్చరణ తరగతులను గాంధీనగర్ లో గల కృష్ణా జిల్లా రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ లో సోమవారం నిర్వహించామన్నారు. పరిశ్రమల్లో బాయిలర్ ల నిర్వహణా విధానాలు తీసుకోవాల్సిన భద్రతా చర్యల పై, బాయిలర్ల లో వాడే నీటి వినియోగం, శుద్ధి మొదలైన అంశాలపై సుదీర్ఘ అనుభవం గల పరిశ్రమ నిష్ణాతులచే బాయిలర్ లను ఆపరేట్ చేసే బాయిలర్ ఆపరేటర్లకు శిక్షణను అందించామన్నారు. ప్రతి ఏటా జరిగే ఇటువంటి తరగతులను గతంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ గుడివాడ, హనుమాన్ జంక్షన్ మరియు కొండపల్లిలో కూడా నిర్వహిచామన్నారు. కార్యక్రమంలో విజయవాడ బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి యం. సత్యనారాయణ తో పాటు జోసిల్ ఫ్యాక్టిరీకు చెందిన షేక్ రిషావత్ ఆలీ, రాజమండ్రి ఎ.పి. పేపరు మిల్లు టెక్నికల్ ఆఫీసర్ వి.వి.వి. సత్యనారాయణ, నవభారత్ లిమిటెడ్ కు చెందిన యస్. నందకేశవరావు, రామదాసు పేపర్ బోర్డ్స్ కు చెందిన కె.యస్. పవన్ నారాయణ, స్వతంత్ర కన్సల్టంట్ యమ్. ప్రసాద్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందించారు.

గవర్నర్‌తో అసత్యాలు చెప్పించిన ప్రభుత్వం

మాజీ మంత్రి ఆర్‌కె రోజా విమర్శ!

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి: బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ప్రసంగంలో కూటమి ప్రభుత్వం పచ్చి అబద్దాలను చెప్పించిందని మాజీ మంత్రి ఆర్కె రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైయస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ అయిదేళ్ళలో హామీల అమలు ఎలా చేస్తారో చెప్పకుండా విజన్ 2047 గురించి గవర్నర్ ప్రసంగంలో మాట్లాడించడం అర్థరహితమని అన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడ అసెంబ్లీ సాక్షిగా ఎండగడతారోననే భయంతోనే వైయస్ఆర్సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా నిరాకరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంకా ఆమె ఏమన్నారంటే... గవర్నర్ ప్రసంగంలో వైయస్ జగన్ గారిని తిట్టిస్తూ, చంద్రబాబును పొగిడించుకునే కార్యక్రమం చేశారు. ఎన్నికలు ముందు సూపర్ సిక్స్ తో పాటు 143 హామీలు ఇచ్చారు. నేడు గవర్నర్ ప్రసంగంలో ఏ హామీ గురించి ఎలాంటి స్పష్టత లేకపోవడం దురదృష్టకరం. బడ్జెట్ ప్రసంగం అనగానే విద్య, వైద్య, వ్యవసాయ, ఇరిగేషన్ రంగాలపై ఎలాంటి లక్ష్యాలతో, ఏ విధంగా ప్రాధాన్యత ఇస్తారోనని అందరూ ఆసక్తిగా చూస్తారు. కానీ విజన్2047 పేరుతో కాకమ్మ కబుర్లతో ప్రసంగాన్ని ముగించారు. ప్రజలు చంద్రబాబుకు ఇచ్చిందే అయిదేళ్ళ పాలనాకాలం. ప్రజలకు ఇచ్చిన హామీలను ఈ అయిదేళ్ళలో ఎలా అమలు చేస్తారో చెప్పకుండా 2047 నాటికి ఏం చేస్తారో చెప్పడం అంటే, ఇప్పుడు ఏమీ చేయను అని చెప్పినట్లే. నమ్మినవారిని మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగవర్నర్ ప్రసంగంలో మద్యం రేట్లు పెంచం అని చెప్పించారు. ఇటీవలే మద్యం రేట్లను ఎలా పెంచారో పత్రికల్లో వచ్చిన కథనాలు చూస్తే తెలుస్తుంది. ప్రతి బాటిల్ పై రూ.10 లకు పైగా పెంచారు. మేం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచం అని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. నేడు తొమ్మిదినెలల కాలంలోనే ఏకంగా రూ.15వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం ప్రజలపై మోపారు. గవర్నర్ ప్రసంగంలో మాత్రం విద్యుత్ చార్జీల భారం లేదని చెప్పించడం చంద్రబాబు అబద్దాలకు పరాకాష్ట. ఇళ్ళలోని మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు, అన్నదాత సుఖీభవం, మహిళలకు ఉచిత బస్సు, తల్లికివందనం వంటి హామీలపై గవర్నర్ ప్రసంగంలో ఎటువంటి క్లారిటీ ఇవ్వలేదు. నిరుద్యోగులుకు భృతి ఇస్తామని, కొత్త ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వీటిని అమలు చేయకుండా ఇప్పటికే పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, వాలంటీర్లను తొలగించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఏదో చేస్తారని ఆశించిన ఉద్యోగస్తులకు ఐఆర్, డీఏ, పీఆర్సీల అమలు ప్రసక్తే లేదు. అన్ని వర్గాలను మోసం చేయడం అలవాటైన చంద్రబాబును నమ్మిన వారిని చూస్తే జాలి కలుగుతోంది. వైయస్ జగన్ మనస్సున నాయకుడు. ఇచ్చిన మాటను తూచా తప్పకుండా అమలు చేసే నేత అన్నారు.ప్రతిపక్ష హోదాపై పవన్ వ్యాఖ్యలు అర్థరహితమన్నారు.ప్రతిపక్ష హోదా ఇవ్వడం వల్ల సభలో ఎక్కువ సమయం కేటాయిస్తారు, ప్రజా సమస్యలపై ఎక్కువ సేపు మాట్లాడే అవకాశం ఉంటుందని వైయస్ జగన్ గారు ఈ హోదా అడుగుతున్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అర్థంలేకుండా మాట్లాడారు. ఎక్కడో జర్మనీ గురించి మాట్లాడుతున్నారు. ఎక్కువ సీట్లు వచ్చిన జనసేనకు ప్రతిపక్ష హోదా వస్తుందని అంటున్నారు.

పవన్ కళ్యాణ్ వెంటనే తన డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేసి ప్రతిపక్ష నాయకుడుగా ఈ ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబు చేసే తప్పులను నిలదీయాలని కోరుతున్నాం. ఆ పనిమాత్రం చేయలేరు. చంద్రబాబుకు కష్టం వస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారు, రోడ్డు మీద పడుకుంటారు.

ఈ రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ లేకపోయినా, విద్యార్థులు తమకు న్యాయం చేయాలని రోడ్ల మీదికి వచ్చినా తనకేమీ పట్టనట్లు ఆసుపత్రిలో పడుకుంటారు.

హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్

శ్రీశైలంలో గవర్నర్

నంద్యాల,ఫిబ్రవరి24,ప్రభాతవార్త ప్రతినిధి ఏపి గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు సోమవారంనాడు సుండిపెంట హెలిప్యాడ్ గ్రౌండుకు సాయంకాలం చేరుకున్నారు.ఏపి గవర్నర్‌కు హెలిప్యాడ్ వద్ద దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, రాష్ట్ర న్యాయ,మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్,రోడ్డు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బి.సి జనార్ధన్‌రెడ్డి,శ్రీశైలం ఏమ్మెల్య్ బుడ్డారాజ శేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా సర్వోన్నతాధికారి రాజకుమారి గణియా, కర్నూలు జల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, జాయింటు కలేక్టర్ సి.విష్ణుచరణ్‌లు సంయుక్తంగా ఘనస్వాగతం పలికారు.అనంతరం సుండిపెంట హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గంనా శ్రీశైలంలోని భ్రమరాంబా అతిదిగృహంకు చేరుకున్నారు. అక్కడ పోలిస్ గౌరవ వందనం స్వీకరించారు.

సమస్యలపై చర్చించాలంటే నాయకుడికి హోదా అవసరం లేదు

- మంత్రి అచ్చెన్నాయుడు

సచివాలయం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త : ప్రతిపక్షం అసెంబ్లీకి వస్తుందనే వార్తలు విని సంతోషించినా,కేవలం హాజరు కోసం మాత్రమే వచ్చారని తెలిసి ఆవేదన చెందినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.గవర్నర్ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను స్పష్టంగా వివ రించా రని, ప్రతి ఒక్కరూ బాబా సాహెబ్ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.ప్రజల కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం రావడం,ప్రతిపక్ష హోదా కోసం నినాదాలు ఇవ్వడం విచిత్రమన్నారు.జగన్ పార్టీ అవినీతి,అబద్దాల నుండి పుట్టిందని,వారి మీడియా కేవలం అవాస్తవాలను ప్రచారం చేస్తుందని విమర్శించారు.ప్రతిపక్ష హోదా పాత్రుడు గారో,చంద్రబాబు గారో కాదు,ప్రజలే ఇచ్చారని గుర్తుంచుకోవాలన్నారు. అసెంబ్లీకి రాను,ప్రజల సమస్యలపై పోరాడను అనిచెప్పిన నాయకుడు చరిత్రలో లేదని తెలిపారు.జగన్ తప్పుడు ప్రచారంతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని,రాజ్యాంగ బద్ధంగా లేని అవకాశాలు ఎవరూ ఇవ్వలేరని స్పష్టంచేశారు. సీనియర్లు కూడా వారికి మద్దతుగా మాట్లాడటం విచిత్రమని త్వరలో ముఖ్యమంత్రి పదవి కోసం డిమాండ్ చేస్తారేమోనని వ్యా ఖ్యానించారు. జగన్ వ్యక్తులకు కాదు,ప్రజలు సమా ధానం చెప్పాలని పేర్కొన్నారు. జగన్ ఇంకా రాజారెడ్డి రాజ్యమే ఉందని భ్రమ పడుతున్నారని, రాష్ట్రానికి చేసిన నష్టానికి ప్రజలు వారి స్థానాన్ని గుర్తుచేశారన్నారు. కనీసం పులివెందుల ప్రజల కోసమైనా "పులివెందుల ఎమ్మెల్యే" గారు అసెంబ్లీకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ సమ యంలో మిర్చి రైతులను కలవకూడదని తెలియక పోవడం విచిత్రమని వ్యాఖ్యానించారు. ప్రజల కోసం సభకు రావాలని,సమయం,మైకు ఇస్తామని,జోన్ లేదా సబ్జెక్టు పరంగా చర్చలకు సిద్ధమని తెలిపారు.జగన్‌కు లండన్ మెడిసిన్ సరిగ్గా పరిచేయడం లేదని వ్యంగ్యంగా పేరొ న్నారు. "సేవ్ డెమోక్రసీ" అని కేకలు వేసేముందు వారు దాని అర్థం తెలుసుకోవాలన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో కార్యదర్శులు అసెంబ్లీలో అందుబాటులో ఉండాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

విజయవాడ, ఫిబ్రవరి 24,ప్రభాతవార్తప్రతినిధి: బడ్జెట్ సమావేశాలు జరుగుచున్న సమయంలో అసెంబ్లీలో సంబంధిత శాఖల కార్యదర్శులు తప్పని సరిగా అందుబాటులో ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుచున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పలు ఆదేశాలు జారీ చేశారని వాటిని కార్యదర్శులు అందురూ తప్పని సరిగా పాటించాలన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం సి.ఎస్. సమావేశ మందిరం నుండి అన్ని శాఖల కార్యదర్శులు, ప్రిన్సిఫల్ కార్యదర్శులు, స్పెషల్ సి.ఎల్.లతో ఆయన వర్చ్యువల్ సమావేశం నిర్వహించి బడ్జెట్ సమావేశాల నిర్వహణకు సంబందించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల నిర్వహణకు సంబందించి సమగ్ర సమాచారాన్ని ముందుగానే మంత్రులకు అందజేయాలన్నారు. అంశాల వారీగా గత ప్రభుత్వంలో తీసుకున్న చర్యలు మరియు ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తీసుకుంటున్న చర్యలను స్పష్టంగా తెలిపే సమగ్ర సమాచారాన్ని మంత్రులకు ముందుగానే అందజేయాలని సూచించారు. ఇందుకు సంబందించి శాఖల వారీగా ఉన్న నోడల్ అధికారులను ముందుగానే అప్రమత్త పర్చాలన్నారు. సమావేశాలు నిర్వహించే సమయంలోనే స్టార్డు మరియు అన్ స్టార్డు ప్రశ్నలకు అన్నింటినీ సవివరమైన సమాదానాలు మంత్రులు ఇచ్చే విధంగా వారి తగిని సమాచారాన్ని ఆయా శాఖల కార్యదర్శులు ముందు రోజే అందజేయాలన్నారు. సమావేశాల సమయంలో ఆర్జిత శెలవులు, విదేశీ పర్యటన శెలవులు ఎవ్వరికీ మంజూరు చేయవద్దని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.అన్ని శాఖల కార్యదర్శులు, ప్రిన్సిఫల్ కార్యదర్శులు, స్పెషల్ సి.ఎస్.లు ఈ సమావేశంలో వర్చ్యువల్ గా పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో పన్ను బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి: మున్సిపాలిటీల్లో పన్నుల బకాయిలు వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని రెండో బ్లాక్ లోని తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష చేశారు.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు,నగర పంచాయతీల్లో పన్నుల వసూలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆస్తి పన్నుతో పాటు ఖాళీ స్థలాల పన్ను వసూళ్లు తక్కువగా ఉండటంతో పట్టణ స్థానిక సంస్థలకు ఆదాయంలో భారీగా లోటు ఏర్పడిందని గుర్తించారు..ఈ సమస్యను అధిగమించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మార్చి నెలాఖరులోపు 100 శాతం పన్ను వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు..పన్నుల వసూలుకు సంబంధించి పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్లు ఖాళీ భూముల యాజమానుల వివరాలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నుంచి సేకరించి బకాయిదారులకు నోటీసులు అందించాలి. ప్రతి మున్సిపాలిటీ లో పెండింగ్ పన్నుల జాబితా ప్రచురించి ప్రజలకు అవగాహన కల్పించాలి.వాట్సాప్ ద్వారా డిజిటల్ నోటీసులు పంపించి బకాయిల వివరాలు తెలియజేయాలి.ఆన్లైన్ పేమెంట్ లింక్ తో పన్నులు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలి. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మున్సిపాలిటీల్లో మెళికి వసతుల కల్పనలో పన్నుల ప్రాముఖ్యత ను తెలియజేయాలి. అత్యధిక పన్ను వసూలు చేసిన మున్సిపల్ కమిషనర్ల ను నగదు పురస్కారాలు,ఇతర ప్రోత్సాహకాలు ఇచ్చి గౌరవించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

శివదీక్షకు పెరుగుతున్న ఆదరణ వేలాది మంది మాల ధారణ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త శ్రీకాళహస్తి ప్రాంతంలోని రాజకీయ ద్వితీయశ్రేణి నాయకుల్లో భక్తి భావం అలవాటు చేయటానికి పాలకులు విన్నూత్న ప్రయోగం చేస్తున్నారు.శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేలాది మందిచే 'శివమాల'ను ధరింపజేసారు.భక్తి భావాన్ని ఉట్టిపడేటట్లు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో గత రెండు సంవత్సరాలుగా 'శివమాల దీక్షకు' ఆదరణ పెరుగుతుంది.ఈ నేపథ్యంలో యువకులు మాల ధరించాలని పిలుపు నిచ్చారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తు లను దర్శించు కొని మాలను ధరించారు. ఐదు రోజుల పాటు భక్తిభావంతో స్వామి అమ్మవార్ల తీరు నాళ్ళకు వచ్చే భక్తులను ఆదరించాలని సేవ లందించాలయు వకులు భావిస్తున్నారు. ధార్మికత మనిషిలో శాంతిని నింపు తుందని సహ నాన్ని ప్రసాదిస్తుందని ,మాన సిక ప్రశాంతను కల్గిస్తుందని భావిస్తున్నారు.

తిరుమల సమాచారం

గజవాహనంపై సోమస్కంధుడు

తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాత వార్తప్రతినిధి: తిరుమల తిరుపతిదేవస్థానానికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వర స్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి గజవాహనంపై భక్తులకు అభయ మిచ్చాడు. ఆద్యంత రహితుడైన శివదేవుడు ఐశ్వర్యసూచికమైన గజ వాహానాన్ని అధిష్టించినపుడు దర్శనం చేసుకోవడం భక్తులకు పుణ్యం. ఆలయ మాఢ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. కాగా సోమవారం ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తిగా కామాక్షి అమ్మవారితో కలసి వ్యాఘ్రవాహనంపై ఊరేగారు. ఉదయం నిత్యకైంకార్యలు పూర్తిచేసుకున్న తరూవాత స్వామివారు ఆలయ పురవీధుల్లో ఊరేగడంతో భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం

తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన దాత శ్రీనివాసులురెడ్డి ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు 10లక్షల రూపాయలు విరాలం అందించాడు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిని కలసి ఈ విరాళాల డిడిని అందేశారు. ఇప్పటికే దాత శ్రీనివాసులురెడ్డి 30లక్షల రూపాయలను విరాళంగా అందజేసినట్లు టిటిడి తెలిపింది.

తిరుమలలో క్షేత్రపాలకుడికి రేపు అభిషేకం

తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి: కలియుగ వైకుంఠం తిరుమలలో క్షేత్రపాలకుడు రుద్రునికి బుధ వారం ఉదయం మహాశివరాత్రిపర్వదినం సందర్భంగా విశేష అభిషేకాలు జరుగుతాయి. 26వతేదీ బుధవారం మహాశివరాత్రికి ప్రతి ఏటా వేడుకగా గోగర్భం సమీపంలో వెలసిన రుద్రునికి అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తొలుత శ్రీవారి ఆలయం నుండి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకుంటారు.అక్కడ మధ్యాహ్నం 3గంటలకు సుగంధద్రవ్యాలతో క్షేత్రపాలకునికి అభిషేకం చేసి ప్రసాదం సమర్పిస్తారు. భక్తులకు వితరణ చేస్తారు.

కాలినడకన తిరుమలకు కొణిదెల నిహారిక

తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి: సినీనటుడు,నిర్మాత కొణిదెల నాగబాబు కుమార్తె కొణిదలనిహారిక సోమవారం సాయంత్రం కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. సామాన్యభక్తులతో కలసి ఆమె అలిపిరి కాలినడక మార్గంలో భక్తితో నడచివచ్చారు.

ఆమెతో పలువురు భక్తులు ఆసక్తిగా ఫోటోలు తీసుకోవడం విశేషం. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకోనున్నారు. జొన్నలగడ్డ చైతన్యతతో విడాకులు తీసుకున్న తరువాత తిరుమలకు ఆమె రావడం తొలిసారి.

శ్రీవారి అనుగ్రహంతో శుభాలు కలగాలి: ప్రముఖులు

తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంక టేశ్వక స్వామి అనుగ్రహంతో అందరికీ శుభాలు కలగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. కర్నాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత కన్నెగంటి , తెలంగాణా శాసనమండలి మాజీ ఉపాధ్యక్షుడు నేతి విద్యాసాగర్, ఎంఎల్సి భూమిరెడ్డి రాంగోపాల్ విఐపి బ్రేక్‌లో సోమవారం ఉదయం శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మార్చి 9నుండి తిరుమలేశుని తెప్పోత్సవాలు

తిరుమల,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 9నుండి 13వతేదీ వరకు ఐదురోజులపాటు జరగనున్నాయి. ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు మార్చి 9వతేదీ ఆదివారం సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పలపై పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు అభయమిస్తారు. రెండవరోజు మార్చి 10వతేదీ సోమవారం సాయంత్రం రుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామి తెప్పపై మూడు ప్రదక్షణలు విహరిస్తారు. మూడవరోజు 11వతేదీ నుండి 13వరకు స్వామివారు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి పుష్కరిణిలో భక్తులకు అనుగ్రహిస్తారు. చివరిరోజు 13వతేదీ ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈ సందర్భంగా మార్చి 9,10తేదీల్లో రెండురోజులు సహస్ర దీపాలంకారసేవ, 11,12,13తేదీల్లో ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.

pnb Housing Finance Limited

నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22, కె.జి. మార్గ్, న్యూఢిల్లీ-110001. ఫోన్లు : 011-23357171, 23357172, 23705414, వెబ్ www.pnbhousing.com

శాఖా కార్యాలయం : ప్లాట్ నం. 39-3, 2వ అంతస్తు, M.G. రోడ్, కళాంజలి షోరూమ్ దగ్గర, విజయవాడ-520010.

తేదీ నాటికి సవరించిన విధంగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 3(1)లో చదువబడే, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ III యొక్క సెక్షన్ 13(2) క్రింద పత్రికా ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ("చట్టం"గా ఇటుపై రిఫర్ చేయబడును) మరి విజయవాడ కార్యాలయం ఉన్న ప్లాట్ నం.39-3, 2వ అంతస్తు, ఎం.జి.రోడ్డు, కళాంజలి షోరూమ్ దగ్గర, "విజయవాడ-500010"వే రాష్ట్రర్ III యొక్క సెక్షన్ 13(2) క్రింద, "PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("PNBHFL" గా ఇటుపై రిఫర్ చేయబడును) డిమాండు నోటీసును జారీ చేసినారు. ఇన్‌స్టాల్‌మెంట్లు/వడ్డీ తిరిగి చెల్లించని కారణంగా రికార్డు బ్యాంక్ ఆఫ్ ఇండియా/నేషనల్ హౌసింగ్ బ్యాంక్ మార్గదర్శకాలు ప్రకారం మీ అకౌంట్లను నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడిన కారణంగా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు/సహరుణగ్రహీతలు/హామీదారులందరికీ మా అధీకృత అధికారి

వార్త

మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగాని, మరింకా దేనిమీదనో గాని ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

-రాఫెల్

పౌష్టికాహారలేమిలో భారతావని

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా, మరెన్ని లక్షల కోట్ల రూపాయలు వెచ్చించినా, వెచ్చిస్తున్నా ప్రజలను పౌష్టికాహార లోపం నుండి గట్టెక్కించలేకపోతున్నారు. ఇప్పటికే దేశంలో కోట్లాది మంది పౌష్టికాహార లోపంతో, రకరకాల సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రపంచ జనాభాలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న బాలల్లో ఇరవైశాతంపైగా భారతావనిలోనే ఉన్నారని ఐక్య రాజ్యసమితి నివేదికలో ఏనాటి నుంచో ఘోషిస్తున్నాయి. ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో దాదాపు నలభైశాతం మంది పిల్లలు తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఆరేడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని మరెన్నో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ భూమ్మీద పుట్టినవారు ఎవరికైనా జీవించే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే బాధ్యత వహించాల్సిన పాలక పెద్దలు తల్లీ బిడ్డకు పౌష్టికాహారం అందివ్వలేకపోవడం కూడా పాలకుల బాధ్యతారాహిత్యం కిందకే వస్తున్నది. దేశంలో కొత్త పథకాలు ప్రవేశపెట్టకపోతేపోయారు. ఉన్న పథకాలను ఏమేరకు అమలు చేస్తున్నారు? అర్హులైనవారిలో ఎంత మందికి అందిస్తున్నారు? అధ్యయనం చేయడమే కాదు పటిష్టమైన పర్యవేక్షణ కూడా అవసరం. పర్యవేక్షణా లోపం కారణంగా పేదలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారిపడుతున్న విషయం ఎన్నోసార్లు వెలుగు చూసినా నిర్దిష్ట చర్యలు లేకపోవడంతో నిరాటంకంగా కొనసాగుతున్నది. దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా కూడా పౌష్టికాహార లోపం పెరిగిపోతుందనే చెప్పొచ్చు. ఇటీవల ప్రపంచ ఆహార నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం పౌష్టికాహార లోపంతో బాధపడేవారి సంఖ్య దాదాపు ఎనభైకోట్లకుపైగా చేరుకున్నట్లు చెప్తున్నారు. 2014తో పోలిస్తే 30 శాతం అధికం. భారత్‌లో పౌష్టికాహారం ప్రధానంగా సూక్ష్మపోషకార సమస్య అధికంగా ఉంది. 2019-20 మధ్యకాలంలో భారత్‌లో పదహారు శాతం, పాకిస్థాన్‌లో పదిహేడు శాతం ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇక ప్రపంచ వ్యాప్తంగా పోషకాహార లోపంతో బాధపడుతున్నవారిలో మూడోవంతు భారత్‌లోనే ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే వెల్లడిస్తున్నది. దేశంలో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. లక్షలాది మంది ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. 1975లోనే ఆరేళ్లలోపు పిల్లలు, తల్లులకు పౌష్టికాహారం అందించేందుకు ఆనాటి కేంద్రప్రభుత్వం సమీకృత శిశుఅభివృద్ధి పథకాన్ని (ఐసిడిఎ) ప్రవేశపెట్టింది. ప్రధాని మాతృవందన యోజన, పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, తదితర కార్యక్రమాలు ఎన్నో జరుగుతున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు పిల్లలకు కోడిగుడ్లు కూడా అందిస్తున్నారు. అయినా భారత్‌లో ఈలోపం ఎందరినో పట్టిపీడిస్తున్నది. 2022 ప్రపంచ ఆకలి సూచీలో భారత్ 121 దేశాల్లో 107వ స్థానంలో ఉంది. పౌష్టికాహార లోపం కారణంగా ఆరోగ్య పరంగా ప్రధానంగా మహిళల్లోనూ, చిన్నారుల్లోనూ అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. జార్ఖండ్, మహారాష్ట్ర, అసోం, గుజరాత్, తదితర రాష్ట్రాల్లో పౌష్టికాహార లోపాలు అధికంగా ఉన్నాయి. పదిహేనేళ్ల బాలికల నుండి యాభైయేళ్లలోపు మహిళల్లో దాదాపు యాభైఏడు శాతం వరకు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎనభైశాతానికి పైగా సూక్ష్మపోషకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పోషకాలు కలిగిన బియ్యాన్ని అందించే కార్యక్రమం కొనసాగుతున్నది. దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల ముప్పైఐదు లక్షల మందికి అన్నార్తులకు ఉచితంగా తిండిగింజలు అందించే పంపిణీ కార్యక్రమం మరో ఐదేళ్లపాటు కేంద్రప్రభుత్వం పొడిగించింది. దీనికితోడు ఆయా రాష్ట్రాలు కొన్ని ప్రత్యేక పథకాలు కూడా చేపడుతున్నాయి. 2030 నాటికి తీవ్రమైన పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు మూడువేలమూడువందల కోట్ల రూపాయల వ్యయంతో ప్రత్యేక పథకాన్ని తెచ్చి ఒడిశా ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఇంకా కొలిక్కిరాలేదు. పథకాలు, ఉద్దేశ్యాలన్నీ సక్రమంగానే ఉన్నా సంతృప్తి కలిగించే విధంగా కన్పిస్తున్నా ఆచరణకు వచ్చేసరికి చాలావరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. దళారుల ప్రమేయం పెరిగిపోతున్నది. వాస్తవంగా చూసినా గత రెండు దశాబ్దాలుగా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో కొరత లేదు. రికార్డుస్థాయిలో దిగుబడులు వస్తున్నాయి. ఆహారోత్పత్తులు భారీగా పెరుగుతున్నా అందరికీ రెండు పూటల ఆకలి తీర్చేందుకు తిండిగింజలు అందించలేకపోతున్నారు. మరొకపక్క పాఠశాలల్లో పారిశుధ్య సౌకర్యాలులేకపోవడం వల్ల అంటువ్యాధుల కేంద్రాలుగా మారుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడం, కనీస పరిశుభ్రత పాటించకపోవడంతో సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఇక సమగ్ర శిశు అభివృద్ధి పథకం కింద మాతాశిశు సంరక్షణ కోసం పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని 'కాగ్' ఏనాటి నుంచో హెచ్చరిస్తున్నది. ఆ నివేదికను పట్టించుకునేవారే లేరు. ఇది పాలకులకు తెలియందికాదు. కొత్త పథకాల గురించి ఆలోచించకపోయినా కనీసం ఉన్న పథకాలను పటిష్టంగా అర్హులైన అందరికి అందించేలా పర్యవేక్షణ పెంచితే కొంతమేరకైనా లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

> మీకు వీలైనంత వరకూ ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఉండండి. అది కారు చౌక అయిన ఔషధం.

బైరన్

> మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.

స్వీడెన్ బర్గ్

ప్రజావాక్కు

అమలు కాని హామీలెందుకు?

ఎలక్షన్లలో అలవికాని డబ్బుతో కూడిన హామీ లివ్వడం, ఓట్లు సంపాదించుకుని పదవిలోకి రావడం, ఆ తరువాత డబ్బులేదనే వంకతో ఇచ్చినహామీలను తుంగలోకి తొక్కడం రెండు తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న వాస్తవ పరిస్థితి. ఉదహరణకు తెలంగాణాను పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ మానిఫేస్టోలో చేయూత పథకం కింద ఫించన్‌ను నాలుగు వేలు, ఆరు వేలు పదవిలోకి వచ్చిన వందరోజులలో పెంచుతామని హామీ ఇచ్చారు. సంవత్సరం దాటింది. ఈవిషయం గురించి కొంత కాలం గొంతెత్తి అరచిన బి.ఆర్.ఎస్. కూడా ఈ ప్రస్తావన తేవడం లేదు. అలాగే స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించడం కష్టమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ హామీలను అమలు పరచలేమని పత్రికాముఖంగా చెప్పింది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

ఆరోపణల నిగ్గు తేల్చాలి!

ఎపి ఫైబర్‌నెట్ ఛైర్మన్ కొద్ది రోజులక్రితం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్‌కుమార్ ఐఎఎస్ రాజద్రోహానికి పాల్పడినట్లు, ఆయన వలన సంస్థకు వందల కోట్ల రూపాయలు నష్టం జరుగుతున్నదని మీడియా ముందుకు వచ్చి బహిరంగ ఆరోపణలు చేశారు. ఇదే విషయం ఆయన ముఖ్యమంత్రి గారికి నివేదిస్తే తనకు ఇంటెలిజెన్స్ ద్వారా పూర్తి సమాచారం ఉందని చెప్పినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. అలాగే గతప్రభుత్వం హయాంలో ఈ సంస్థలో పలురకాలుగా దోపిడీ జరిగినట్లుపత్రికల్లో పుంఖాను పుంఖాలుగాకథనాలువచ్చాయి. ఈవిషయంలో ముఖ్యమంత్రి ఆలస్యం చేయకుండా వెంటనే విచారణ జరిపించాలి.

- గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన గొర్రెలపంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఇది ప్రాథమిక రంగం వృద్ధిరేటును మరింత ఇనుమడిస్తూ అదనపు ఆదాయం పొందే వేసులుబాటును కలిగిస్తుంది. అంత మాత్రమేకాదు ఉపాధి హామీ ద్వారా గొర్రెలు మేకల షెడ్ల నిర్మాణం చేపట్టడం ద్వారావాటికి శాశ్వత గూడు చేకూర్చినట్టు అవుతుంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతంచేసే పనికి ఎందుకునిధులు విధిలించరో అర్థం కావడం లేదు.

-భారత అవినాష్, జనగామ

పేదలకు అందని వైద్యం

మధ్యతరగతి ప్రజలు కార్పొరేట్ వైద్యంలో తొలి తనిఖీ, పరీక్షలు, బెడ్‌చార్జీలు కుటుంబ భారంతో తట్టుకోలేకున్నారు. దీనికి తోడు ఈమధ్య మందుల ధరలు విపరీతంగా పెరిగినవి. జనరిక్‌లో అన్ని ఉండవు. ఈ పరిస్థితుల్లో కొందరు ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నారు. కొన్ని వ్యాధులకు ఆయుర్వేదం కుదరదు. ఆరోగ్యశ్రీ కి దాని విధానాలు సరిపడాలి. గ్రామం నుండి వైద్యశాలలు దూరంగా ఉంటాయి. ఈ లోగా అవగాహన లేక కొన్ని వ్యాధులు ముదిరి ఒక్కసారి సీరియస్ అవుతోంది. ప్రభుత్వ వైద్య శాఖల సేవలు, మందుల సరఫరా, సిబ్బంది అందుబాటు బాగా పెరగాలి. వార్డులో గదులు, నీటి సరఫరా, వాతావరణం చక్కగా ఉంటే రోగులకు తక్కువ కాలంలో స్వస్థత , నమ్మకం పెరుగుతుంది. ఈ దిశలో ప్రభుత్వం ప్రజా వైద్యానికి వనరులు పెంచితే సమాజంలో వారు బయటి ప్రైవేటు పనులు చేయుటకు సిద్ధం కాగలరు. ఆరోగ్యమే మహాభాగ్యం

-బొల్లోజు మెఘనాథం, విశాఖపట్నం

శబ్దకాలుష్యాన్ని నియంత్రించాలి

గ్రామాల్లో మైకులు, డిజెలు అధిక శబ్దంతో వినియోగించడం వలన శబ్దకాలుష్యం పెరిగిపోతోంది. శబ్దకాలుష్యానికి వ్యతిరేకంగా ఎన్నికల్లో 9సార్లు నోటావేయడం జరిగింది. పోలీసు శాఖ స్పందించి శబ్దకాలుష్యచట్టం 2000, లౌడ్‌స్పీకర్ లైసెన్స్ యాక్ట్ 2005నికఠినంగా అమలు చేయాలి. రాత్రి 10 గంటల నుండి ఉదయం 6గంటల వరకు లౌడ్‌స్పీకర్లు వినియోగించడాన్ని నిషేధించాలి. మైకుసౌండు 75డెసిబెల్స్ దాటకుండా చూడాలి. పోలీసు శాఖ అనుమతి తర్వాతే లౌడ్‌స్పీకర్లు వినియోగించాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

పిల్లలను ఒత్తిడికి గురి చేయవద్దు

ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న వేళ పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ర్యాంకుల పేరిట ఒత్తిడికి గురిచెయ్యరాదు. పిల్లలు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా చూడాలి. అక్కడక్కడ పిల్లలు ఒత్తిడికిలోను అవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పరీక్షల సమయంలో పిల్లలను గమనించవలసిన బాధ్యత ఉపాధ్యాయుల, తల్లితండ్రులపైనే ఉంది. ప్రైవేటు స్కూల్, కాలేజీ యాజమాన్యాలపై పెండింగ్ ఫీజులవిషయంలో వేధించకుండా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ఢిల్లీ అభివృద్ధి పరుగులు పెడుతుందా!

రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం. కేజ్రీవాల్‌కి ఢిల్లీలో ఎదురైన మొదటి ఓటమి గుణపాఠంగా తీసుకొని వ్యూహాత్మకంగా రాజకీయ ఎత్తుగడలు వేయకపోతే బిజెపి లాంటి బలమైనపార్టీని ఎదుర్కోవటం కష్టమ వుతుంది. ఢిల్లీలో ఎదురైన ఓటమి నుండి కాంగ్రెస్, ఆప్‌లు తమ రాజకీయ వ్యవహారాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఎదురుదెబ్బలు తగలక మానవు. ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికలలో సాధించిన విజయ స్ఫూర్తితో బిజెపి బీహార్, బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వైపు అడుగులు వేస్తుంది. అక్కడ కూడా బిజెపి విజయం సాధిస్తే మరొక దశాబ్దం పాటు భారతదేశ రాజకీయాలలో బిజెపికి ఎదురు ఉండకపోవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డాక్టర్ తిరుణహరి శేషు

ఇరవైఏడు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో మరొకమారు బిజెపి విజయం సాధించి అధికారాన్ని చేపట్టింది. ఢిల్లీకి రాష్ట్ర హోదా ప్రకటన తరువాత 1993లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికలలో మాత్రమే విజయం సాధించిన బిజెపికి ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో గెలుపుఅందని ద్రాక్షగానే మారింది. వరుసగా మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ మరొక మూడు పర్యాయాలు ఆమ్ ఆద్మీ పార్టీలు ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో విజయం సాధిస్తే, 8వసారి జరిగిన శాసనసభ ఎన్నికలలో మాత్రం అధికార ఆప్‌ని ఓడించి 48 శాసనసభ స్థానాలలో విజయం సాధించి ఢిల్లీలో బిజెపి అధికారాన్ని హస్తగతం చేసుకుంది. సుదీర్ఘ విరామం తర్వాత ఢిల్లీలో అధికారాన్ని కైవసం చేసుకున్న బిజెపి ఢిల్లీకి ముఖ్యమంత్రిగా రేఖా గుప్తాని వ్యూహాత్మకంగా ఎంపిక చేసిందనే చెప్పాలి. న్యూఢిల్లీ శాసనసభ నియోజకవర్గంలో ఆప్ జాతీయ కన్వీనర్ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ని ఓడించి జైంట్ కిల్లర్‌గా పేరు తెచ్చుకున్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహెబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేష్ వర్మని ముఖ్యమంత్రిగా ఎంపిక చేస్తారనే ఊహాగానాల నడుమ కేజ్రీవాల్ బనియా సామాజిక వర్గానికే చెందిన రేఖా గుప్తాని బిజెపి అధిష్టానం ముఖ్యమంత్రిగా ఎంపికచేసింది. సుష్మాస్వరాజ్, షీలా దీక్షిత్, అతిశీల తరువాత ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తున్న నాలుగవ మహిళ రేఖ గుప్తా తనతో పాటు ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడిన పర్వేష్ వర్మని ఉప ముఖ్యమంత్రిగా మరొక పోటీదారు విజేందర్ గుప్తాను స్పీకర్‌గా బిజెపి అధిష్టానం ఎంపిక చేసింది. గత కొంతకాలంగా ముఖ్యమంత్రుల ఎంపికలో బిజెపి అధిష్టానం వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తుంది. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన రాజస్థాన్ ముఖ్యమంత్రి భజనలాల్ శర్మ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఎంపికను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయీ, ఒరిస్సా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్, మాజీ ఎంపికలను భవిష్యత్తు రాజకీయ అవసరాల మేరకే వారిని ముఖ్యమంత్రిలుగా భారతీయ జనతాపార్టీ ఎంపిక చేసిందనే చెప్పాలి. ముఖ్యమంత్రుల ఎంపికలో బిజెపికి కాంగ్రెస్‌కి చాలా తేడానే కనిపిస్తుంది. గుజరాత్ ఎన్నికలకు ముందు విజయ్ రూపానిని మార్చి భూపేంద్ర భాయ్‌పటేల్‌ని ఎంపిక చేసి బిజెపి గుజరాత్‌లో విజయం సాధిస్తే రాజస్థాన్ శాసనసభ ఎన్నికలకు ముందు అశోక్ గెహ్లోట్‌ని మార్చకుండా కాంగ్రెస్ ఆ రాష్ట్రఎన్నికలలో ఓడిపోయింది. ముఖ్యమంత్రిల ఎంపికలో బిజెపి అసాధారణ స్థాయిలో నిర్ణయాలు తీసుకుంటుంది. గోవా ముఖ్యమంత్రి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ఓడిపోయినా మళ్లీ వారినే ముఖ్యమంత్రులుగా బిజెపి అధిష్టానం ఎంపిక చేసిందనే విషయాన్ని గమనించాలి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా బిజెపి, కాంగ్రెస్, ఆప్‌లు పోటీపడి హామీలు ఇచ్చాయి. బిజెపి ఒక అడుగుముందుకేసి ఉచితాలకు వ్యతిరేకమని చెప్పే పార్టీ కూడా ఓటర్లను ఆకర్షించడానికి గెలుపు కోసం ఆమ్ ఆద్మీపార్టీతో పోటీపడుతూ అనేక హామీలను ఇవ్వడం జరిగింది. బిజెపి ఇచ్చిన హామీలతో ఆప్‌కి ప్రధాన ఓటు బ్యాంకు అయిన మురికివాడలలోని ప్రజలు మధ్య

తరగతి ప్రజలు మహిళలు బిజెపి వైపుకి మొగ్గటం వలనే గత రెండు ఎన్నికలలో సింగిల్ డిజిట్‌కి పరిమితమైన బిజెపి ఏకంగా ఈ పర్యాయం అధికారాన్ని కైవసం చేసుకుంది. బిజెపి ఇచ్చిన ప్రధాన హామీలలో మార్చి 8మహిళా దినోత్సవం నుండి మహిళలకి నెలకి 2500ఇచ్చే పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు. అలాగే ఆయుష్మాన్ భవ కూడా ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రేఖాగుప్తా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినరోజే యమునా హారతి ఇచ్చి యమునా ప్రక్షాళన చేపడుతున్నామని ప్రకటించారు. సంకల్పపత్రలో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కొత్తగా కొలువు తీరిన ప్రభుత్వంపై ఉంది. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఢిల్లీ రూపురేఖలను మారుస్తామని ఢిల్లీ ప్రజలకు కల్పించిన ఆశలను భారతీయ జనతా పార్టీ నెరవేర్చాలి. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ నిర్ణయాలకి లెఫ్టినెంట్ గవర్నర్‌తో అడ్డుకునే ప్రయత్నం బిజెపి చేసిందని అనేక సందర్భాలలో ఆరోపణలు వచ్చాయి. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వానికి అంతిమ నిర్ణయ అధికారం ఉంటుందని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్రం లెఫ్టెనెంట్ గవర్నర్ నిర్ణయాలే చెల్లుబాటు అయ్యేవిధంగా కేంద్రం ఆర్డినెన్స్ కూడా తీసుకొచ్చి నాటి ఢిల్లీ ప్రభుత్వాన్ని బిజెపి అడ్డుకునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు కూడా వచ్చాయి. కానీ ఇప్పుడు కేంద్రంలో రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండటం వలన ఢిల్లీ అభివృద్ధి పరుగులు పెడుతుందనే ఆశలు కల్పించారు. కాబట్టి ఆ ఆశలను నెరవేర్చాల్సిన బాధ్యత బిజెపిపైనేఉంది. తమకు నచ్చని ప్రభుత్వాలు తమ కూటమితో లేని ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాలలో ఉంటే ఆరాష్ట్రాల అభివృద్ధి సంక్షేమంలో సహకరించకపోవటం సమైక్య స్ఫూర్తికి విరుద్ధమనే విమర్శలు వస్తున్నాయి. విపక్షాలు అధికారంలో ఉన్నబెంగాల్ కేరళ, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు ప్రభుత్వాలు కేంద్రంపై ఇవే ఆరోపణలు చేస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలు రావటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఆమ్ ఆద్మీ పార్టీ 2013లో అధికారంలోకి వచ్చి ఒక దశాబ్దానికి పైగా ఢిల్లీలో అధికారంలోఉంది. ఢిల్లీ కేంద్రంగానే ఆప్ అనతి కాలంలోనే ఇతర రాష్ట్రాలకు విస్తరించి పంజాబ్‌లో అధికారంలోకి రావటమే కాదు జాతీయ పార్టీ స్థాయికి కూడా ఆమ్ ఆద్మీ పార్టీ ఎదిగింది. ఢిల్లీలో ఆప్‌గెలిచినప్పుడు మిగతా పార్టీలు దారుణ ఓటమి చెందాయి. కానీ ప్రస్తుతం జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ఆమ్‌ఆద్మీపార్టీ 22 శాసనసభ స్థానాలలో విజయం సాధించి బలమైన ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాడే బాధ్యతను ప్రజలు ఆప్‌కి కట్టబెట్టారు. కాబట్టి ఆప్ ఢిల్లీలో ఒక నిర్మాణాత్మక ప్రతిపక్షపాత్రను పోషించాలి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వ సంక్షేమపథకాలను కొనసాగిస్తామని హామీని భారతీయ జనతా పార్టీ ఇచ్చింది. కాబట్టి పాత పథకాలను కొనసాగించే విధంగా కొత్త పథకాలను అమలు చేసేవిధంగా ఆప్ ప్రధాన ప్రతిపక్షంగా ఢిల్లీ ప్రభుత్వంపై ఒత్తిడితేవాలి. ఆమ్ ఆద్మీ పార్టీకి ఇది ఒక మంచి అవకాశం. పార్టీ పెట్టగానే అధికారంలోకి వచ్చి అధికారం అనుభవించిన పార్టీ ఇప్పుడు ప్రతిపక్ష పార్టీగా అధికారం లేకుండా ప్రజలపక్షాన పోరాడి మరింత రాజకీయ పరిణితిని పరిపక్వతను పొంది భవిష్యత్తులో బలమైన పార్టీగా ఎదగాలి. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజం. కేజ్రీవాల్‌కి ఢిల్లీలో ఎదురైన మొదటి ఓటమి గుణపాఠంగా తీసుకొని వ్యూహాత్మకంగా రాజకీయఎత్తుగడలు వేయకపోతే బిజెపి లాంటి బలమైనపార్టీని ఎదుర్కోవటం కష్టమవుతుంది. ఢిల్లీలో ఎదురైన ఓటమి నుండి కాంగ్రెస్ ఆప్‌లు తమ రాజకీయ వ్యవహారాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో రాజకీయంగా మరిన్నిఎదురుదెబ్బలు తగలకమానవు. ఢిల్లీలో ఆప్ ఓటమి తర్వాత కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికలలో సాధించిన విజయ స్ఫూర్తితో బిజెపి బీహార్, బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వైపు అడుగులు వేస్తుంది. అక్కడ కూడా బిజెపి విజయం సాధిస్తే మరొక దశాబ్దం పాటు భారతదేశ రాజకీయాలలో బిజెపికి ఎదురు ఉండకపోవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ●

విద్యుత్ చార్జీలు పెంచకపోవటమే కాదు, తగ్గించాలి

తిరుమలశెట్టి సాంబశివరావు

మొన్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం మన రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచబోవటం లేదని ప్రకటించారు. కానీ ఆ ప్రతిపాదన ఒక్కటే సరిపోదు. గతంలో వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేరున అడ్డగోలుగా బస్సు,విద్యుత్ ఛార్జీల వంటివి భారీగా పెంచి సామాన్యుల నడ్డి విరిచిందని అన్ని విపక్షాలతోపాటు అప్పటి ప్రధాన ప్రతిపక్షమైన తెలుగు దేశం కూడా తీవ్రంగా ఆందోళన చేసింది. అంతకు ముందు నెలకు 200 యూనిట్లలోపు సాధారణ గృహ వినియోగదారులకు యూనిట్ ఒక్కటికి రెండు మూడు రూపాయల చొప్పున నెలకు నాలుగైదు వందల రూపాయల బిల్లులు వస్తే వైసీపీ ప్రభుత్వ హయాంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకానికి ట్రూఅప్ చార్జీలు, రకరకాల సెస్సుల పేర్లతో విద్యుత్ సంస్థలు నెలనెలా వేయి రూపాయల పైగా బిల్లుల రూపంలో సామాన్య గృహ వినియోగదారుల నుండి వసూలు చేశాయి. ఇప్పటికీ ఆ ఆధిక చార్జీలు వసూలు చేస్తున్నాయి. మరోవైపు నెలకు కనీస విద్యుత్ వాడకం 200 యూనిట్లుగా వుంటుందని ప్రభుత్వం వారు నిర్ణయించి యస్సీలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు. కానీ ఇతర వర్గాల సామాన్యులు వాడుకునే అదే 200 యూనిట్ల లోపు కనీస వాడకపు బిల్లులు మాత్రం వేయి రూపాయలకు తగ్గకుండా సామాన్యులకు తడిసి మోపెడు అవుతున్నాయి. నేడు విద్యుత్ కూడా అందరికీ నిత్యావసరమైంది.



అదేమి విలాస వస్తువు కాదు. కనుక వారికి కూడా సహేతు కమైన ధరలకే అందజేయాలి. ప్రభుత్వం అంటే లాభనష్టాలు బేరీజు వేసుకునే ప్రైవేటు సంస్థకాదు. ఒకప్పుడు మన నేతలు సౌర, పవన విద్యుత్ ఉత్పత్తితో విద్యుత్ చార్జీలు తగ్గుతాయని భరోసా ఇచ్చారు. కానీ తగ్గకపోగా భారీగా పెంచటం దురదృష్టకరం. కొన్ని ప్రైవేట్ సంస్థలతో జరిగిన ఒప్పందాల్లో జరిగిన అవకతవకల కారణంగా విద్యుత్ చార్జీలు పెరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. కనుక ఈ ప్రభుత్వం కూడా తమిళనాడు ప్రభుత్వం వలెప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని గత ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవటమే గాక ఏనుగులు పోయేకంతను వదిలి చీమలు దూరేకంతను మూసినట్లు ఎంతో ఖర్చుతో కూడిన అదానీ కంపెనీ ఇచ్చే స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలి. చార్జీల భారం తగ్గిస్తుందనీ, పరిపాలన గాడిలో పెట్టగలదని ఆశించి ఓటర్లు తెలుగు దేశాన్ని గెలిపించారు. కనుక గత ప్రభుత్వం పెంచిన ఆ చార్జీల భారం తగ్గించవలసిన నైతిక బాధ్యత ఈ ప్రభుత్వం పైనే వుంది. నానాటికి ద్రవ్యోల్బణం, ధరలు, చార్జీల భారం పెరుగుతుంటే కొద్దిమంది సంపన్న, ఉద్యోగ అధిక ఆదాయ వర్గాల వంటి వారు తట్టుకోగలిగారు గాని అత్యధిక శాతం ప్రజల ఆదాయం మాత్రం పెరగక ఇక్కట్లు పడుతున్నారు కనుక ఈ ప్రభుత్వమైనా గత ప్రభుత్వం పెంచిన పన్నుల భారం తగ్గిస్తే సామాన్య ప్రజానీకానికి మేలు జరుగుతుంది. ఇది అవకతవకలకు ఆస్కారం లేనీ, అందరికీ సమన్యాయం చేసే సంక్షేమ పథకంగానే భావించాలి. ●

ప్ర'యాగం'లో ఏదీ జల'సంస్కారం'!

వరిగొండ కాశీ విశ్వేశ్వర రావు

ఇది భారతీయ సనాతన సంస్కృతిలో ఒక భాగం. పుణ్యనదుల్లో స్నానానికి, ఆచమనీయానికి స్వచ్ఛమైన నీరే ఉంటుందనే భావనతో భక్త

శివరాత్రి కోటప్పకొండ తిరునాళ్లకు ఏర్పాట్లుపూర్తి

- రాష్ట్ర పండుగ హోదాలో వేడుకలకు సిద్ధం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా త్రికోటేశ్వరుని సందర్శించుకునే భక్తుల సౌకర్యార్థం అన్నీ ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సోమవారం కోటప్పకొండలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, రవాణా, శానిటేషన్, భక్తులకు తాత్కాలిక వసతి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మహాశివరాత్రి తిరునాళ్లను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్న నేపద్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ప్రాంతం కావడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. దూరప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఇబ్బందిలేకుండా చూడాలని సమాచార కేంద్రం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. టిడిపి ప్రభుత్వ హయంలో కోటప్పకొండ ఎంతో అభివృద్ధి చెందిందని మాజీ స్పీకర్ దివంగత కోడెల శివప్రసాద్ కోటప్పకొండ ప్రాంతంలో మౌళిక వసతులు కల్పనకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రమైన కోటప్పకొండ వైసిపి కాలంలో నిర్లక్ష్యానికి దూరమైందన్న ఆవేదనను ప్రత్తిపాటి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

చిలకలూరిపేటరూరల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

మండలంలోని గోపాళంవారిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన కాకర్లమూడి విజయ్ (13) సంవత్సరాలు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ద్విచక్ర వాహనంపై వస్తుండగా వాహనం నడుపుతున్న వ్యక్తి తన వాహనాన్ని బస్‌ను దాటవేసే సందర్భంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో బండిమీద ఉన్న విజయ్ బస్‌కింద పడటంతో మృతిచెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలో పూడికలు నిరంతరం తీయాలి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

పారిశుద్ధ్య నిర్వహణ,డ్రైనేజీలో పూడికలను నిరంతరం తీయడం జరుగుతూ ఉండాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. ప్రధాన కార్యాలయం లోని తన ఛాంబరోల ఆయన శాఖాధిపతులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనర్,మీడియం,మేజర్ డ్రైన్‌లన్ని డీ సిల్టింగ్ పనులను పూర్తి చేయాల న్నారు. నగరాన్ని గుంతల రహిత నగరంగా తీర్చిదిద్దాలని, నిత్యం పారిశుధ్య నిర్వహణ,డ్రైన్ల డీ సిల్టింగ్,పాట్ హోల్స్ నిర్వహణ జరుగుతూ ఉండాలని అధికారులను ఆదేశించారు. నగర సౌందర్యాన్ని భగ్నం చేసే సర్వీస్ ప్రొవైడర్లను పరిశీలించి, వాటిని తొలగించాలని, నగర అందాన్ని మెరుగుపర్చేందుకు నమూనాగా ఒక రోడ్డుని వైర్‌లు లేకుండా భూగర్భం నుండి వెళ్ళేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రెవిన్యూ శాఖ,ప్రజారోగ్య శాఖల సమన్వయంతో కమర్షియల్ టాక్స్ టౌన్ ప్లానింగ్ శాఖ సమన్వయంతో ఖాళీ స్థలాల నుండి హౌస్ టాక్స్‌కు మారిన పన్నుల వివరాలు,ఇంజనీరింగ్ శాఖ సమన్వయంతో నీటి పన్ను వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పన్నులను వసూలు చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమీషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్,డిప్యూటీ కమీషనర్ రెవిన్యూ జి.సృజన,చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్,ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు,జోనల్ కమీషనర్లు రమ్య కీర్తన,ప్రభుదాస్,సూపరింటెండింగ్ ఇంజనీరుల పి.సత్యన్నారాయణ,పి.సత్యకుమారి,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్,రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు,ఎగ్జామినేటర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి,ఎకౌంట్స్ ఆఫీసర్ సత్యన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ సాధించిన అనీల్‌రెడ్డి

రొంపిచర్ల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

రొంపిచర్ల మండలానికి చెందిన అనీల్‌రెడ్డి ఓపెన్ ఏషియ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్-2025లో గోల్డ్‌మెడల్ సాధించారు. మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో అనీల్‌రెడ్డి జన్మించారు. రైతుగా ఉన్న మూలే రామిరెడ్డి ఎంతో క్రమశిక్షణతో అనీల్‌రెడ్డికి విద్యాభ్యాసాలు చెప్పించారు. ఓపెన్ ఏషియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొన్న అనీల్‌రెడ్డి బంగారు పతకం సాధించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఆయన పిడుగురాళ్ళలో బిఎస్ఎన్ఎల్‌లో జూనియర్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఘనంగా ఏకాదశి పర్వదినం

- త్రికోటేశ్వరుని చెంతకు తరలివచ్చిన భక్తజనం - స్వామివారికి ప్రత్యేక పూజలు

నరసరావుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో ఏకాదశి పర్వదినం భక్తజన రంజకంగా సాగింది. త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు స్వామివారి వద్దకు వచ్చారు. అదే విధంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుండి యాత్రికులు కోటప్పకొండకు తరలివచ్చారు. ఏకాదశి పర్వదినం రోజున సోమవారం కలిసి రావడంతో పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహా శివరాత్రి పర్వదినానికి రెండు రోజులు ముందుగా వచ్చే పవిత్రమైన ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తే దైవ ఆశీస్సులు అందుతాయనే నమ్మకంతో వేల సంఖ్యలో భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదే విధంగా కొండ పై భాగంలో ఉన్న పర్యాటక కేంద్రంలో పిల్లల రాజ్యం, కాలిందిమడుగు, జింకల పార్కులు, నెమళ్ళ పార్కులు, అక్వేరియం, కుందేళ్ళ పార్కు, బ్రహ్మ విష్ణు, ముగ్గురు అమ్మల విగ్రహాల వద్ద, గణనాధుని విగ్రహం వద్ద భక్తుల సందడి అధికంగా కనిపించింది. ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ వాహనాలు పెద్ద సంఖ్యలో ప్రయాణికులను కోటప్పకొండకు తరలించాయి.

త్రికోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు...

త్రికోటేశ్వరునికి తెల్లవారుజాము నుండే ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణలను, అభిషేకాలను, పూజలను ప్రారంభించారు. సాధారణ భక్త జనంతో పాటు విఐపిలు, ప్రముఖులు, రాజకీయ ప్రతినిధులు ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. దీంతో పాటు అభిషేక మండపంలోనూ ప్రత్యేక కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. క్యూలైన్లలో భక్తులు అధిక సంఖ్యలో కనిపించారు. స్వామివారి ఉచిత దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. అదే విధంగా లడ్డు, అరిసె ప్రసాదాల కొరకు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుండి ప్రారంభమైన పూజలు, అభిషేకాలు రోజు మొత్తం కొనసాగుతూనే ఉన్నాయి. అదే విధంగా మెట్ల మార్గంలో పూజా కార్యక్రమాలను స్వామిచెంత వరకు భక్తులు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు నాగేంద్రస్వామి పుట్ట వద్ద, చెట్టు వద్ద దీపారాధనలు చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అదే విధంగా పొంగళ్ళు పొంగించి ప్రసాద వితరణ చశారు. దీంతో పాటు గొల్లభామ గుడి వద్ద, పాత కోటయ్యస్వామి గుడి వద్ద, సాలంకయ్య గుడి వద్ద ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. తొలుత భక్తులు పుణ్యస్నానాలను సాగర్ కాలువలో ఆచరించారు.

అలరించిన బాల ప్రభలు, మొక్కుబడి ప్రభలు .....

ఏకాదశి సందర్భంగా బాల ప్రభలు, మొక్కు బడి ప్రభలు పెద్ద సంఖ్యలో కోటప్ప కొండకు ఆదివారం తరలివచ్చాయి. ప్రభల నిర్వాహ కులు స్వామివారికి మొక్కు సందర్భంగా బాల ప్రభలతో పాటు మొక్కుబడి ప్రభలను పాదయాత్రతో, వాహనాలపై కొండకు తరలిం చారు. పట్టణ, పరిసర గ్రామాల నుండి ప్రభలు తరలివచ్చాయి. బాల, మొక్కుబడి ప్రభలతో పాటు తడిక ప్రభలను కమిటీలు కొండకు తీసుకువచ్చాయి. అదే విధంగా ప్రభలను రంగురంగుల పుష్పాలతో అలంకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రైతులు ఎద్దులు, పశువులు, గొర్రెలను స్వామివారి ఆలయం చుట్టూ తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు. మెట్ల మార్గం వద్ద ఉన్న వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

అమరావతి వార్త

వర్సిటీ క్రీడాకారిణికి గోల్డ్ మెడల్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త : వర్సిటీ క్రీడాకారిణికి 38వ జాతీయ మహిళా క్రీడా పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధిం చింది. జనవరి 28నుంచి ఈనెల 14వ వరకు ఉత్తరా ఖండ్‌లో జరిగిన 38వ జాతీయ మహిళా క్రీడల్లో శ్రీవెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల సెకండ్ బిసిఏ విద్యార్థిని నాగిడి గాయత్రి అద్వితీయ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించినట్లు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పిపిఎస్ పాల్‌కుమార్ తెలిపారు.ఈమేరకు సోమవారం నాగిడి గాయత్రి తో యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గంగాధరరావు నాగిడి గాయత్రిని అభినందించారు.యూనివర్సిటీకి మరిన్న బంగారు పతకాలు తీసుకురావాలని కోరారు.ఎస్‌విఆర్‌ఎం కళాశాల(నగరం),వ్యాయామ అధ్యాపకులు వి.సాంబమూర్తి,యూనివర్సిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లాలో 36 సెంటర్లలో ఇంటర్మీడియట్ పరీక్షలు
- పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 19,219మంది

బాపట్ల, ఫిబ్రవరి24, ప్రభాతవార్త

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు.సోమవారం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష నిర్వహణపై వీక్షణ సమావేశం ద్వారా చీఫ్ సూపర్డెంట్లలతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుతాయని ఆయన అన్నారు. జిల్లాలో 36 సెంటర్లలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 19వేల219 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. మొదటి రోజు మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్ష, రెండవరోజు ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగు తుందన్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం కొరకు ఏపీఎస్ఆర్టీసీ కు బస్సు బయలుదేరు స్థలము, పరీక్షా కేంద్రం వివరములను, బయలుదేరు సమయం తెలుపుతూ లేఖ వ్రాయాలన్నారు. విద్యార్థులకు ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల న్నారు.ప్రతి విద్యార్థిని ఉదయం 8:30కు పరీక్షా కేంద్రంలో ప్రవేశానికి అవకాశం కల్పించాలన్నారు. 9 గంటల తర్వాత ఎవరిని పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబడదని అన్నారు. పరీక్షా కేంద్రం చుట్టుపక్కల మండల రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 144 సెక్షన్ నిర్వహించబడుతుందన్నారు. దీనికి సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్ ఎమ్మార్వోలకు లేఖ వ్రాయలన్నారు.పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లు తక్కువ ఉంటే సంబంధిత ఎంఈఓ లకు తెలిపి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంకు నిర్దేశించిన సెట్ పేపర్లు 1,2,3 అనేది ఆ రోజు ఉదయం ఇవ్వబడుతుందన్నారు. పోలీస్ స్టేషన్ కు వెళ్ళి ఆ ప్రకారంగా సెట్ ప్రశ్నపత్రాలను తీసుకోవాలని ఆయన తెలిపారు.సందేహాలు ఉంటే డిఇఓ తో సంప్రదించాలని చీఫ్ సూపరింటెండెంట్లకు ఆయన తెలిపారు. ప్రశ్నాపత్రాలు తీసుకొనుటకు ఉదయం 8 గంటలకు పేపర్ కస్టోడియన్లు అందరూ పోలీస్ స్టేషన్ కు వెళ్లాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు అందరూ ఉదయం 8:15 నిమిషాలకు పోలీస్ స్టేషన్ కు చేరుకోవాలన్నారు. 8:30 నిమిషాలకు ప్రశ్నా పత్రాలను బాక్స్ నుండి బయటకు తీయాలన్నారు. ఆ ప్రశ్న పత్రాలను పోలీసు వారి సహాయంతో నాలుగు చక్రాల వాహనంలో మాత్రమే ఆయా పరీక్షా కేంద్రాలకు తీసుకువెళ్లాలని ఆయన తెలిపారు. ప్రశ్న పత్రాలను తీసుకువెళ్లేటప్పుడు ఎవరైనా ఫోటోలు తీసిన యెడల, పేపర్ లీక్ అయిన ఎడల చీఫ్ సూపరింటెండెంట్లు బాధ్యత వహించాలన్నారు. ప్రశ్న పత్రము పోలీస్ స్టేషన్ నుండి పరీక్షా కేంద్రానికి, జవాబు పత్రాలు పోస్ట్ ఆఫీస్ కు తీసుకువెళ్లడానికి రోజుకు రూ. 250 మంజూరు చేయబడుతుందన్నారు. పిల్లలు ఎవరైనా మాల్ ప్రాక్టీస్ కు పాల్పడినచో నిబంధన మేరకు ఆయా రిజిస్టర్ లలో నమోదు చేయాలన్నారు. మీడియా ప్రతినిధులకు పరీక్షా కేంద్రాలలోనికి అనుమతి లేదన్నారు. అధికారులు ఎవరైనా పరీక్షా కేంద్రానికి వచ్చిన యెడల వారి వివరాలను విజిటర్స్ రిజిస్టర్ లో నమోదు చేయించాలని ఆయన తెలిపారు. జవాబు పత్రంలో 24 పేజీల బుక్ లెట్ ఉంటుందన్నారు. విద్యార్థికి బుక్ లెట్ ఇచ్చినప్పుడు 24 పేజీలు ఉన్నాయో లేదో ఒకసారి చూసుకోవాలని ఆయన తెలిపారు. వాటిలో పేజీలు తక్కువగా ఉన్న లేదా చిరిగిన వాటిని మార్చాలన్నారు. పేపర్ లీకేజ్ సమస్య రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. పేపర్ లీకేజీ వలన ప్రభుత్వ, రాష్ట్ర, జిల్లా పరిపాలన పరపతిని దెబ్బతీస్తుంది ఆయన అన్నారు. పేపర్ లీకేజ్ జరిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు. చీఫ్ సూప రింటెండెంట్, శాఖపర సిబ్బంది వారికి ఇచ్చిన హ్యాండ్ బుక్ ప్రకారం నిబంధనలను తూచా తప్పక పాటించాలని తెలిపారు. ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు.సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ విద్యాధికారి ఎర్రయ్య, సర్వ శిక్ష అభియాన్ అధికారి నాగిరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ కోదండరాం, జిల్లా పరిక్షా కమిటీ మెంబర్ సిహెచ్ సతీష్ బాబు, బి ఎ ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శేషకుమారి, చీరాల ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదాపై వైసీపీ కలలు కనొద్దు

- ఏపి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

గుంటూరు క్రైమ్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

ఏపి డిప్యూటీ సీఎం,జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వైసీపీ నాయకులకు గట్టిగా సమా ధానం చెప్పారు. గతంలో ప్రభుత్వంలో ఉన్నామని... ఇప్పుడు ప్రతిపక్ష హోదా ఇవ్వాలనివైసీపీ కోరినంత మాత్రాన ఇవ్వడం ఉందని స్పష్టంచేశారు.అసెంబ్లీ రెండో అతిపెద్ద పార్టీగా జనసేన ఉందని తెలిపారు.కనీసం జన సేన కన్నా ఒక్కసీటు ఎక్కువ వచ్చినా వారికి ప్రతిపక్ష హోదా దక్కెదన్నారు.ఏపి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి,గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు.అయితే గవర్నర్ ప్రసంగం మొదలుపెట్టగానే వైసీపీ కి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరుతూ ఆపార్టీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. ఆ తర్వాత కాసేపటికి అసెంబ్లీ నుండి వాకౌట్‌చేశారు.ఇక గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత అసెంబ్లీ వాయిదా పడింది.అనంతరం డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ వైసీపీ తీరును తప్పుబట్టారు.గవర్నర్ ప్రభుత్వం తరపున సందేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న సమయంలోవైసీపి వ్యవహరించిన తీరు బాగోలేదని విమ ర్శించారు.గత కొద్దిరోజులుగా గవర్నర్‌కు ఆరోగ్యం బాగోలేకపోయినప్పటికీ సభకు వచ్చి ప్రసంగించినం దుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లుగా పేర్కొన్నారు.వైసీపీ హుందాగా వ్యవహరిం చాల్సిన అవసరం ఉందని చెప్పారు.గొడవ పెట్టుకోవాలనే ఆలోచనతో అసెంబ్లీకి రావడం దిగజారుడు ఆలోచన విధానమని పవన్‌కళ్యాణ్ విమర్శించారు.ఈ ఐదేళ్ళలోవైసీపీకి ప్రతిపక్ష హోదారాదని ఇందుకు వారు మానసికంగా సిద్ధమై పోవాలన్నారు.ఇది సీఎం చంద్రబాబు నాయుడు,జనసేన డిసైడ్ చేసేది కాదని...రూల్స్ ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని పవన్ కళ్యాణ్ స్పష్టంచేశారు.

విద్యుత్ షాక్‌కు గురై నలుగురు వ్యక్తులు మృతి

- ఆకాశాన్నంటిన మృతుల బంధువుల రోదనలు

పెదకాకాని, ఫిబ్రవరి 24, ప్రభతవార్త

పెదకాకాని మండల పరధిలోని కాళీగార్డెన్స్ ఆశ్ర మం వద్ద గోశాల నందు సాయంత్రం విద్యుత్ షాక్‌కి గురై నలుగురు వ్యక్తులు దుర్మ రణం చెందారు. సేకరించిన వివరాల ప్రకారం సుమారు 70 ఆవులతో కూడిన గోశా లను కాళీగార్డెన్స్ వారు నిర్వ హిస్తున్నారు. గోశాలలో గోవుల సంరక్షణ పనులు చేయడానికి తెనాలి చినరావూరు గ్రామానికి చెందిన మహంకాళి(25)బాలయ్య(40) మరియు పెనమలూరు గ్రామానికి చెందిన రాజేష్(24),పల్నాడు జిల్లా సత్తైనపల్లి మండలం కట్టమూరుగ్రామానికి చెందిన కాళీబాబు (46)లు విధులు నిర్వహిస్తున్నారు.రోజువారి పనులలో భాగంగా గోశాలలో ఏర్పాటు చేసిన సంపులలోని వేస్ట్‌ను విద్యుత్ మోటారు సహాయంతో బయటకు తీయడానికి ఉపక్రమించారు పనులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్‌మోటార్ నుండి సంపులోని నీటిలోకి ప్రవహించగా సంపులో పనిచేస్తున్న ఒకరికి విద్యుత్‌షాక్ తగిలింది అతని కాపాడటానికి మరొకరు అతనిని కాపాడడానికి ఇంకొకరు చేతులు పట్టుకోవడంతో ఒకరి తర్వాత ఒకరు విద్యుత్ షాక్కు గురై నలుగురు సంపులో పడిపోయారు. ఇది గమనించిన ఇతర కార్మికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.అప్పటికే నలుగురు మృత్యువాత పడ్డారు సమాచారం అందుకున్న పెదకాకాని సిఐ నారాయణస్వామి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీయించారు.మృతుల కుటుంబాలకు సమాచారం అందడంతో మృతదేమల వద్దకు చేరుకొనొ హృదయ విదారకంగా విలపించారు.అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వసమగ్ర ఆస్పత్రికి తరలించారు.

:- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి సంఘటన జరిగిన తీరును సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. ఈసందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రోజువాకి కూలీ లుగా జీవితాన్ని గడుపుతున్న నలుగురు వ్యక్తులు ఒకేసారి విద్యుత్ షాక్ వల్ల మృతి చెందటం దురదృష్టకరమని అన్నా రు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి సయగ్ర విచారణ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్పీ వెంగ గుంటూరు ఆర్డీవో శ్రీనివాస్, తహసిల్దార్ కృష్ణకాంత్ ఉన్నారు.

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ అరుణ్‌బాబు ఆకస్మిక తనిఖీ

నరసరావుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ పి అరుణ్‌బాబు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వైద్యశాలలో సదరన్ సర్టిఫికేట్‌ల పరిశీలనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంత మంది సర్టిఫికేట్లు వెరిఫికేషన్ జరుగుతుంది. సంబంధిత ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రంగారావును వివరణ తీసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను కలిసి వారికి అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీసారు. రోజుకు ఎంత మందికి వైద్య పరీక్షలు జరుగుతున్నాయి అనే వివరాలు కలెక్టర్ పి అరుణ్‌బాబు తెలుసుకున్నారు. డాక్టర్ రంగారావు మాట్లాడుతూ నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, గురజాల, వినుకొండ, సత్తెనపల్లి నియోజకవర్గలకు సంబంధించి సర్టిఫికేట్ల వెరికేషన్ జరుగుతుందని వారు వివరించారు. అదే విధంగా ఎప్పటికప్పుడు సర్టిఫికేట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు ఆదేశాలు ఇచ్చారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ ఆఫీసర్ సంజీవరావు

పొన్నూరు, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఈ నెల 27వ తేదీన జరిగే పోలింగ్‌లో ప్రతి ఓటరు తప్పని సరిగా పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని నోడల్ అధికారి కె.సంజీవరావు, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి కె.రమాదేవి, మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళరమేష్‌బాబు ఓటర్లకు స్వీప్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ బ్యాలెట్ పేపరును సక్రమంగా సరిచూసుకొని ఎవరికైతే ఓటు వేయాలనుకొంటున్నారో వారి ఎదురుగా సంఖ్య మాత్రమే వేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటును స్వేచ్ఛగా, సమాజానికి ఉపయోగపడే నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. పట్టభద్రులు అంటే విద్యావంతులని, ఓటుపై అవగాహన ఉంటుందని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కు పొందడం ఎంత బాధ్యతో, ఓటు హక్కును వినియోగించుకోవడం కూడా అంతే బాధ్యతగా ప్రతి పట్టభద్రుడు గుర్తించాలన్నారు. బూత్ లెవల్ సూపర్‌వైజర్లు, ఆఫీసర్లు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు, పురపాలక సంఘ సిబ్బందితో పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఓటర్లతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

వైకాపా,జగన్‌ను ప్రజలు ఎప్పుడో బాయ్‌కాట్ చేశారు

- ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,ఫిబ్రవరి24,ప్రభాతవార్త

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకొని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌కు, స్పీకర్ అయ్యన్నపాత్రుడులకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. సభ సమావేశం అనంతరం జీ.వీ మాట్లా డుతూ జగన్‌కు ప్రజాస్వామ్యం పట్ల, శాసనసభ పట్ల వీసమెత్తు గౌరవం కూడా లేదని మండిపడ్డారు. సభకు ఇలా వచ్చి అలా వెళ్లే జగన్ ప్రజల పట్ల, సమస్యల పట్ల పోరాడుతారా అని ప్రశ

చట్టసభలంటే గౌరవముందా జగన్ ..?

- ప్రతిపక్ష హోదా అంటే కూడా తెలియదా ?- ప్రజలంటే చిత్తశుద్ధి ఉందా ?
- చట్టసభలపై గౌరవముందా ...? ప్రతిపక్ష హోదా అడిగితే ఇచ్చేదా ?
- కనీసం 11 సీట్లయినా ఇచ్చారు...ప్రజా సమస్యలపై ప్రశ్నించు ?
- జగన్ ను సూటిగా ప్రశ్నించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు తూర్పు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

చట్టసభలపై గౌరవముందా ? ప్రతిపక్ష హోదా అడిగితే ఇచ్చేదా? ...ప్రజలు కనీసం 11 సీట్లయినా ఇచ్చారు. గౌరవంగా శాసనసభకు వచ్చి ప్రజా సమస్యలపై ప్రశ్నించు..లేదంటే తోక ముడిచి వెళ్ళిపో..ప్రతిపక్ష హోదా అంటే ఏమిటో కూడా తెలియని జగన్ ఒక పార్టీకి అధ్యక్షుడు ఎలా అయ్యారో తెలియడం లేదు అంటూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఎద్దేవా చేశారు. సోమవారం బడ్జెట్ సమావేశాల అనంతరం ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలపై మాట్లాడటానికి కేవలం ప్రతిపక్ష నాయకుడే అయ్యుండాలా ? అని జగన్‌ను ప్రశ్నించారు. వైకాపా నాయకుల తీరు చూస్తుంటే అసెంబ్లీ సమావేశాలకు ఏదో అలా వచ్చామా ? ఇలా వెళ్ళామా ? టీవీల్లో కనిపించామా ? అన్నట్లు ఉందిగానీ, చట్టసభలపై గౌరవం ఉన్నట్లు కనిపించడం లేదని విమర్శించారు. 151 సీట్లు ఇచ్చి సిఎం కుర్చీపై కూర్చోబెడితే రాష్ట్రాన్ని రావణకాష్ఠంగా మార్చారని, అరాచకాలు, అన్యాయాలతో ప్రజలను పీడించారని గుర్తు చేశారు. అందుకే ప్రజలు 11 సీట్లతో సిఎం సీటు నుంచి కిందకు పడేశారని తెలిపారు. అసలు ప్రజలు ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారో అది తెలుసుకోకుండా ప్రతిపక్ష హోదా కోసం అడగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించాలనుకుంటే దీనికి తగిన సమయం ఇచ్చేందుకు స్పీకర్ సిద్ధంగా ఉన్నారని, జగన్‌కు ఎప్పుడూ అధికారం ధ్యాసేగానీ ప్రజల ఆరోచనలేదని పేర్కొన్నారు. బాధ్యత గల శాసనసభ్యులైతే అసెంబ్లీలో హుందాగా వ్యవహరించే వారని, జగన్ తో సహా వైసీపీ ఎమ్మెల్యేలంతా చౌకబారు ఆలోచనలతో ఉన్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజల తరపున పోరాడాలని, లేదంటే 11 సీట్లు కూడా దక్కవని ఎమ్మెల్యే నసీర్ విమర్శించారు.

వేసవిలో త్రాగునీటి సరఫరాలో ఏ సమస్య రాకుండా చర్యలు చేపట్టాలి

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు, కార్పోరేషన్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రానున్న వేసవిలో త్రాగునీటి సరఫరాలో ఏ సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఉండవల్లి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఉండవల్లి పంపింగ్ హౌస్‌ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తొలుత ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వ, ఉండవల్లి పంపింగ్ కేంద్రం నుండి ప్రతి రోజు ఎంత నీరు గుంటూరు నగరపాలక సంస్థకు డ్రా చేస్తుంది, మోటార్ల కెపాసిటి, పనితీరు తదితర అంశాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని మాట్లాడుతూ పంపింగ్ కేంద్రం ఇన్ టేక్ వెల్‌లోని 5 మోటార్లు వర్కింగ్‌లోకి తీసుకురావాలన్నారు. ఐదు మోటార్లు రన్నింగ్ ద్వారా అవుట్ సైడ్ మోటార్లను నిలిపివేయడం జరుగుతుందని, తద్వారా నీటి వృధా తగ్గడం, విద్యుత్ ఆదా జరుగుతుందని తెలిపారు. అలాగే వేసవిలో నగరంలో త్రాగునీటి సరఫరా సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఉండవల్లి పంప్ హౌస్, తక్కెళ్ళపాడు హెచ్ వాటర్ వర్క్స్ దగ్గర ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు లేకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. ఇప్పటికే రిజర్వాయర్ల వారీగా త్రాగునీటి పైపులైన్ల లీకుల మరమ్మత్తులు పూర్తి చేయాలని ఆదేశించామని తెలిపారు. అనంతరం ఆనందపేటలో అవుట్ ఫాల్ డ్రైన్ పూడిక తీత పనులను పరిశీలించి, నూరుశాతం పూడిక తీత పనులు జరగాలన్నారు. ప్రజారోగ్య, ఇంజనీరింగ్ అధికారులు పూడికతీత పనులను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ శ్రీనివాస్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు నారాయణరెడ్డి, అంజిరెడ్డి, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్మోహనరెడ్డి అండ్ కో డ్రామాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు క్రైమ్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త :

వైసిపి అధినేత,పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహనరెడ్డి అండ్ కో అసెంబ్లీలో చేసిన డ్రామాను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎద్దేవ చేశారు.సోమవారం ఏపి అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరై మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన జగన్‌రెడ్డి,ఈరోజు వరకు ప్రజాదేవాలయం లాంటి అసెంబ్లీ వైపు కన్నెత్తి చూడలేదని,అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు వేస్తారనే భయంతో అసెంబ్లీకి వచ్చి,గవర్నర్ ప్రసంగం సమయంలో వారి సభ్యులతో జగన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నినాదాల చేయించి, వాక్‌అవుట్ పేరుతో డ్రామాలు ఆడి బయటకు వెళ్లిపోవటం చూసిన రాష్ట్ర ప్రజల్లో చులకన అయ్యారని,నిన్నటి నుండి బ్లూ మీడియా మొదలు పేటియం బ్యాచ్‌వరకు చెలరేగిపోయి,"నిలదీస్తాడు, కడిగేస్తాడు"అని ఊదరగొట్టారని,కానీ జగన్‌రెడ్డి ఫోటో దిగి వెళ్ళిపోయాడని,ప్రతిపక్ష హోదా అనేది ప్రజలు,వ్యవస్తలు ఇవ్వాలి కానీ డిమాండ్ చేసి ఆందోళన చేస్తే రాదన్న విషయం జగన్‌రెడ్డికి కూడా తెలుసునని తెలుగుదేశం పార్టీ 2019ఎన్నికల్లో 23సీట్లు సాధించింది.నలుగురు ఎమ్మెల్యేలను లాగేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా పోతుందంటూ జగన్ చేసిన కామెంట్స్ గుర్తు చేస్తున్నామని గళ్ళా మాధవి తెలిపారు.ప్రజా సమస్యల పై వైసీపికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రతిపక్ష హోదానే అవసరం లేదని,అసెంబ్లీకి వస్తే చాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

తరగతిలో బోధన పరిశీలనపై సమీక్షా సమావేశం

గుంటూరు విద్య,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త :

టీచ్ క్లాస్ రూమ్స్ అబ్జర్వేషన్ మీద గుంటూరు ఈస్ట్ మండల అండ్‌గుంటూరు వెస్ట్ మండల్స్‌కు సంబంధించి రివ్యూ మీటింగ్ సోమవారం కండక్ట్ చేయడం జరిగింది.ఈ మీటింగ్‌లో మండల విద్యాశాఖ అధికారులు ఖుద్దూస్,బివి రమణయ్య,జ్యోతికిరణ్, నాగేంద్రమ్మలు పాల్గొని టీచ్ అబ్జర్వేషన్స్ ఉద్దేశించి మాట్లాడటం జరిగింది,తోట వీరయ్య స్టేట్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ ఆగస్టు 24నుంచి ఇప్పటివరకు టీచ్ అబ్జర్వేషన్స్ ఎన్ని చేశారు.ఇంకా ఎన్ని చేయాలి అని ప్రతి ఒక్క అబ్జర్వర్‌ను అడిగి తెలుసుకోవడం జరిగింది.టెక్నికల్ అంశాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించడం చేయడం జరిగింది.ప్రతినెల ఇటువంటి రివ్యూ మీటింగ్స్ కండక్ట్ చేయాలని అబ్జర్వర్స్ అందరూ అడగటం జరిగింది. టీచ్ అబ్జర్వేషన్స్ లో గుంటూరు జిల్లా రాష్ట్రంలోని అన్ని జిలాలల కంటే మొదటి స్థానంలోఉందని,దీనికి మీ అందరి కృషి కారణం అని డీఈవో సివి రేణుక అభినందించారని అన్నారు.

సాగర్ కాలువలో యువకుడు గల్లంతు

దుర్గి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

దైవ దర్శనానికి వచ్చి సాగర్ కాలువలో యువకుడు గల్లంతయ్యాడు. నర్సరావుపేట యన్‌జివో కాలనీకి చెందిన గుట్టపల్లి అయ్యప్ప అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దర్శనానికి తోటి స్నేహితుడు శ్రీనుతో కలసి వచ్చాడు. అమ్మవారిని దర్శించుకొని తిరుగు వెళ్తూ మార్గ మద్యలో అడిగొప్పల సమీపంలో సాగర్ కుడికాలువలో అయ్యప్ప స్నానానికి దిగాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న దుర్గి ఎస్సై సుధీర్‌కుమార్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు.

మండాది అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

వెల్దుర్తి మండల పరిధిలోని మండాది అటవీ ప్రాంతంలో సోమవారం మంటలు చెలరేగాయి. జాతీయ రహదారి పక్కనే ఉండటంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడున్నారు. వేసవి కాలం కావడంతో అటవీ ప్రాంతంలోని ఎండిపోయిన గడ్డి ఉన్నచోట మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. గతంలో అగ్నిమాపక శాఖ అధికారులు సకాలంలో స్పందించి మంటలు ఆపేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలు

వినుకొండ,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని వితంరాజపల్లి సాయి బృందావనం నందు అఖండజ్యోతి ప్రదాత పూజ్యశ్రీ హిమాలయ గురూజీ శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ నిర్వాహక బృందం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ఆశీస్సులు స్వీకరించి విజయవంతం చేయాలని ట్రస్ట్ ప్రతినిధులు పెండ్యాల వెంకటమోహన్, కనిగండ్ల అనంతకోటేశ్వరరావు, పెండ్యాల కాశి, పుల్వారావు, మునిరెడ్డి తదితరులు కోరారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

బాపట్ల,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దుకాణాదారులు ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్స్పెక్టర్ సి.హెచ్.కరుణ అన్నారు.బాపట్ల పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ అధికంగా విక్రయించే దుకాణాలపై సోమవారం సాయంత్రం మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆదేశాల ప్రకారం ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన భావితరాలకు, పర్యావరణానికి అనేక ఇబ్బందులు కలుగుతాయన్నారు.ప్లాస్టిక్ వినియోగం తగ్గించి గుడ్డ సంచులను మాత్రమే వినియోగించే విధంగా అలవాటు చేసుకోవాలన్నారు.ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలపై షాపుల యజమానులకు అవగాహన కల్పించామన్నారు.ఈ తనిఖీలలో దుకాణదారుల వద్ద నుండి 8 కిలోల ప్లాస్టిక్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు.ఇప్పటికే పలుమార్లు పత్రికా సాధనాల ద్వారా సోషల్ మీడియా ద్వారా పురపాలక సంఘము నుండి ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించిన దుకాణదారులు విచ్చలవిడిగా ప్లాస్టిక్ అమ్మడం పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై రాబోయే రోజుల్లో తనిఖీలలో ప్లాస్టిక్ వాడకం చేసే దుకాణాలపై తీవ్ర చర్యలు ఉంటాయని దుకాణదారులకు తెలియపరిచారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం

వినుకొండ,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

పట్టణంలోని 9వ వార్డు పాఠశాల ప్రాంగణంలో అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీసెర్చ్‌పర్సన్ పి. ప్రకాష్‌రావు, ఏ సెక్టార్ సూపర్‌వైజర్ శేషుకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయగా మండల విద్యాశాఖాధికారి సయ్యద్ జప్రుల్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీచర్లు రూపొందించిన వివిధ రకాల నమూనాలను పరిశీలించి విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడుతాయో వివరించి శిక్షణ పొందిన టీచర్లను అభినందించారు.

గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించిన ఎంపిడివో ఉమాదేవి

నూజెండ్ల,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాత చెరుకుపాలెం, ఐనవోలు, కొత్త చెరుకుపాలెం, పాత నాగిరెడ్డి పల్లె గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్స్, ఇంకుడు గుంతలను ఎంపిడివో పావులూరి ఉమాదేవి క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఏఈ అల్లాభక్షు, ఏపీవో ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన బొల్లా అసమ్మతి నేతలు

వినుకొండ,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

వైకాపా సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డిని వినుకొండ నియోజక వర్గంలోని పలువురు వైసీపీ నేతలు కలిశారు. వినుకొండ నియోజక వర్గానికి నూతన ఇంచార్జిని నియమిం చాలని కోరారు.ఈ మేరకు పార్టీ అధినేత వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డితో చర్చించి త్వరలోనే నిర్ణయిస్తామని వైవీసుబ్బారెడ్డి తెలియజేసినట్లు ఆయన్ను కలిసిననేతలు పేర్కొన్నారు.

కూటమి అభ్యర్థి ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

వినుకొండ,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

ఎన్డీయే కూటమి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం (టిఆర్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ విష్ణునాయక్, ప్రధాన కార్యదర్శి మూడావత్ మస్తాన్ నాయక్‌కు పిలుపునిచ్చారు. సోమవారం ఈ మేరకు వినుకొండ పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కృష్ణ-గుంటూరు జిల్లాల నందు గల గిరిజన పట్టభద్రులందరూ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధ్యానత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వరనాయక్, రామనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండి ఆదాయం రూ.15,52,027

దుర్గి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీఅమ్మవారి హుండీ ఆదాయం రూ.15,52,027 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి, అసిస్టెంట్ కమీషనర్ పి.సైదమ్మభాయి తెలిపారు. 45 రోజుల పాటు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కానుకల రూపంలో చెల్లించిన హుండీలను లెక్కించగా ఈ ఆదాయం సమకూరిందన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సిహెచ్ శివనాగిరెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపులు జరిగాయి.

కృష్ణవేణిలో అబాకస్ అవార్డు ఫంక్షన్

మాచర్ల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

పట్టణంలోని స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో అబాకస్ అవార్డు ఫంక్షన్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఆకృతి ఎడ్యుకేషన్ ఫౌండర్ రాము, అబాకస్ ట్రైనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, యాజమాన్యం, ముఖ్యఅతిథులు మాట్లాడుతూ అబాకస్ అనేది ఖచ్చితంగా అంకగణిత సమస్యలు చేసే సాధనం. ఇది ఒక దీర్ఘ చతురస్రాకార చట్రమును కలిగి, దానిపై సమాంతరంగా కొన్ని తీగలను కలిగి ఉంటుంది. ఈ తీగలకు కొన్ని పూసలు గుచ్చి ఉంటాయి. అబాకస్‌ను అంకగణితంలో సంకలనం, వ్యవకలనం, గుణకారం, భాగహారం వంటి చతుర్విద ప్రక్రియలను సులువుగా చేయవచ్చు. పూసల స్థానాలను మార్చడం ద్వారా ఈ గణనలు చేయవచ్చు. చిన్నతనం నుంచి పాఠశాలలో నేర్పించే అబాకస్ ట్రైనింగ్ వల్ల లెక్కల్లో పట్టు సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా అబాకస్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ డా॥ శివ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, యాజమాన్యం, పాఠశాల ఇన్‌ఛార్జిలు గౌరీ, నాగజ్యోతి, శ్రీలక్ష్మీరెడ్డి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు అంజయనాయక్, తదితర పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

యోహాను మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి

మాచర్ల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

మాచర్ల పట్టణంలోని 8వ వార్డు సెరీన్‌కాలనీ వైకాపా సీనియర్ నాయకుడు యోహాను అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి యోహాను కుటుంబ సభ్యులను పరామర్శించారు. యోహాను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యోహాను పార్టీకి చేసిన సేవలను రామకృష్ణారెడ్డి కొనియాడారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాత్రి సందర్భంగా ఏలేశ్వరస్వామి గట్టుకు లాంచీలు



మాచర్ల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా నాగార్జునసాగర్ విజయపురిసౌత్ అనుపు నుంచి ఏలేశ్వరసాన్వమి గట్టుకు ఏపీ పర్యటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక లాంచీని నడపనున్నట్లు లాంచీ యూనిట్ మేనేజరు వినయతుల్లా సోమవారం తెలిపారు. 26న అనుపు నుంచి ఉదయం 7 గంటల నుంచి 3.30 వరకు ఏలేశ్వరం గట్టుకు లాంచీ సర్వీసులు నడపనున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని పర్యటకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు కలిగి ఉండాలి

నిజాంపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:

ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు కలిగి ఉండాలని ఎంపిడిఓ నాగలక్ష్మీ తెలిపారు. సోమవారం మండలంలోని పల్లపట్ల, అడవులదీవి, గరువుపాలెంలలో జరుగుతునన మొబైల్ ఆధార్‌క్యాంప్‌లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్‌కార్డు ఉంటేనే ప్రభుత్వ పథకాలకు అర్హులన్నారు. ఆధార్ కార్డులేనివారు మొబైల్ ఆధార్ కేంద్రానికి వెళ్ళి ఆధార్ నమోదు చేయించుకోవాల నా్నరు. ఈ నెల 27 వరకు మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థిని గెలిపించాలి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:

రాష్ట్ర అభివృద్ధికోసం ప్రజాపాలన కొసం ఎంఎల్సి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాల్సిన ఆవశ్యకతను అర్హతకలిగిన పట్టభద్రుల ఓటర్లపై ఉందని సీనియర్ నాయకులు ఎంఆర్‌కె మూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అదేశాల మేరకు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5 సంవత్సరాల వైకాపా పాలనలో రాష్ట్రం ఎంతో వెనుకబడి పోయిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదన్నారు. దీనిని మరింత కొనసాగించటానికి పట్టభద్రుల అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దివి రాంబాబు, నాగుల పున్నారావు, విస్సంశెట్టి శ్రీను, ఆంజనేయులు, లీలాకృష్ణ, రాజేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పడవ రేవుల్లో ఎంపిడిఓ శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ

"టెండరు దారులు ఒకరు ...నిర్వహణ మరొక కథనానికి స్పందన

అచ్చంపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

మండల పరిధిలోని కె.వి.పాలెం రేవులో తిరుగుతున్న పడవను ఎంపిడిఓ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ప్యాసింజర్లకు లైఫ్ జాకెట్ లేనట్లు గుర్తించారు. కృష్ణా జిల్లా టెండర్‌లో తిప్పుతున్న పడవ కావడంతో లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సంబంధిత డాక్యుమెంట్స్ చూపించాలని కోరినట్లు ఆయన తెలిపారు. పడవదారుడు తండ్రి చనిపోవడం వల్ల కర్మ నిమిత్తం నిద్ర చేసేందుకు టెండర్ దారులు వెళ్ళారని తెలిపారు. ఎంపిడివో కోటప్పకొండ డ్యూటీకి వెళ్ళనున్నట్లు వివరించారు. గురువారం సంబంధిత పత్రాలను పరిశీలించి సరైనవి సమర్పించకుంటే పడవను సీజ్ చేస్తామని ఎంపిడిఓ శ్రీనివాసరావు తెలిపారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

అమరావతి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

పంచరామ క్షేత్రాల్లో ప్రథమమయిన శ్రీ అమరేశ్వరస్వామి ఆలయం శివరాత్రికి ముస్తాబైంది. రాష్ట్ర నలుమూలల నుండి స్వామివారిని దర్శించుకునేందుకు పుణ్యక్షేత్రమైన అమరావతికి భక్తులు తండోపతండాలుగా వస్తారని ఆలయ ఈవో సునీల్‌కుమార్ తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక దర్శనం, సాధారణ దర్శనం, ఉచిత దర్శనాలను ఏర్పాటు చేశామని ఈవో తెలిపారు. ఆలయ ప్రాంగణమంతా పరిశుభ్రపరిచి శివరాత్రి శైవక్షేత్రాలను సిద్ధం చేశామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన వసతులు ఏర్పాటు చేస్తున్నామని ఈవో సునీల్‌కుమార్ తెలిపారు.

ఘనంగా ప్రింటర్స్ డే : అన్నదానం

గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త :

ఆధునిక ముద్రణకు ఆద్యుడు,ముద్రణా రంగ పితామహుడిగా కీర్తించబడే జోహానెస్ గూటెన్‌బర్గ్ జయంతి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ముద్రాపకులచే జరుపబడు ప్రింటర్స్‌డే గుంటూరులో సోమవారం ఏపి మాస్టర్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ఘనంగా నిర్వహించారు.లాలాపేట ప్రింటర్స్ సెంటర్‌లో గూటెన్‌బర్గ్ చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు.మాస్టర్ ప్రింటర్స్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు మరియు ఏపి మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఫిలిప్స్ ప్రసంగంలో త్వరలోనే గూటెన్‌బర్గ్ విగ్రహావిష్కరణ సభ్యులందరి సహకారంతో నిర్వహిస్తామన్నారు.నగర అధ్యక్షులు తోట శ్రీనివాస్,కోశాధికారి జి.వి.పిచ్చయ్య,శివకృష్ణ,కృష్ణమూర్తి,లక్ష్మీకాంత్,స్నేహ లితో బాబు,కేధార్,సురేష్,శ్రీధర్‌రెడ్డి, మణికంఠ,రాంబాబు ప్రసాద్,కనకారావు,విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

జిబి సిండ్రోమ్ వ్యాదిపట్ల అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త :

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన గులియన్ బారే సిండ్రోమ్,తదితర సీజనల్ వ్యాధులపై జరిగిన ఆరోగ్యసభలో ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కె.శంకరరెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు.ఈ వ్యాధి ఎక్కువ శాతం వైరస్‌వల్ల సంక్రమిస్తుందని దీంతో పాదాల

ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ...

నందిగామ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : జాతీయ అంధత్వనివారణకార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్ నెలలో వసంత జెట్.పి.హెచ్.ఎస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలో పాలు గల 5 గురు విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు బంగారు లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటన ద్వారా మీడియాకు తెలియజేశారు.

యాక్ట్ 2005ని రద్దు చేయాలి...

నందిగామ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : న్యాయవాదులకు విఘాతం కలిగిస్తున్న అడ్వకేట్ అమెండ్మెంట్ యాక్ట్ 2005 వెంటనే రద్దు చేయాలని నందిగామ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కోర్టు ఎదుట నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షులు నంద్రు బాబు విద్యాసాగర్ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన అడ్వకేట్ అమెండ్మెంట్ యాక్ట్ 2025 ద్వారా న్యాయవాద వృత్తికే విఘాతం కలుగుతుందని న్యాయవాద వృత్తి అంటే ఎంతో పవిత్రమైన న్యాయవాద వృత్తిని అగౌరపరిచే విధముగా ఈయాక్ట్ ప్రవేశ పెట్టడం జరిగింది అని తక్షణం దీనిని రద్దు చేసుకోవలసినదిగా కోరుతున్నాము రేపు కూడా నందిగామ బార్‌లో నిరసన కార్యక్రమం జరుగుతుందని తెలియపరచుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో బార్ కార్యదర్శి అద్దంకి మణిబాబు ఉపాధ్యక్షులు కొరగంటి కృష్ణంరాజు లైబ్రేరియన్ వి విజయబాబు ట్రెజరర్ ఎస్.రవికుమార్ సీనియర్ న్యాయవాదులైన పింగళి లక్ష్మీనరసింహారావు షేక్ సైదా, చాపరాల శివరామకృష్ణ గోపేరు శివరామకృష్ణ చెరుకుమల్లీ రామారావు, కొమ్మినేని మౌలేశ్వరావు కిరణ్, లక్ష్మీనారాయణ. వేల్పుల కిషోర్. పాల్ ప్రసాద్ బాబు, కాంతారావు, కృష్ణప్రసాద్, బలుసుపాటి సురేష్ ప్రభుజి వాసు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

డూలాస్ సంస్థ ఆర్థిక చేయూత...

నందిగామ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: నందిగామ నేతాజి నగర్ వివేకానంద స్కూలు ప్రక్కన నివాసముంటున్న షేక్ మీరాఖాన్ భార్య పఠాన్ మదార్ బి గతకొన్ని నెలలుగా పక్ష వాతముతో మంచానికే పరిమితమైన విషయం తెలుసుకుని డూలాస్ ట్రస్టు మరియు నందిగామ చర్చ్ ఆఫ్ క్రిస్ట్ సొసైయిటీ అధినేత డా.పగిడిపల్లి మణిఆనంద్ ఆమె స్వగృహం కెళ్ళి మీరా ఖాన్ భార్య అయిన పటాన్ మదారి బి కి మందులకు గాను 20000/- వేల రూపాయలను ఆర్థిక చేయూత అందించడం జరిగినది. ఆర్థిక చేయూతనందించిన డోలస్ ట్రస్ట్ నిర్వాహకులు పఠాన్ మదర్ బి కుటుంబ సభ్యులు ఆనంద వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమముంలో డా.పగిడిపల్లి దేవ సహాయము పగిడిపల్లి రత్న వినోద్, పగిడిపల్లి జ్ఞాన వర కుమార్ పాల్గొన్నారు.

26నుండి నీలాద్రి గుట్టపాడు శైవక్షేత్రాలకు స్పెషల్ బస్సులు ఏర్పాటు... ఎంఎ సుబ్రహ్మణ్యం వెల్లడి

ఎ కొండూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : ఎపిఎస్సార్టీసి తిరువూరు డిపో నుండి మహాశివరాత్రి పండుగ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం నీలాద్రి గుట్టపాడు శైవక్షేత్రాలకు ఈ నెల 26 నుండి బుధవారం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎ సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఉదయం 5 గంటల నుండి ఈ బస్సులు ప్రారంభిస్తారని ప్రతి 20 నిముషాలకు ఒక బస్సు బస్టాండ్ నుండి నీలాద్రి మరియు గుట్టపాడులకు నడుపుతున్నట్లు భక్త ప్రయాణీకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్టీసి బస్సు ప్రయాణం సురక్షితం శుభప్రదం అని ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించి ఆర్టీసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని డిఎం కోరారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపే జనసైనికుల వీరమహిళల బాధ్యత

ఎ కొండూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపే లక్ష్యంగా జనసైనికులు వీరమహిళలు శక్తివంచన లేకుండా పనిచేయాలని తిరువూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు గంపలగూడెం జె.ఎస్.పి మండల అధ్యక్షుడు చింతలపాటి వెంకటకృష్ణ చీమలపాడులో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ పిలుపునిచ్చారు. ఈ నె 27న జరిగే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసే విధంగా జనసేన సైనికులు వీరమహిళలు ముమ్మర ప్రచారం చేయాలని శ్రీనివాసరావు వెంకటకృష్ణ కోరారు. విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాల కొరకు అలాగే ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రగతికై తన గళాన్ని శాసన మండలిలో వినిపించాలంటే రాజేంద్రప్రసాద్ గెలుపు ద్వారా సాధ్యమని వీరు పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్స్ ఓటర్లు విద్య ఉద్యోగాల నిమిత్తం వేరే ప్రాంతాల్లో పనిచేస్తున్న జనసైనికులు వీరమహిళలు బాధ్యతగా 27న పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్ విజయానికి కృషి చేయాలని శ్రీనివాసరావు వెంకటకృష్ణ విజ్ఞప్తి చేశారు.

గొల్లపూడి నారాయణ విద్యార్థుల ప్రతిభ

అమరావతి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : విజయవాడ రూరల్ మైలవరం నియోజక వర్గం గొల్లపూడి నారాయణ పాఠశాలలో విజయవాడ పిబి సిద్దార్థ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోలో గొల్లపూడి నారాయణ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు హేమంత్ కృష్ణ, అనీష్ అనన్య విశేష ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచారని ఎజిఎం హరీష్ సోమవారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా సృజనాత్మకంగా ఆలోచించి తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను ప్రయోగతం ద్వారా అవగతం చేసుకుంటే మేధాశక్తి పెరుగుతుంని అన్నారు. విద్యార్థులు కేవలం ర్యాంకులే పరమావధిగా చదవకుండా భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. సైన్స్ ఎక్స్‌పోలో స్మార్ట్ సిటీ అనే అంశంలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు రెండో స్థానంలో నిలవడం పట్ల శుభపరిణామమని ప్రిన్సిపాల్ మాధవీలత ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

నగరంలో పోస్టర్‌లు అంటిస్తే తప్పదు జరిమానా : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త విజయవాడ నగరం పోస్టర్‌ల రహితమని, వాల్ పోస్టర్‌లను నగరం లో అతికిస్తే వారిపై చట్ట రీత్యా తగు చర్యలు తీసుకోవడమే కాక, వారి నుండి అనగా ప్రకటనదారులు,ప్రింటింగ్ ప్రెస్ వారి నుండి లక్ష రూపా యల వరకు గరిష్టంగా పెనాల్టీని వసూలు చేస్తామని మున్సిపల్ కమీష నర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు.విజయవాడ నగరంపోస్టర్ రహిత నగరమై నందున నిబంధనలను పాటించాల్సి ఉంటుందని,నగరంలో ప్రజారోగ్యం, పర్యావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని,నగర సుందరీకరణను కాపాడుకోడానికి నగరంలో ప్రభుత్వ,ప్రైవేటు భవనాలు,ప్రహరీగోడలు, ట్రాఫిక్ డివైడర్లు,కరెంటు పోల్స్,ట్రాఫిక్ ఐలండ్స్,ఫ్లై ఓవర్లు,బ్రిడ్జిలు తదితర ప్రాంతాల్లో పోస్టర్లను అతికించడం నిషేధం అని ఆయన తెలిపారు. నగరంలో ఇప్పటికే పైన ఉదహరించిన ప్రాంతాల్లో పోస్టర్లను అతికిస్తే,ప్రింటింగ్ చేసిన వారిని గుర్తించామని, వారందరిపై తదుపరి చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు కూడ నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. నియమనిబంధనలను అతిక్రమించిన ఒక ప్రేవేట్ ఆస్పత్రికి నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సోమవారం 50వేల రూపాయల జరిమానాను విధించారని ఆయన తెలిపారు.

అన్న క్యాంటీన్‌కు ఆహారం కోసం వచ్చే ప్రజలకు బయట కూడ టేబుల్స్ ఏర్పాటు చేయాలి

అన్న క్యాంటిన్‌లో ఆహారం కోసం వచ్చే ప్రజలకు బయట కూడ టేబుల్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కృష్ణలంక,జాతీయ ప్రధాన రహదారి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడున్న ఆహార పదార్థాల నాణ్యతను ప్రజలనడిగి తెలుసుకు న్నారు. కిచెన్‌లో పరిశుభ్రతను ఆయన స్వయంగా వీక్షించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని,త్రాగునీటి సౌకర్యం నిరంతరా యంగా ఉండాలని, వాడుక నీటి పైపులైన్‌లో ఎటు వంటి మరమ్మతులు ఉండరాదని సిబ్బందిని ఆదేశించారు.

భగవాన్ శ్రీరమణమహర్షి స్వచ్ఛంద సేవా సంస్థలో అన్నవితరణ

తిరువూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : తిరువూరు పట్టణ వాస్తవ్యులు శ్రీ పుప్పాల కృష్ణబాబు సుహాసిని దంపతుల కుమారుడు చిరంజీవి లలిత దేవాన్ష్ గౌతమ్ జన్మదిన వేడుక సందర్భంగా పట్టణంలోని శ్రీభగవాన్ రమణమహర్షి స్వచ్ఛంద సేవా సంస్థలో దివ్యాంగులకు వృద్ధులకు అనాద బాలికలకు మానవ సేవయే మాధవసేవ అన్న స్ఫూర్తితో తమ వంతు కర్తవ్యంగా అన్నవితరణ గావించారు. కార్యక్రమంలో కాశీ ఆర్ట్స్ అధినేత కొండూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు. వారికి ఆశ్రమ నిర్వాహకులు జన్మదిన శుభాకాంక్షలతో పాటు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఆర్‌పిఐ సంఘీభావం

అమరావతి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఆర్‌పిఐ (అథవాలే) పార్టీ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామిశెట్టి రమేష్‌లు సంఘీభావం తెలిపారు. సోమవారం వారు ఆలపాటిని ఆయన స్వగృహంలో కలిసి పార్టీ తరపు సంఘీభావాన్ని ప్రకటించారు. కేంద్ర మంత్రి రామ్‌దాస్ అత్వాలే ఆదేశాల మేరకు తాము ఆలపాటికి సంఘీభావం తెలుపుతున్నామన్నారు. ఫిబ్రవరి 27వ తేదీ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించి మండలికి పంపుతామన్నారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మక్కా జయరాజు, ఫణీంద్ర, మిర్యాల వెంకట రామయ్య, బెజవాడ సాంబయ్య, రాము, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆధ్వర్యంలో నిరసన

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త న్యాయవాదుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అనీల్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం న్యాయవాద చట్టసవరణ బిల్లును ఉపసంహ రించుకోవాలన్నారు. జిల్లా బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరిగిందన్నారు. న్యాయవా దులు కోర్టు విధులను బహిష్కరించి నిరసనను తెలియజేశారు. మూడవ రోజు న్యాయవాదులు ఆందో ళన చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు చిన్నయ్య, కళ్ళం వీరభాస్కరరెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, రాజశేఖరుని గోపాలకృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, నాగూర్‌బాబు, సురేష్, జ్యోతిబాబు పాల్గొన్నారు.

సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఆనంద్‌కుమార్

సత్తెనపల్లి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఆనంద్‌కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఏపి ఎన్జీవో అధ్యక్షులు పెండెం మణిరావు, సెక్రటరీ సందెపోగు అంబేద్కర్, ట్రెజరర్ మన్నవ కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, డిసి మెంబర్స్ కలిశారు. ఆయనకు శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో టైగర్ నాగేశ్వరరావు, ఆకుల కోటేశ్వరరావు, సౌభాగ్యలక్ష్మి, హంస, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

సజన్ జిందాల్‌కు దశాబ్దపు వ్యాపార నాయకుడు అవార్డు

విజయవాడ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : 15వఎఐ ంఎ మేనేజింగ్ ఇండియా అవార్డుల్లో జెఎస్ డబ్ల్యు గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ దశాబ్దపు వ్యాపార నాయకుడు అవార్డును అందుకున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, వాణిజ్య, పరిశ్రమల, ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ సహాయ మంత్రి జితిన్‌ప్రసాద్‌ల సమక్షంలో ఈ అవార్డును జిందాల్ స్వీకరించారు. జిందాల్ సంస్థ అయిన జెఎస్‌డబ్ల్యు 39మిలియన్‌ల టన్నుల ఉక్కు సామర్థ్యంతో పాటు సిమెంట్ తయారీలో ప్రధాన శక్తిగా స్థాపించింది. ఓడరేవుల రంగంలో అతిపెద్ద ప్రైవేట్ సంస్థగా జెఎస్‌డబ్ల్యు నిలవడమే కాక ఎలక్ట్రిక్‌వాహనాలు, సైనిక డ్రోన్ల తయారీ తదితర ప్రముఖ రంగాల్లో తమ విజయాన్ని చాటుకుంది.

కంటిక్యాన్సర్‌పై మరింత అవగాహన పెంచుకోవాలి

విజయవాడ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : కంటికి వచ్చే క్యాన్సర్‌పై మరింత అవగాహన పెంచుకోవాలని ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యులు డా అనూష గంగూలి తెలిపారు. విజయవాడ ఎల్‌విప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞానసంస్థ కోడె వెంకట్రాధ్రి చౌదరి క్యాంపస్‌లో సోమవారం నిర్వహించిన కంటిక్యాన్సర్ సవాళ్ళు, చికిత్స అంశాలపై సదస్సులో ఆమె ప్రసంగిస్తూ కంటికి వచ్చే క్యాన్సర్‌ను గుర్తించకుంటే ప్రాణాంతకమవుతుందని, తీవ్రమైన దశలో గుర్తిస్తే చికిత్స కష్టమవుతుందన్నారు. ఎల్‌విపిఐలో అధునాతన చికిత్సను కంటిక్యాన్సర్‌కు అందిస్తున్నామన్నారు.

మోటుపల్లిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తాం

బాపట్ల,ఫిబ్రవరి24,ప్రభాతవార్త: కాకతీయులు, ఛోళ్ళరాజుల నాటి అభయ శాసనాల భద్రత కొరకు మోటుపల్లిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. మోటుపల్లిలోని వీరభద్రేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధిపై సంబంధిత అధికారులు, ఎన్జీవోలతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ గణపతి దేవుని అభయ శాసనం, అన్న పోతారెడ్డి అభయ శాసనం, ప్రౌడ దేవరాయల అభయ శాసనాలను భద్రపరుస్తామన్నారు.దేవాలయం సమీపంలో మ్యూజియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో శ్రీకృష్ణదేవరాయులకు ముందు కొండవీటి రాజుల శాసనాలు, కాకతీయుల నాటి శాసనాలు వెలుగులోకి వచ్చాయన్నారు. తవ్వకాలలో 13 చారిత్రాత్మక పంచ లోహ విగ్రహాల లభ్యం కాగా వాటిని విజయవాడ హైదరాబాద్ లోని నాంపల్లి స్టేట్ మ్యూజియంలో భద్రపరిచి విషయాలను ఆయన వివరించారు. వాటిని తెప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే విజయవాడలోని బాపూ మ్యూజియంలో భద్రపరిచిన వీరభద్ర స్వామి విగ్రహాన్ని మోటుపల్లకి తెప్పిస్తామన్నారు.మోటుపల్లి దేవస్థానంలో తమిళనాడు, సంస్కృతంలో లిఖితమైన అభయ శాసనాలను తెలుగులోకి అనువాదించి రాళ్లపై చెక్కిస్తామని కలెక్టర్ తెలిపారు. చారిత్రాత్మక సంపదను భద్రపరచడం, ప్రజలందరూ సందర్శించేలా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. పురావస్తు శాఖ పరిశోధకులు సహకారంతో పనులు చేయాలన్నారు. ఈ పనులను ఎన్జీవోల సహకారంతో తక్షణమే ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శతాబ్దాల క్రితం సముద్ర వర్తకంపై రాజులు తీసుకున్న నిర్ణయాలు, బీమా సౌకర్యాలు, విధించిన పన్నులు వసూలపై ఆనాటి రాజుల శాసనాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు, పురావస్తు శాస్త్రవేత్త జ్యోతి చంద్రమోళి, మోటుపల్లి హెరిటేజ్ సొసైటీ కార్యదర్శి దశరథ రామిరెడ్డి, సభ్యులు ఓటుకూరి శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోటప్పకొండలో ట్రాఫిక్ నిబంధనలపై ఎస్పీ సమీక్ష

నరసరావుపేట క్రైం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ లో ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి జాతరలో ట్రాఫిక్ నిబంధనలపై పోలీస్ అధికారులతో సోమవారం జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నరసరావుపేట వైపు నుండి కోటప్పకొండకు విఐపిలు పెట్లూరివారిపాలెం మీదుగా పార్కింగ్ స్థలానికి చేరుకోవాలన్నారు. అదే విధంగా ప్రభలు మధ్యాహ్నం 12 గంటల నుండి యల్లమంద మీదుగా ప్రభలు నిలిపే స్థానానికి చేరుకోవాలన్నారు. సంతమాగులూరు వైపు నుండి వచ్చే వారు లక్ష్మీపురం వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకొని ఘాట్ రోడ్డు ప్రక్కన ఉన్న జనరల్ పార్కింగ్‌కు వెళ్ళాలన్నారు. చిలకలూరిపేట వైపు నుండి వచ్చే వాహనాలు యడవల్లి, యూటి సెంటర్ నుండి విఐపి పార్కింగ్‌కు చేరుకోవాలన్నారు. త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు సూచించిన ప్రాంతాలలోనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు, బంగారం, డబ్బులను జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. చిన్నపిల్లలు తప్పిపోకుండా తగు జాగ్రత్తలు వహించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. రాష్ట్ర పండుగ హోదా కలిగిన తిరునాళ్ళకు వచ్చే లక్షలాది మంది భక్తులకు పోలీస్‌శాఖ సూచించే సూచనలను తప్పక పాటించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో డిఎస్పీ కె.నాగేశ్వరరావు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు పాల్గొన్నారు.

టిడిపి నేత వేములపల్లి మోహన్ కృష్ణ జన్మదిన వేడుకలు

కొల్లూరు, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త) : కొల్లూరు మండలం, తడికలపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేములపల్లి మోహన్‌కృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రమైన కొల్లూరులోని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కృష్ణ పశ్చిమ డెల్టా కమిటీ మాజీ ఛైర్మన్ మైనేని మురళీకృష్ణ స్వగృహం నందు ఏర్పాటు చేసిన కేకును మైనేని మురళీకృష్ణ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందించాలి - సిడిపిఓ గన్నవరపు విజయలక్ష్మీ

కొల్లూరు, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త) : అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు మెరుగైన విద్యాబోధనను అందించాలని అమృతలూరు ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారిణి గన్నవరపు విజయలక్ష్మీ అన్నారు. సోమవారం కొల్లూరు బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో సూపర్‌వైజర్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సమావేశంలో సిడిపిఓ మాట్లాడుతూ ప్రభుత్వం గత 5రోజులుగా పిల్లల విద్యా విధానంపై పలు అంశాలను రిసోర్స్ పర్సన్ ద్వారా అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. శిక్షణ పొందిన కార్యకర్తలు వారు నేర్చుకున్న అనుభవాలతో పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. వాస్తవాలకు ప్రతిరూపాలైన నమూనాలతో పిల్లలకు విద్యాబోధన చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ సుధాకర్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్యా వ్యవస్థలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు 120రోజుల సర్టిఫికెట్ కోర్స్ మొదటి సంవత్సరం కోర్స్ మాడ్యుపల్స్ సెట్‌లను సిడిపిఓ విజయలక్ష్మీ, రిసోర్స్ పర్సన్స్ సుధాకర్, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, ఫజరున్నీసాలు అందజేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ సాల్మన్, సుధాకర్, శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, ఫజరున్నీసా, కొల్లూరు, అనంతవరం, దోనేపూడి సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి గోవాడ వచ్చే భక్తులకు సర్వం సిద్ధం: ఇఓ అశోక్‌కుమార్

అమృతలూరు, ఫిబ్రవరి 24, ప్రభాత వార్త: మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీబాలకోటేశ్వర స్వామి దర్శనార్థం గోవాడ వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని దేవస్థానం ఇఓ బి.అశోక్‌కుమార్ తెలిపారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. బారికేడ్‌లతో క్యూలైన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తుల దహార్తిని తీర్చడానికి మంచినీటి ప్యాకెట్‌లు, మజ్జిగా దాతల సహకారంతో ఏర్పాటు చేశామని చెప్పారు. 24వ తేది ఏకాదశి రోజున స్వామి వారికి అభిషేకం చేసి హుండీలు గ్రామోత్సవముతో మహాశివరాత్రి తిరునాళ్ళ ఉత్సవాలను ప్రారంభించారు. 25వ తేది పశు ప్రదక్షణలు చేస్తారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు శివరాత్రి రోజు ఉచిత దర్శనంతో పాటు రూ.20(శీ ఘ్ర దర్శనము), రూ.50(లఘు దర్శనము), రూ.100లు విఐపి దర్శనముల టిక్కెట్లు ఉన్నాయని తెలిపారు. స్వామి వారి లడ్డు రూ.15లు, పులిహోర ప్రసాద్ రూ.10లు అని చెప్పారు. మహాశివరాత్రి సందర్భంగా గోవాడ తిరునాళ్ళకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని చుండూరు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

శ్రీశైల భక్త సేవాసమితి ప్రశంసనీయం - డిఎస్పీ బి.జనార్ధనరావు

తెనాలి, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం తెనాలి నుండి శ్రీశైలం వెళ్ళి విశిష్ట సేవలు అందిస్తున్న శ్రీశైల భక్త సేవా సమితి కార్యవర్గం అభినందనీయులని డిఎస్పీ బి.జనార్ధన్‌రావు పేర్కొన్నారు. తెనాలిలో 17సంవత్సరాల క్రితం ఏర్పడిన శ్రీశైల భక్త సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిఏటా మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైలంలో భక్తులకు అందించే సేవల కార్యాచరణలో భాగంగా సోమవారం శ్రీశైలం వెళ్ళే వంట సామాగ్రి, కిరణ వస్తువులు, కూరగాయలు, బియ్యం, తదితర వస్తువుల వాహనాలకు డిఎస్పీ బి.జనార్ధనరావు ముఖ్య అతిధిగా పాల్గొని జెండా చూపించి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైల భక్త సేవా సమితి కార్యవర్గం తమ కార్యాచరణను మీడియాకు వివరించారు. ఎన్.బి.బ్రహ్మం మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున భక్తులకు అన్న ప్రసాద వితరణ, మంచినీటి సరఫరా ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న డిఎస్పీ బి.జనార్ధన్‌రావు మాట్లాడుతూ తెనాలిలో ఆవిర్భవించిన శ్రీశైలభక్త సేవా సమితి నిర్ధిష్టమైన కార్యాచరణతో అందిస్

ఉప్పలపాడు ప్రభకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నరసరావుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో నిర్మించిన విద్యుత్ ప్రభకు సోమవారం శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలు కొట్టి స్వామిని ప్రార్థించారు. అదే విధంగా గుమ్మడి కాయ కొట్టి ప్రభను తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ ప్రతి ఏడాది సాంప్రదాయంగా గ్రామం మొత్తం కుల మతాలకు అతీతంగా ప్రభను తరలించే కార్యక్రమం నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. ఆచారాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలు గ్రామంలో ఐక్యతను చాటి చెప్పటం జరుగుతుందన్నారు. ప్రభను క్షేమంగా కోటప్పకొండలోని స్వామి చెంతకు చేర్చాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిటి సభ్యులకు వారు సూచించారు. అదే విధంగా త్రికోటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ నిబంధనలు పాటించండి : డిఎస్పీ

నరసరావుపేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం వద్ద ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి తిరునాళ్ళ మహోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ సూచించిన విధంగా నిబంధనలు పాటించాలని డిఎస్పీ కె శ్రీనివాసరావు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ తమ సంతకంతో ప్రత్యేకంగా విధులు నిర్వహించే వారికి, విఐపిలకు, ఉద్యోగులకు, పాత్రికేయులకు, భక్తులకు వివిధ రంగులలో పాస్‌లు జారీ చేస్తామన్నారు. సుమారు 2500మందితో పోలీస్‌లు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుణాల రోజు 15 డ్రోన్‌లతో ప్రత్యేక కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందన్నారు. విఐపిలు తమ వాహనాలను పెట్లూరివారిపాలెం గ్రామం నుండి తమకు కేటాయించిన పార్కింగ్‌కు చేరుకుని ఆర్టీసి ప్రత్యేక బస్సులలో కొండ పైకి వెళ్లి స్వామి దర్శనం చేసుకోవాలన్నారు. కొండ పైకి ఎటువంటి ప్రైవేట్ వాహనాలకు అనుమతి లేదన్నారు. మెట్ల మార్గంలో ఉదయం నుండి మధ్యాహ్న 3గంటల వరకు మాత్రమే పైకి వెళ్ళలని సూచించారు. జనరల్ పార్కింగ్ వచ్చే వారు తిరిగే వెళ్లేందుకు కొండకావూరు, పమిమిమర్రు మీదుగా జెఎన్‌టీయు వద్ద వినుకొండ హైవేకి చేరుకోవాలని తెలిపారు. చిలకలూరిపేట వైపు నుండి వచ్చే ప్రభలు యడవల్లి అట్టల ఫ్యాక్టరీ ఎదురు ఉన్న రోడ్డు నుండి కట్టుబడివారిపాలెం మీదుగా ప్రభల నిలిపే స్థలం చేరుకోవాలని డిఎస్పీ కె నాగేశ్వరరావు సూచించారు. విలేకరుల సమావేశంలో సిఐలు ప్రభాకర్, విజయ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీఎన్నికలపై తెలుగుదేశం పార్టీ సమీక్ష - పాల్గొన్న ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష సమావేశాన్ని సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని మాట్లాడారు. గుంటూరు-కృష్ణ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి పార్టీలు నిలిపిన నాయకులు అలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని వారు విజ్ఞప్తి చేసారు. న్యాయవాదులు ఎన్నికలలో తమ ఓటును ఖచ్చితంగా రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధన్యత ఓటు ఇవ్వటం ద్వారా మంచి సందేశం రాష్ట్రానికి ఇవ్వాలని కోరారు. సియం చంద్రబాబు నాయకత్వంలో జరుగుతున్నరాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కొనసాగేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులు అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ కోరారు.

శివరాత్రి సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తాడేపల్లి,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త

శివరాత్రి పండుగ సందర్భంగా పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా,తాడేపల్లి మండలంలోని ఉండవల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు అనుబంధ గ్రంధాల ప్రచారం,శివరాత్రి పండుగ పై ప్రచారం చేశారు.

శివరాత్రి పండుగ విశిష్టత : శివలింగంపైన ఉన్న "మూడు విభూతి రేఖలు జీవాత్మ ఆత్మ పరమాత్మ లకు గుర్తు" అని ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని,అందుకే "మధ్యలో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొట్టుపెడతారు" మూడు ఆత్మల వివరణ తెలుసుకోవడం ఆధ్యాత్మికం లో ముఖ్యమైన విషయం. శివరాత్రి జాగరణ అంటే మాయపట్ల జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానం తెలియజేయడం అని అర్థం, "అందుకే శివరాత్రిని మోక్షరాత్రి" అని అంటారు. కావున అందరూ మోక్షం పొందాలనేదే శివరాత్రి పండుగ యొక్క ముఖ్యఉద్దేశ్యం అని చెప్పారు.(జీవితంలో ఒక సంవత్సరకాలం గడిచిపోయింది అని గుర్తుచేయడానికి ఈ పండుగలు వస్తున్నాయిని అర్థం చేసుకోవాలి విలువైన సమయాన్ని,ఆయుష్షును దైవధ్యాసలో ఉంచాలనేదే ఈ పండుగల అంతరార్థం). కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక గుంటూరు కమిటీ అధ్యక్షులు,సభ్యులు రౌతు శ్రీనివాసరావు,టిడి కృష్ణారావు,ఆర్.రామకృష్ణ,బి.శివలింగం నాయక్,టి.బ్రహ్మం,పట్టాబి శ్రీను,జే.హరిబాబు,సుబ్బారావు,ఏ.అరుణ,ఎస్‌కె దిల్సా తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి విచ్చేసే భక్తులకు భగీరథ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవలు

మంగళగిరి,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త :

మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 26వ తేది మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భగీరథ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేయడం జరుగుతుందని ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు అన్నారు.ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గత 30సంవత్సరాల నుంచి మహాశివరాత్రి,కార్తీకమాసం,శివ ముక్కోటి పర్వదినాల్లో ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామన్నారు.శివరాత్రి సాయం త్రం సుమారు 20వేల మంది భక్తులకు చక్కెర పొంగలి,పులిహోర,రవ్వకేశరి,శనగ గుగ్గిళ్ళు ప్రసాదాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.అదేవిధంగా కాశీ అన్నపూర్ణేశ్వరీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల 3000మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటీ శివ సత్యనారాయణ,గండికోట అచ్చయ్య,నంధ్యాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కోటప్పకొండకు తరలనున్న ప్రభలు - గ్రామాలలో శివరాత్రి సందడి

చిలకలూరిపేట,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

శివరాత్రి పండుగ వచ్చిందంటే చిలకలూరిపేట నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో సందడి వాతావరణం నెలకొంటుంది. ఏన్నో దశాబ్దాలుగా ఈ ప్రాంతంనుంచి ప్రభలను కట్టుకొని చేదుకో కోటయ్యా...కోటయ్యా అనుకుంటూ కోటప్పకొండ వద్ద నిర్దేశించిన స్థలంలో ప్రభలను నిలిపి మొక్కులు తీర్చుకొని శివరాత్రి రోజంతా జాగారం చేయడం ఈ ప్రాంత ప్రజల ఆచారంగా అనాదికాలంగా వస్తుంది. షుమారు నెలరోజులు గ్రామస్థులు ఐక్యంగా పగలు, రాత్రి కష్టపడి లక్షలాది రూపాయిల వ్యయంతో విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసుకొని పండగకి ముందు గ్రామంలో ఉత్సవం నిర్వహించుకొని శివరాత్రికి ప్రభను పకడ్బందీగా ఐకమత్యంగా, క్రమశిక్షణతో కోటప్పకొండ వద్దకు తీసుకొని వెళ్లి శివరాత్రి అనంతరం గ్రామానికి తీసుకొని వచ్చి గ్రామాలలో మరలా ఉత్సవం చేసుకోవడం అనవాయితి. ఈ ఉత్సవాలలో పాల్గొనడంతో నెల రోజులుగా పడ్డ కష్టం మరచిపోతామని గ్రామస్థులు భావిస్తారు చిలకలూరిపేట పట్టణంలో పురుషోత్తమపట్నంలో అనాదిగా ప్రభలను కట్టడం అనవాయితీగా ఉంది. అదే విధంగా మండలంలోని కావూరు, మద్దిరాల, కమ్మవారిపాలెం గ్రామాలనుంచి విద్యుత్ ప్రభలు కోటప్పకొండకు తరలివెళతాయి. నాదెండ్ల మండలంలోని అప్పాపురం, అమీన్‌సాహెబ్ గ్రామాలనుండి కూడి విద్యుత్ ప్రభలు కోటప్పకొండకు తరలుతాయి. అదేవిధంగా సాధారణ ప్రభలను సైతం ఉత్సాహంగా ఏర్పాటుచేసుకొని అనేకమంది భక్తులు తరలుతారు. కోటప్పకొండ పరిసర గ్రామంలోని బాలురు,చిన్నారులు బాలప్రభలను ఏర్పాటుచేసుకొని ఉత్సాహంగా చేదుకో కోటయ్య అంటూ కొండకు వెళ్లడం అధ్యాత్మిక స్ఫూర్తి కనపడుతుంది. ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు, బుర్రకథలు, సంగీత కచేరీలు, అధ్యాత్మిక వాతావరణం కలిగిస్తాయి.

పూర్వ విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగాలి

- పలువురు ఉపాధ్యాయుల స్పష్టీకరణ

పొన్నూరు, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:

నిడుబ్రలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1999-2000 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లి ఉత్సవాలు నిర్వహించారు. పదవ తరగతి చదివి 25సంవత్సరాలు అయిన సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా పాఠశాలకు వచ్చారు. వారు విద్యనభ్యసస్తున్న రోజుల్లోని మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గురువులను ఆహ్వానించి వారికి గురు దక్షణగా శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. వారి ఆశీస్సులు అందుకున్నారు. పలువురు గురువులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా ఏదో ఒక రంగంలో స్థిరపడి ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి పూర్వ విద్యార్థి తాము సంపాదించిన సొమ్ములో కొంత భాగాన్ని దాన ధర్మాలకు, పేదల అభ్యన్నతికి, పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మనం ఎక్కడ ఉన్నా సొంత ఊరును, సొంత పాఠశాలను, కన్న తల్లిదండ్రులను మరువరాదన్నారు. సమాజంలోని అసమానతలను పోగొట్టేందుకు పేదల విద్యాభ్యాసానికి కృషి చేయాలని కోరారు. పూర్వ విద్యార్థులకు తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని వారు స్పష్టం చేశారు. స్థానికంగా ఉన్న పూర్వ విద్యార్థులు అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేశారు.

వైకాపా నాయకుడు కందుల మృతి

పొన్నూరు, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:

మండల పరిధిలోని ములుకుదురు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, పంచాయితీ వార్డు సభ్యులు కందుల వెంకట సుబ్బారావు(62) సోమవారం హఠాన్మరణం చెందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. పంచాయితీ వార్డు సభ్యులుగా ఉంటూ గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. వెంకట సుబ్బారావు మృతి పార్టీకి తీరని లోటని పలువురు వైకాపా నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు వెంకట సుబ్బారావు మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పక్షం రోజుల్లో అభ్యంతరాలు తెలపాలి

- కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్

పొన్నూరు, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:

టెంపుల్ సిటీగా ప్రసిద్ధిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయంలో వివిధ రకాల ఆర్జిత సేవా టిక్కెట్ల దరలను పెంచేందుకు దేవాదాయశాఖ నిర్ణయించిందని కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ తెలిపారు. స్థానిక దేవాలయం కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ టిక్కెట్ల పెంపుపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ప్రకటన విడుదలైన రోజు నుంచి పక్షం రోజుల్లో(15రోజులు) దేవాలయం కార్యాలయంలో సమర్పించాలన్నారు. సహస్రనామార్చనకు ప్రస్తుతం వున్న రుసుము రూ.100ను రూ.200లు చేస్తున్నట్లు చెప్పారు. వసతి గృహము అద్దె(నాన్ ఏసి) రూ.300లను రూ.500లు చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి స్వామివారి శాంతి కళ్యాణం ఉత్సవాన్ని నూతనంగా ప్రారంభిస్తున్నామని, ఎవరైనా ఈ ఉత్సవం చేయించుకోవాలంటే రూ.2,116లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. భక్తులు ఈ విషయాలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

26న ప్రత్యేక హోమాలు, అభిషేకాలు:

ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం వేకువజామున 4.30గంటలకు గణపతి హోమము, రుద్రహోమాలను, వివిధ రకాల పూజాధికార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి వెంకట అమర్నాథ్ తెలిపారు. శ్రీ సహస్రలింగేశ్వరస్వామి మూల విరాట్‌కు ఉదయం 6.30గంటలకు గంధము ఒలిచి, మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాత్రి 7గంటలకు శాంతి కళ్యాణము శాస్త్రోక్తముగా నిర్వహించనున్నట్లు చెప్పారు. గురువారం స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ఆశీస్సులు పొందాలని కార్యనిర్వహణాధికారి కోరారు.

శివరాత్రి సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు

పొన్నూరు, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పొన్నూరు డిపో నుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ టి.అజితకుమారి తెలిపారు. స్థానిక డిపో కార్యాలయంలో అందుకు సంబంధించిన వివరాలను సోమవారం వెల్లడించారు. శివరాత్రి సందర్భంగా ఉదయం-5,7,గంటలకు రాత్రి 10.30గంటలకు శ్రీశైలానికి బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ సర్వీసులను ఈ నెల 27వ తేదీ వరకు నడుపుతామన్నారు. 26వ తేదీ ఉదయం 5గంటల నుంచి గోవాడకు ఎనిమిది బస్సులను తిప్పుతున్నట్లు చెప్పారు. 27వ తేదీ ఉదయం వరకు ఈ సర్వీసులు గోవాడకు నడుస్తాయన్నారు. ప్రత్యేక సర్వీసుల్లో కూడా సాధారణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని అజితకుమారి కోరారు.

దళిత హక్కులు సాధించిన వీరుడు డాక్టర్ కత్తి పద్మారావు

పొన్నూరు, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:

ప్రాణాలకు తెగించి దళిత హక్కులను సాధించిన వీరుడు డాక్టర్ కత్తి పద్మారావు మాత్రమేనని సంఘ పెద్ద రెబ్బా సీతయ్య అన్నారు. స్థానిక లుంబినీవనంలో అభినవ అంబేద్కర్, కవి, రచయిత అయిన డాక్టర్ కత్తి పద్మారావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చేబ్రోలు మండలం, శేకూరు గ్రామానికి చెందిన అంబేద్కర్ యూత్ నాయకులు బి.సుధాకర్, ఎం.ఆశీర్వాదం నాయకత్వంలో కత్తి పద్మారావును కలిశారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ 1991లో చుండూరులో వీరోచిత పోరాటం చేసి దళిత హక్కులను కాపాడినటువంటి వ్యక్తి డాక్టర్ కత్తి పద్మారావు అని చెప్పారు. పద్మారావు కష్టాల్లో ఉన్నప్పుడు పరామర్శించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టించిన మహాతల్లి కత్తి స్వర్ణకుమారి అని చెప్పారు. వీరిని సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనలతోనే చుండూరు పోరాటం నడపగలిగామన్నారు. ఢిల్లీ బోట్‌క్లబ్‌లో జరిగిన మహా ధర్నాలో యుపిసింగ్, రామ్‌విలాస్ పాశ్వాన్, బూటా సింగ్, శరత్‌యాదవ్, ధర్మవీర్ పాల్గొన్నారన్నారు.పార్లమెంట్ భవనం ముందు జరిగిన మానవహారం చరిత్రలోనే గొప్ప సంఘటన అని చెప్పారు. మార్చి 2వ తేదీన కత్తి మాణిక్యమ్మ 29వ వర్ధంతి సందర్భంగా సంపూర్ణ మద్యపాన నిషేధ ఉద్యమం ప్రారంభిస్తున్నామని, పెద్ద ఎత్తున స్త్రీలు, పురుషులు అనే తేడా లేకుండా పాల్గొనాలని పిలుపునిచ్చారు.అనంతరం డాక్టర్ కత్తి పద్మారావు, మాతా రమాబాయి అవార్డు గ్రహీత కత్తి స్వర్ణకుమారిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు శేకూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్ఎం పిచ్చిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి నివాళి

రొంపిచర్ల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

రొంపిచర్ల మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన విశ్రాంత హెచ్ఎం పిచ్చిరెడ్డి మాస్టారు సోమవారం కనుమూశారు. సమాచారం తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రొంపిచర్ల మండల పార్టీ కన్వీనర్ కురిగంటి శ్రీనివాసరెడ్డికి విశ్రాంత హెచ్ఎం పిచ్చిరెడ్డి మాస్టారు తండ్రి అని, ఆయన క్రమశిక్షణలో ఉన్నత భావాలతో వారు పెరిగారన్నారు. ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు.

ఏఎన్‌యూ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికైన కృష్ణవేణి విద్యార్థిని

నరసరావుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త

ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అంతర్ కళాశాలల మహిళా హ్యాండ్ బాల్ పోటీలలో కృష్ణవేణి కళాశాలకు చెందిన కె.భాగ్యశ్రీ మంచి ప్రతిభను చూపారు. వివరాలను ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలియజేశారు. ఈ నెల 21,22 తేదీలలో తెనాలిలో యూనివర్శిటీ మహిళా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక జరిగిందన్నారు. ఆ పోటీలలో పాల్గొన్న బిఎస్సీ ఫైనల్‌ఇయర్ విద్యార్థిని కె.భాగ్యశ్రీ మంచి ప్రతిభతో యూనివర్శిటీ జట్టుకు ఎంపిక కావడం జరిగిందన్నారు. తమ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణిస్తున్నారని తెలిపారు. యూనివర్శిటీ జట్టు మార్చి 2 నుండి చెన్నైలో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనడం జరుగుతుందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో పి.డి.ఆదిబాబు, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటి గెలుపుకోసం టిడిపి నాయకుల ప్రచారం

నాదెండ్ల,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

ఉమ్మడి గుంటూరు,కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం మండల కేంద్రమైన నాదెండ్లలో గ్రామ సచివాలయం, మండలంలోని సంక్రాంతిపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాతులూరు గ్రామ సచివాలయ సిబ్బందిని, వైద్య సిబ్బంది, ఈతరం స్కూల్‌లోని పట్టభద్రులను కలసి మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేయాలని కోరారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఆత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాదెండ్ల మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు బాబు, మామిళ్లపల్లి పోతురాజు, మల్లవరపు జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికాస్ పాఠశాల 17వ వార్షికోత్సవం

చిలకలూరిపేట,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

పట్టణంలోని పెదనందిపాడు రోడ్‌లో ఉన్న వికాస్ పాఠశాల 17వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రమను ఆయుధంగా చేసుకొని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని అన్నారు. స్కూల్ డైరక్టర్ దండా పవన్‌కుమార్ మాట్లాడుతూ మన శరీరానికి హృదయం ఎంత ముఖ్యమో నేటి విద్యావిధానంలో ఐఐటి ఫౌండేషన్ అంత ముఖ్యమైనది అన్నారు. కార్పోరేట్ కాలేజీలు నిర్వహించిన ఫీజు రాయితీలలో 17మంది విద్యార్థులు మంచి ప్రతిభచూపి 40శాతం పైగా ఫీజు రాయితీ పొందారని వారిని అభినందించారు. చేతివ్రాత రాష్ట్రస్థాయి పోటీలలో బంగారుపతకం సాదించిన 12మంది విద్యార్థులను, ఐఐటి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో వికాస్ పాఠశాల డైరక్టర్ దండా రోజశ్రీ, చార్టర్డ్ అకౌంటెంట్ హరిక, సింగ్ కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ శ్యాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శివరాత్రిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

: బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు

చిలకలూరిపేట,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధ శైవక్షేత్రమైన కోటప్పకొండకు లక్షలాది మంది తరలివస్తారని, అందరూ త్రికోటేశ్వరుని దర్శించుకొని క్షేమంగా ఇంటికి చేరాలని కోరారు. రాష్ట్ర ప్రజలకు అన్నం శ్రీనివాసరావు, బిజెపి నాయకులు శివరాత్రి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దడబడ పుల్లయ్య, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, పఠాన్ నబి, ఎస్ బాలయ్య, కుప్పం కళ్యాణదుర్గారావు, పోతవరం సుభాని,మద్ది సుధాకర్,గుమ్మా బాలకృష్ణ జ్వాలాపురం రాయుడు, సాల్మన్, అన్నపరెడ్డి వీరాంజనేయులు, షేక్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : సిపిఐ నాయకులు

చిలకలూరిపేట,ఫిబ్రవరి24,ప్రభాతవార్త:

మున్సిపల్ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని సిపిఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబూరావు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన మున్సిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీంకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ,కార్మికుల జీతాల చెల్లింపు పనుల అప్పగింత నిర్వహణ సాంఘీకభద్రతా మున్సిపల్ శాఖకే పూర్తి భాద్యత ఉండాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సబబుకాదన్నారు. ఔట్‌సోర్సింగ్, పారిశుధ్య,ఇంజనీరింగ్ కార్మికులను గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులో మూడు డిఎలు విడుదల చేయాలని కోరారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల రిటైరింగ్ వయస్సును 62కు పెంచాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు కె చెంచయ్య, అక్కులయ్య, జయరావు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి భక్తుల సౌకర్యార్థం ఆర్‌టిసి అదన

25-2Pg5.qxd:25-2Pg5.qxd 01/01/01 6:56 AM Page 1

2వేల మంది యుఎస్ఎయిడ్ ఉద్యోగులపై వేటు

బలవంతపు సెలవులు పెట్టించిన ట్రంప్ సర్కార్

వాషింగ్టన్, ఫిబ్రవరి 24: అంతర్జాతీయ అభివృద్ధి కార్యక్రమాలకు, మానవతా దృష్టితో సహాయానికి యుఎస్ ఎయిడ్ సంస్థ ద్వారా అందుతున్న నిధులను అమెరికా ప్రభుత్వం ఆపివేసిన విషయం తెలిసిందే. తాజాగా రెండు వేల మంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేటు వేశారు. మిగిలిన వారిలో కొంతమందిని మినహాయించి వేలమంది ఉద్యోగులకు బలవంతపు సెలవులు ఇచ్చినట్లు యుఎస్ ఎజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్ వెబ్‌సైట్‌లోని నోటీసు ద్వారా తెలుస్తోంది. ఉద్యోగుల తొలగింపునకు ఫెడరల్ జడ్జి అనుమతించిన తర్వాతే ట్రంప్ యంత్రాంగం ఈ విషయంలో ముందుకెళ్లారు. ప్రభుత్వ ప్రణాళికను నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరిన ఉద్యోగుల విజ్ఞప్తిని యుఎస్ డిస్ట్రిక్ జడ్జి కార్ల్ నికోలస్ తిరస్కరించారు. ప్రభుత్వం చేసే అనవసరపు ఖర్చులను తగ్గించడానికి పనిచేస్తున్న మస్క్ నేతృత్వంలోని డోజ్ ఇప్పటికే అనేకమంది యుఎస్ ఎయిడ్ ఉద్యోగులపై వేటు వేసిన విషయం తెలిసిందే. తాజాగా తీసుకొన్న ఈ నిర్ణయం మిగిలిన ఉద్యోగుల్లో భయాందోళన కలిగిస్తోంది. అయితే యుఎస్ ఎయిడ్ ద్వారా వృథా ఖర్చులు ఎక్కువవుతున్నాయని, అది నేరగాళ్ల సంస్థ అని మస్క్ ఇప్పటికే ఆరోపించిన విషయం తెలిసిందే. అందుకే నిధులను ఆపేస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా దాదాపు 600 మంది ఉద్యోగులను కార్యాలయ భవనంలోకి వెళ్లనీయకుండా నిలిపివేశారు. ఈ ఆదేశాలపై ఫెడరల్ జడ్జి అమీర్ అలీ గతవారం తాత్కాలికంగా స్టే ఇచ్చారు. అమెరికా కాంగ్రెస్ సభ్యులు యుఎస్ఎయిడ్ ద్వారా సాయం అందించడానికి ఆమోదం తెలిపినప్పుడు ప్రభుత్వం దాన్ని ఎలా నిలిపేయగలదని జడ్జి నిలదీశారు. అయినా ట్రంప్ తన చర్యలను సమర్థించుకుంటున్నారు. యుఎస్ ఎయిడ్ ద్వారా భారత్‌లో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి అమెరికా ప్రభుత్వం రూ. 182 కోట్లు ఇచ్చిందని ట్రంప్ పలు మార్లు ఆరోపించారు. ఇకపై అటువంటి నిధులను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచంలో అధిక సుంకాలు విధించే దేశాల్లో ఒకటైన భారత్ వద్ద చాలా డబ్బు ఉందని, ఆ దేశానికి తామెందుకు నిధులు ఇవ్వాలని ప్రశ్నించారు. దీంతో ఈ విషయంపై ఇరుదేశాల మధ్య భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

న్యూజిలాండ్ సమీపంలో చైనా యుద్ధ విన్యాసాలు

వెల్లింగ్టన్, ఫిబ్రవరి 24: చైనా చుట్టుపక్కల దేశాలనే కాదు.. సుదూరంగా ఉన్న వాటిని కూడా వేధిస్తోంది. తాజాగా సోమవారం న్యూజిలాండ్ తీరానికి అత్యంత సమీపంలో డ్రాగన్ యుద్ధ నౌకలు లైవ్ ఫైర్ డ్రిల్స్ మొదలుపెట్టాయి. దీనిపై ఆ చిరుదేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచాన్ని శాసించే స్థాయిలో నౌకాదళం (బ్లూవాటర్ నేవీ) సిద్ధం చేయాలనే బీజింగ్ ప్లాన్‌లో భాగంగానే వీటిని నిర్వహిస్తున్నట్లు నిపుణులు అనుమానిస్తున్నారు.

ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ మధ్యలో టాస్మాన్ సముద్రంలో రెండు లైవ్ ఫైర్ డ్రిల్స్‌ను చైనా నేవీ నిర్వహించింది. శుక్ర, శనివారాల్లో ఇవి జరిగాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాలకు చెందిన ప్రయాణికుల విమానాలకు ఎటువంటి హెచ్చరికలు లేకపోవడంతో.. హఠాత్తుగా తమ మార్గాలను మధ్యలోనే మళ్లించుకోవాల్సి వచ్చింది. దీనిపై న్యూజిలాండ్ రక్షణ మంత్రి జూడిత్ కొల్లిన్స్ స్పందిస్తూ.. ఈ విన్యాసాలు అసాధారణమని పేర్కొన్నారు. ఆ నౌకల వద్ద అత్యాధునిక ఆయుధాలున్నాయని వెల్లడించారు. ఒక నౌకలో 112 లాంచ్ సెల్స్, యాంటీషిప్ బాలిస్టిక్ క్షిపణులు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటి రేంజి సుమారు 540 నాటికల్ మైళ్లు ఉండొచ్చని వెల్లడించారు.

ఈ విన్యాసాలపై చైనా ప్రభుత్వ మీడియా స్పందిస్తూ 8=వ్యపశ్చిమ దేశాలు కూడా వాటి సముద్ర జలాల్లో ఇలాంటి విన్యాసాలకు అలవాటు పడాలని సలహా ఇచ్చింది. చైనా మిలటరీ వ్యవహారాల నిపుణుడు షాంగ్‌జోంగ్ పింగ్ గ్లోబల్ టైమ్స్‌తో మాట్లాడుతూ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ నేవీ భవిష్యత్తులో చైనా తీరాల్లోనే కాకుండా అంతర్జాతీయ జలాల్లో కూడా ఇటువంటి విన్యాసాలు నిర్వహిస్తుందని వెల్లడించింది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ స్పందిస్తూ చైనా యుద్ధవిన్యాసాలు అంతర్జాతీయ చట్టాలను పాటించినా తమకు ముందస్తు ఇచ్చి ఉండాల్సిందన్నారు. ఆ దేశ విదేశాంగ మంత్రి పోనీవాంగ్ స్పందిస్తూ ఈ పరిణామాలపై చైనాను వివరణ కోరనున్నట్లు వెల్లడించారు. కానీ, బీజింగ్ మాత్రం వీటికి కొట్టిపారేసింది. ఆ దేశ విదేశాంగశాఖ స్పందిస్తూ.. ఆస్ట్రేలియా అకారణంగా ఆరోపణలు చేస్తోందని పేర్కొంది. చైనా ముందస్తు నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించింది.

అమెరికా ఇచ్చింది 100 బిలియన్ డాలర్లే..

500 బిలియన్ డాలర్లు కాదు: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

క్వీవ్, ఫిబ్రవరి 24: రష్యాపై యుద్ధం చేసేందుకు తమకు అమెరికా అందించిన సాయం 100 బిలియన్ డాలర్లే అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ యుద్ధంలో ఆయుధాల కోసం ఇప్పటివరకు 320 బిలియన్ డాలర్లు ఖర్చు కాగా.. ఇందులో 120 బిలియన్ డాలర్లను ప్రజల నుంచి సేకరించామని.. మరో 200 బిలియన్ డాలర్లను ఐరోపా సమాఖ్య, అమెరికా అందించాయని జెలెన్‌స్కీ క్వీవ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 'మొత్తంగా అమెరికా నుంచి 67 బిలియన్ డాలర్లు విలువైన ఆయుధాలు.. 31.5 బిలియన్ డాలర్ల బడ్జెట్ సపోర్టు మాత్రమే అందాయి. ఎవరైనా సరే దానిని 500 బిలియన్ డాలర్లుగా లెక్కగట్టి అంతమొత్తం ఖనిజ సంపద ఇవ్వమని అడగకూడదు' అని పేర్కొన్నారని క్వీవ్ ఇండిపెండెంట్ పత్రిక పేర్కొంది.

ఉక్రెయిన్‌కు యుద్ధంలో మద్దతు కొనసాగాలంటే బదులుగా 500 బిలియన్ డాలర్లు విలువైన ఖనిజాలను తమకు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఒప్పందానికి క్వీవ్ కూడా సానుకూలంగా ఉందని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు. చాలా సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు క్వీవ్‌కు అందించిన సాయాన్ని రకరకాలుగా చెప్పారు. ఓ సందర్భంగా ఏకంగా 350 బిలియన్ డాలర్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ నెల 24వ తేదీతో ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్లు పూర్తయ్యాయి. మరోవైపు దీనికి ఒకరోజు ముందు రష్యా ఏకంగా 267 డ్రోన్లతో క్వీవ్‌పూ దాడులు నిర్వహించింది. ఈ స్థాయిలో వీటిని వాడటం ఇదే తొలిసారి. 2022 ఫిబ్రవరి 24న 'ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్' పేరుతో రష్యా యుద్ధాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. నాటో విస్తరణను నిలువరించే ప్రయత్నం, డాన్‌బాస్ విమోచనం, నాజీయిజం నిర్మూలన వంటివి తమ లక్ష్యాలుగా పుతిన్ ప్రకటించారు. మొదట్లో మాస్కో సేనలు దూకుడు కనబర్చినా.. తర్వాత పాశ్చాత్య దేశాల ఆయుధ సాయంతో క్వీవ్ సైతం దీటుగా స్పందించింది. మూడేళ్లలో ఇరువైపులా లక్షలాది మంది సైనికులు మరణించారు, గాయపడ్డారు. కోట్ల డాలర్ల మేర ఆస్తినష్టం వాటిల్లింది.

ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంకోసం రెండో పెళ్లి..

అసలు విషయం బయటపెట్టిన అత్తింటివారు అవాక్కైన అధికారులు

లక్నో, ఫిబ్రవరి 24: ప్రభుత్వ ఆధ్వర్యంలో సామూహిక జరుగుతుండగా దాదాపు 300 మంది వధూవరులు తమ కుటుంబసభ్యులతో కలిసి పెళ్లి పీటలపై కూర్చున్నారు. అంతలోనే కొందరు వ్యక్తులు ఒక్కసారిగా పెళ్లి మండపానికి వచ్చి ఆపండి అంటూ సినిమా స్టైల్లో అన్నారు. వివాహానికి సిద్ధమైన వధువుల్లో ఒకరు అస్మా అనే మహిళకు అప్పటికే పెళ్లి అయిందని తాము ఆమె అత్తింటా వాళ్లమని తెలపడంతో అక్కడ ఉన్నవారంతా ఆశ్చర్యపోయారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో గేదెలు కొనుగోలు చేయడానికి ఈ వివాహ నాటకం ఆడుతుందని తెలుసుకుని అధికారులు ఖంగుతిన్నారు. ఆమె అత్తింటి వారు తెలిపిన వివరాల ప్రకారం మూడేళ్ల క్రితం అస్మాకు నూర్ మహమ్మద్ అనే వ్యక్తితో వివాహం అయింది. వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇరువురి మధ్య విభేదాలు ఎక్కువవడంతో అస్మా ఆరునెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సామూహిక వివాహాలు నిర్వహిస్తోందని అందులో పెళ్లి చేసుకున్న జంటలకు యోగి ప్రభుత్వం రూ.35 వేలు ఆర్థికసాయం, ఇతర బహుమతులు అందచేస్తున్నట్లు తెలుసుకొంది. దీంతో వెంటనే ఆమెకు ఆలోచన వచ్చింది. ప్రభుత్వం చేస్తున్న వివాహాల్లో తన బంధువు జబేర్ అహ్మద్‌ను రెండో పెళ్లి చేసుకుని వచ్చే నగదును చెరి సగం పంచుకోవాలని ప్రణాళిక వేసింది. ఆ డబ్బుతో చెరో గేదెను కొనుక్కోవాలని వారు నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారం సామూహిక వివాహ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. చివరి నిమిషంలో విషయం తెలుసుకున్న అస్మా అత్తింటివారు పెళ్లి వేదిక వద్దకు చేరుకుని ఆ వివాహాన్ని ఆపేయించారు. సామూహిక వివాహ నిబంధనలను ఉల్లంఘించినందుకు, అనధికారికంగా లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకున్నందుకు, ప్రభుత్వ పనులను అడ్డుకున్నందుకు పోలీసులు వధూవరులు ఇద్దరి పైనా కేసు నమోదు చేశారు.

మహా రాజకీయాల్లో కొత్త పరిణామాలు: తరచూ భేటీ అవుతున్న థాకరే ద్వయం

ముంబయి, ఫిబ్రవరి 24: అవిభాజ్య శివసేనలో కొనసాగి ఆధిపత్యపోరులో ఉద్ధవ్‌థాకరేకు సేన అధిపతి బాధ్యతలు రావడం తీవ్రంగా విభేదించి వేరుకుంపటి పెట్టుకున్న ఎంఎన్ఎస్ అదినేత రాజ్‌థాకరే, సేన అధినేత ఉద్ధవ్ థాకరేలు తరచూ భేటీకావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. థాకరేకు వరుసకు సోదరుడు అయిన రాజ్‌థాకరే ఇటీవల ఒక వివాహ వేడుకలో రాజ్‌థాకరేను కలిసారు. ఉద్ధవ్‌తోపాటు ఆయన సతీమణి రష్మిథాకరే కూడా రాజ్‌థాకరేను అభిమానంతో పలకరించారు. రాజకీయంగా వేరుపడిన ఈ సోదరులు మళ్లీ కలుస్తుండటం మళ్లీ ఒకటిగా విలీనం అవుతారా అన్న సందేహాలను రాజేస్తున్నారు. అంధేరిలో మహారాష్ట్రకు చెందిన ఒక సీనియర్ అధికారి ఇంట్లో జరిగిన వివాహవేడుకల్లో రాజ్ థాకరే, ఉద్ధవ్‌థాకరేలు కలుసుకున్నారు. ఇటీవలి కాలంలో అటు ఎంవిఎలోను, ఇటు మహాయుతిలోను చెలరేగుతున్న అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఎంఎన్ఎస్, సేన యుబిటి రెండూ పరస్పరం కూర్చుని తమ మధ్య ఉన్న రాజకీయ వైరుధ్యాలను పరిష్కరించుకోవాలనుకుంటున్నట్లు ప్రచారం తెరపైకి వచ్చింది. ఎందుకంటే మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయి. అన్నింటికంటే మించి రాజధాని ముంబయి మహానగర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ పార్టీలు అనివార్యంగా పోటీచేయాల్సి ఉంది. ఎంఎన్ఎస్, ఎంవిఎ నేతల భేటీ స్థానిక సంస్థల ఎన్నికల కోసమేనని స్పష్టం అవుతోంది. గడచిన రెండునెలల్లో వీరిద్దరూ మూడు సార్లు కలుసుకున్నారు. 2005లో రాజ్‌థాకరే అవిభాజ్య శివసేననుంచి వేరుపడి మహారాష్ట్ర నవ్ నిర్మాణ్‌సేన(ఎంఎన్ఎస్)ను స్థాపించారు. అసెంబ్లీఎన్నికల్లోకూడా వేరువేరుగాపోటీచేసారు గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా శివసేన థాకరే వర్గానికి 20 సీట్లు రాగా రాజ్‌థాకరే ఎంఎన్ఎస్ ఒక్కసీటు కూడా గెలవలేకపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరు తరచూ భేటీ కావడం వెనుక విలీనం ఒక్కటే అయి ఉంటుందన్న ఊహాగానాలు తారస్థాయికి చేరాయి. వీటికితోడు మహాయుతిలో కూడా ఒకప్పటి అవిభక్త శివసేన నుంచి వేరుకుపంటితో బిజెపికి మద్దతిచ్చిన ఏక్‌నాథ్‌షిండేకు కూడా అక్కడ పొసగడంలేదు. అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. షిండే వర్గం ఎమ్మెల్యేలకు ఇచ్చిన భద్రతా కవర్‌ను పూర్తిగా తొలగించడం ఈ వైరుధ్యాలకు మరింత ఆజ్యంపోసింది. వీటన్నిటి నేపథ్యంలో రాజ్‌థాకరే, ఉద్ధవ్‌థాకరేల భేటీ ఇపుడు మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తావిచ్చింది.

పిఎం కిసాన్ పథకం కింద 19వ విడత నిధులు విడుదల!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పిఎం కిసాన్ నిధులు సోమవారం జమ అయ్యాయి. ఈ పథకం కింద 19వ విడత నిధులను నేడు ప్రధాని మోడీ విడుదల చేశారు. బీహార్‌లోని భాగల్‌పుర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా 'పిఎం కిసాన్ సమ్మాన్ నిధి' కింద ఈ నిధులు విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన రూ.22 వేల కోట్ల 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఏటా ఒక్కో విడత

రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో రూ.6 వేల సాయం అందించే పిఎం కిసాన్ పథకాన్ని కేంద్రం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటివరకు 11 కోట్లమంది రైతులకు 18 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లు అందచేసింది. ముందుగా పిఎం కిసాన్ అధికారికి వెబ్‌సైట్‌కి వెళ్లాలి. కుడివైపున కనిపిస్తున్న ఆప్షన్లలో బెనిఫిషియరీ స్టేటస్ ఆప్షన్ ఉంటుంది. సెలక్ట్ చేసుకున్న తర్వాత ఆధార్ లేదా ఖాతా నెంబరును ఎంటర్ చేసి గెట్ డేటా పై క్లిక్ చేయాలి. స్టేటస్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఒకవేళ మీరు పిఎం కిసాన్‌కు రిజిస్టర్ చేసుకుని, ఈ కెవైసి పూర్తి చేసి ఉంటే ఖాతాలోకి డబ్బు జమవుతుంది. అలాగే లబ్ధిదారుల జాబితాలో పేరు ఉందో లేదో కూడా చెక్ చేసుకోవచ్చు. బెనిఫిషియరీ స్టేటస్ కింద బెనిఫిషియరీ లిస్ట్ ఆప్షన్ కనిపిస్తుంది. ఈ ఆప్షన్‌పై క్లిక్ చేసే మరొక పేజీకి రీడైరెక్ట్ అవుతుంది. ఇక్కడ లబ్ధిదారుని రాష్ట్రం, జిల్లా, ఉప జిల్లా, బ్లాక్, గ్రామాలను ఎంచుకుని 'గెట్ రిపోర్ట్'పై క్లిక్ చేస్తే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది.

పిఎం కిసాన్ హెల్ప్‌లైన్ నెంబర్ 155261/011-24300606కు కాల్ చేసి కూడా సమాచారం తెలుసుకోవచ్చు.

షిండేకు పట్టున్న థానెలో బిజెపి నాయక్ జనతాదర్బార్

ముంబయి, ఫిబ్రవరి 24: మహారాష్ట్రలోని అధికార మహాయుతిలో లుకలుకలకు కారణం జనతా దర్బార్ అని కూడాకూటమి నేతలు చెపుతున్నారు. థానెలో మహాయుతినేత గణేశ్‌నాయక్ రెండో విడత జనతా దర్బార్ నిర్వహణకు భారీ ఎత్తున ఏర్పాట్లుచేయడాన్ని కూడా షిండేకు సుతరాము ఇష్టంలేదు. టౌన్‌హాల్‌మీటింగ్‌లకోసం థానె నగరంలో భారీ ఎత్తున పోస్టర్లు కూడా అంటించారు. థానె ఏక్‌నాథ్‌షిండేకు పెట్టని కోటగా నిలిచిన సంగతి తెలిసిందే. జిల్లాలో ఈ దర్బార్ నిర్వహణతో షిండే ఏకస్వామ్యాన్ని సవాల్ చేసినట్లవుతుంది. అంతేకాకుండా థానెకు ఇన్‌ఛార్జి మంత్రిగా కూడా గణేశ్‌నాయక్ ఉన్నారు. నాయక్ ఇప్పటికే నవీముంబయంలోని వాశిలో దర్బార్‌ను నిర్వహించారు. ఈనెల 3వ తేదీ నిర్వహించిన ఈ దర్బార్‌కు విశేష స్పందన లభించింది. థానె లోక్‌సభ ఎంపి శివసేన షిండే వర్గానికి చెందిన వారు నరేష్ ఎంహస్కే ఈ తీరుపట్ల కూడా నిరసన తెలుపుతున్నారు. అయితే పైకి మాత్రం ప్రజలు వారి రాజకీయ నేతలనున కలుసుకోవడానికి వెళితే ఎందుకు అడ్డుకోవాలి అని ప్రశ్నించారు. థానె దర్బార్‌తో ఇపుడు నాయక్, షిండేల మధ్య ఉన్న వైరాన్ని మరింతపెంచుతోంది. అవిభక్త శివసేనలో ఉన్న షిండేకు అప్పట్లో థానె జిల్లాపై మంచి పట్టు ఉండేది. ఇపుడు షిండేకు ఫడ్నవిస్‌కు ఎదురవుతున్న వైరుధ్యాలతో థానెలో బిజెపి పట్టుకోసం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే బిజెపి మంత్రి గణేశ్‌నాయక్ థానెలో జనతాదర్బార్‌ను నిర్వహించారు. 1990లోనే నాయక్ ఈ జనతా దర్బార్‌ను నిర్వహించి ప్రజల దృష్టిలోపడ్డారు. ఈనెల 3వ తేదీనే నవీముంబయి టౌన్‌షిప్ థానెజిల్లా పరిధిలోనే జనతాదర్బార్ నిర్వహిం చారు. ఇపుడు ఏకంగా థానె జిల్లా కేంద్రంలోనే నిర్వహించడం తర్వాత 21వతేదీ పాల్గర్‌జిల్లాలో నిర్వహిస్తామని ప్రకటించారు. షిండే ప్రమేయం లేకుండా థానెలో జనతాదర్బార్ నిర్వహించడం కూడా షిండే శివసేన నేతలకు సుతరాము ఇష్టంలేదు సరికదా బిజెపి వైఖరిపై మండిపడుతున్నారు.

శీష్‌మహల్‌కు మీడియా టూర్.. మీరే నిర్ణయించాలి

ఢిల్లీ మంత్రి పర్వేష్‌సింగ్ వర్మ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: అసెంబ్లీ ఎన్నికల్లో వాడివేడిగాజరిగిన శీష్‌మహల్‌ప్రచారం బిజెపికి ఎంతో కొంత కలిసి వచ్చిందన్నది వాస్తవమే. ఇపుడు అధికార పగ్గాలుచేపట్టిన తర్వాత ఆప్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందన్న అభియోగాలను ప్రజల్లోకి మరింత తీసుకువెళ్లేందుకు వీలుగా ఈ శీష్‌మహల్‌కు మీడియాటూర్‌ను ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేస్తోంది. అవినీతినిరోధిస్తామన్న నినాదంతో అధికారం చేపట్టి పదేళ్లు పాలించిన ఆప్ కొన్ని ప్రభుత్వ సంస్థలను నిబంధనలకు విరుద్ధంగా విలీనంచేసి, 50వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ అద్దాలమేడను నిర్మించిందని బిజెపి రాష్ట్ర చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ విమర్శించారు. అందుకే వాస్తవాలు ప్రజలకు తెలియజేసేందుకు వీలుగా ఈ టూర్‌ను చేపట్టామని ఢిల్లీ ప్రభుత్వం కూడా చెపుతోంది. ఆమ్ ఆద్మీకి ఇంత భారీ ఎత్తున విలాసవంతమైన భవనంలో జీవించాలన అత్యాశ ఏర్పడిందంటూ బిజెపి సెటైర్లువేస్తోంది. ఢిల్లీ మంత్రి పర్వేష్‌వర్మ మీడియాతో మాట్లాడుతూ బంగ్లాలోపలికి మీడియా బృందాన్ని తీసుకువెళతామని, గత ఆప్‌ప్రభుత్వం ప్రభుత్వ నిధులు ఎలా దుర్వినియోగం చేసిందీ మీరే చెప్పాలని సూచించారు. మొత్తం 33కోట్ల రూపాయల ఖర్చుతో ఈ భవనాన్ని ఆధునీకరించారు. ఇప్పటికే బిజెపి కొన్ని స్నాప్ షాట్‌లను కూడా వైరల్‌చేసింది. ఢిల్లీ బిజెపి చీఫ్ అయితే ప్రభుత్వ సంస్థల విలీనాలను వెంటనే రద్దుచేయాలంటూ లెఫ్టినెంట్ గవర్నర్ వీరేంద్ర సచ్‌దేవాకు లేఖలు రాసారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేజ్రీవాల్ ఈ భవనంలో నివసించారు. 2015 నుంచి 2024వరకూ ఇక్కడే ఉన్నారు. ఇపుడు కొత్త సీఎం రేఖా గుప్తా తను ఈ బంగ్లాలో బస చేయనని ముందే చెప్పారు. అయితే ఈ భవనం ఏంచేయాలన్నది భవిష్యత్తులో నిర్ణయిస్తామని ప్రకటించారు.

భారతీయ వంటకాల్లో 'మఖానా' సూపర్‌ఫుడ్

బీహార్ పర్యటనలో ప్రధాని మోడీ

పాట్నా, ఫిబ్రవరి 24: భారతీయ వంటకాల్లో మఖానా సూపర్‌ఫుడ్ అని ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకారి అని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. 365 రోజుల్లో 300 రోజులు అదితన ఆహారంలో భాగం అయ్యేలా చూసుకుంటానన్నారు. దేశవ్యాప్తంగా చాలామందిప్రజలకు అల్పాహారంలో మఖానా తప్పనిసరి అని అంతర్జాతీయ స్థాయిలో దాని ఉత్పత్తి ఉండాలన్నారు. సోమవారం బీహార్‌లోని భాగల్‌పూర్‌లో పర్యటన సందర్భంగా తన ఆహారపు అలవాట్లను వివరించారు. రైతుల శ్రేయస్సుకోసం బీహార్‌లో మఖానాబోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు వార్షిక బడ్జెట్‌లో నిర్మాలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మఖానా బోర్డు ఏర్పాటుకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నామని అన్నారు. ఈ బోర్డుద్వారా ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడతాయి. రైతులకు శిక్షణ అందుతుందన్నారు. వారు అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేలా బోర్డుచూస్తుందని ప్రధాని తెలిపారు. దీనికి గుర్తుగా భాగల్‌పూర్‌లో మోడీకి మఖానాతోచేసిన దండను వేసి గౌరవించారు. ఢిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాటపై బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్‌యాదవ్ చేసిన వ్యాఖ్యలపై మోడీ ఆగ్రహం వ్యక్తంచేసారు. ప్రయాగరాజ్‌లో కుంభమేళా నిర్వహణలో ఐక్యత కనిపిస్తోంది. భారత దేశ అద్భుతమైన వారసత్వాన్ని కాపాడేందుకు భవిష్యత్తు నిర్మాణం కోసం ఎన్డీయే ప్రభుత్వం అందరితో కలిసి పనిచేస్తుందని ఆటవిక రాజ్యాన్ని ప్రోత్సహించే ఈ వ్యక్తులు మన వారసత్వాన్ని విశ్వాసాలను ద్వేషిస్తున్నారని బీహార్‌లోప్రధాని ఆగ్రహం వ్యక్తంచేసారు. లాలూప్రసాద్ కుంభమేళా అర్థంలేనిదని వ్యాఖ్యలు చేసారు. ఇదంతా బుజ్జగింపు రాజకీయాలని లాలూ వ్యాఖ్యలను బిజెపి తిప్పికొట్టింది. దీనిపై ఇపుడు బీహార్ పర్యటనలో ప్రధాని స్పందించారు. బీహార్‌లో ఈ ఏడాది చివరిలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో అక్కడి రాజకీయాలు వేడెక్కాయి. పార్టీలు, నాయకులమధ్య పరస్పర విమర్శలు హోరెత్తాయి.

ఢిల్లీ స్పీకర్‌గా విజేంద్రగుప్తా బాధ్యతల స్వీకారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఢిల్లీ రాజకీయ వర్గాల్లో ముందునుంచి చర్చ జరిగినట్లుగానే బిజెపి ఎమ్మెల్యే విజేందర్‌గుప్తా అసెంబ్లీ స్పీకర్ పదవి సాధించుకోగలిగారు. విజేందర్‌గుప్తాను స్పీకర్‌గా ఎన్నుకున్న తర్వాత సీఎం రేఖాగుప్తా ప్రతిపక్ష నాయకురాలు అతిశిసింగ్ ఆయనను పోడియం మీదకు తీసుకెళ్లి స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీపార్టీ పరాజయం చవిచూసింది. బిజెపి ఘనవిజయం సాధించింది. 48 స్థానాలతో బిజెపి, 22 స్థానాలతో ఆప్ గెలిచాయి. మహిళా సీఎంగా రేఖా గుప్తా పదవీప్రమాణం చేస్తే తొలిరోజు ప్రొటెం స్పీకర్‌గా అర్విందర్‌సింగ్ లవ్లీని లెఫ్టినెంట్ గవర్నర్ వికెసక్సేనా నియమించారు. తొలిరోజు ఆయన ఎమ్మెల్యేలచేత ప్రమాణస్వీకారాలుచేయించారు. తర్వాత స్పీకర్‌ను ఎన్నుకున్నారు. అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా మంగళవారం ప్రసంగిస్తారు. కాగా ఈరోజు ఢిల్లీ రాజకీయాల్లో చరిత్రాత్మకమైనరోజుఅని గడచిన 12 ఏళ్లుగా ఢిల్లీకి ఏర్పడిన ఆప్‌దాకు బాద్యులెవరో ప్రజలే నిర్ణయించారని ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా అన్నారు.

సంక్షోభంలోకి భగవంత్‌మాన్ సర్కార్!

చండీఘర్, ఫిబ్రవరి 24: పంజాబ్‌ప్రభుత్వం త్వరలోనే సంక్షోభంలోకి పడిపోతోందని ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్‌నేత ప్రతాప్‌సింగ్ బాజ్వా ప్రకటించారు. అధికార పార్టీకి చెందిన 32 మంది ఎమ్మెల్యేలు తనతో టచ్‌లో ఉన్నారని మరికొందరు కూడా బిజెపితో టచ్‌లోకి వెళుతున్నారని ఆయన చెప్పారు. భగవంత్ మాన్ ప్రభుత్వం ఒక్కసారిగా కుప్పకూలిపోతుందని ఆయన జోస్యంచెప్పారు. ఆప్‌ప్రభుత్వాని కూల్చివేయాలన్న తపన ఎంతమాత్రం కాంగ్రెస్ పార్టీకి లేదని, అయితే యాధృచ్ఛికంగానే ఎమ్మెల్యేలు అసహనంతో ఉన్నారని ఆయన చెప్పారు. బిజెపి ఇప్పటినుంచే ఆప్‌ప్రభుత్వాన్ని నిస్తేజపరిచే చర్యలు చేపట్టిందన్నారు. ఆప్ ప్రభుత్వం ఐదేళ్లపాటుపనిచేయాలనే కోరుకుంటున్నామని దీనివల్ల ప్రజలకు కూడా ఎ లాంటి ప్

25-2Pg6exHMNWJQE.qxd:25-2Pg6exHMNWJQE.qxd 01/01/01 9:17 AM Page 1

హంద్రీనీవా పరిధిలో భూగర్భ జలాలు అడుగంటకుండా, చెరువులకు నీరు అందించాలి: ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త బ్యూరో హంద్రీనీవా కాలువ 2వదశ కాల్వ లైనింగ్ పనులకు సంబంధించి మా రైతుల అభ్యంతరాలు, ఇబ్బందులను పరిశీలించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆమె మంత్రి క్యాంప్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ నియోజకవర్గంలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవంగా శనివారం రోజు రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ పరివాహక ప్రాంత రైతులతో ఎమ్మెల్యే సునీత, పరిటాల శ్రీరామ్ సమావేశమయ్యారు. హంద్రీనీవా అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ప్రాంతానికి ఎదురయ్యే కష్టాల గురించి వివరించారు. లైనింగ్ పనులు చేస్తే తమ ప్రాంతంలో ఉన్న చెరువులకు నీరందే అవకాశం లేదని, భూగర్భజలాలు తగ్గే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా చేసేందుకు కొన్ని ప్రతిపాదనలు కూడా చేశారు. కాలువ వెంబడి గల వివిధ చెరువులు, కుంటలను హంద్రీనీవా నీరు అందేలా.. తూములను ఏర్పాటు చేయటం, కాలువ సమీపంలో వంకలపై గల చెక్ డ్యామ్ లకు నీరు అందించే విధంగా తూములు ఉండాలని, కాలువ ఉన్న ప్రాంతంలోని వివిధ గ్రామాల రైతులు, ప్రజలు కాలువను దాటే విధంగా వంతెనలు నిర్మించాలని తమ అభిప్రాయాలను రైతులు చెప్పారు. రైతులు చెప్పిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సోమవారం మంత్రి నిమ్మల రామానాయుడు గారిని కలిసి.. రైతులు ప్రతిపాదించిన అన్ని అంశాల గురించి వివరించారు. తీవ్ర కరవు ప్రాంతమైన రాప్తాడు నియోజకవర్గంలో గతంలో నీరు లేక వలసలు ఉండేవన్నారు. హంద్రీనీవా నీరు వచ్చిన తర్వాత తిరిగి ఈ ప్రాంతం వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. హంద్రీ నీవా కాలువ వెంబడి 38 చెరువులకు నీరు ఆగితే చాలా నష్టపోతారన్నారు. అన్ని చెరువులకు నీరందడంతోపాటు భూగర్భ జలాలు తగ్గకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి రామానాయుడు స్పందిస్తూ కచ్చితంగా రైతులు చెప్పిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు...జీడిపల్లి పేరూరు ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వండి..

జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత మంత్రి రామానాయుడుకు విజ్ఞప్తి చేశారు. 2018లో అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మీద నమ్మకంతో భూములిచ్చిన రైతుల్లో చాలా మందికి ఇప్పటికీ పరిహారం అందలేదన్నారు. యూపీపీ కాలువకు సంబంధించి భూసేకరణకు మొత్తం రూ.50.00 కోట్లకు గాను రూ.4.86 కోట్లు గతంలో చెల్లించారన్నారు.

ప్రస్తుతం రూ.14.50 కోట్లకు సీఎఫ్ఎంఎస్ ద్వారా భూసేకరణ చెల్లింపుల కోసం బిల్లులు అప్లోడ్ చేశారన్నారు. వెంటనే ఈ రూ.14.50 కోట్ల నిధులు విడుదల చేసి రైతులకు ఇవ్వడంతో పాటు ప్రాజెక్ట్ పనులకు కూడా నిదులు మంజూరుచేసి పనులను పునః ప్రారంభించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.

సిఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న ఆలూరి రమేష్

ప్రధాన పౌరసంబంధాల అధికారిగా ఆలూరి రమేష్ నియామకం

విజయవాడ,ఫిబ్రవరి24,ప్రభాతవార్తప్రతినిధి:పీ ముఖ్యమంత్రి ప్రధాన పౌరసంబంధాల అధికారిగా ఆలూరి రమేష్ నియమిస్తూ సీఎంవో అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.ఆయన ముఖ్యమంత్రి పీఆర్వోగా ఇప్పటికే పనిచేస్తూ సీపీఆర్వోగా ఆయన చంద్రబాబు ఎంపిక చేసారు.ఆ మేరకు అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యాయి.తనను ఈ పదవిలో నియమించిన చంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్నిచ్చి ధన్యవాదాలు తెలిపారు ఆలూరి రమేష్..ఆయన దశాబ్దన్నర కాలం పైగా పాత్రికేయరంగంలో పలు బాధ్యతలు నిర్వహించారు.రమేష్‌ను పాత్రికేయ సంఘాలు అభినందించాయి.

గవర్నర్ ప్రసంగంలో పస లేదు కూటమి మేనిఫెస్టోను సభలో చదివారు

- ఎక్స్ వేదికగా పిసిసి చీఫ్ షర్మిల కీలక వ్యాఖ్యలు

విజయవాడ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున గవర్నర్ ప్రసంగంలో పసలేదని ఎక్స్ వేదికగా ఏపీసీసీ చీఫ్ షర్మిల కీలక వ్యాఖానించారు. దిశానిర్దేశంఅంతకన్నా లేదన్నారు.అన్ని అర్థ సత్యాలు, పూర్తి అబద్దాలు. సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన లేదు. సంక్షేమం, పునరుజ్జీవనం అంటున్నారే కానీ ఎప్పటి నుంచి అమలు చేస్తారో క్లారిటీ లేదు. ఇచ్చిన గ్యాస్ సిలిండర్ తప్పా మిగతా 5 హామీలపై స్పష్టతద లేదు. మనుషులు ,వనరులు, చేపలు అంటూ సామెతలు చెప్పారు తప్పిస్తే బాబు విజన్ 2047 కి దమ్ములేదు. 8 నెలల పాలన కాలయాపన తప్పా ఎక్కడా కమిటిమెంట్ కనిపించలేదు. హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం తీవ్ర నిరాశను మిగిల్చింది. రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి ఎక్కడొచ్చాయి? 4 లక్షల ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఎవరికిచ్చారు? తొలి సంతకం పెట్టిన డీఎస్సీకి అసలు నోటిఫికేషన్ అయినా ఇచ్చారా? ఆరోగ్య శ్రీ బకాయిలు ఎప్పుడు చెల్లించారు? కొత్త సీసాలో పాత సారా అనే సామెత లెక్క కూటమి మ్యానిఫెస్టోనో గవర్నర్ చదివారు తప్పిస్తే కొత్త అంశాలు ఒక్కటి లేవు. ఒక జనాలు ఛీ కొడుతున్నా వైసీపీఅధ్యక్షులు జగన్ తీరు మాత్రం మారలేదు. 11 మంది ఎమ్మెల్యేలతో కలసి 11 నిమిషాలు ఉండటానికా అసెంబ్లీకి వచ్చింది? ప్రజా సమస్యల కన్నా మీకు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా? సభ్యత్వాలు రద్దవుతాయనే భయంతో అటెండెన్స్ కోసం వచ్చారా? కూటమి ప్రభుత్వ వైఫల్యాలలను ప్రశ్నించడానికి మీకు ప్రతిపక్ష హోదానే కావాలా? ప్రజల శ్రేయస్సు కంటే మీకు పదవులే ముఖ్యమని అసెంబ్లీ సాక్షిగా నిరూపించుకున్నారు. వైకాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులకు పదువులు ముఖ్యం కాదు అనుకుంటే ప్రజాసమస్యలమీద చిత్తశుద్ధి ఉంటే మంగళ వారం నుంచి అసెంబ్లీకి వెళ్ళాలని కోరు తున్నాం.

అర్ధనారీశ్వరాలయం అభివృద్ధితో ఆకర్షణీయం

శ్రీకాళహస్తీశరాలయానికి రూ.2కోట్లతో అభివృద్ధి

తొట్టంబేడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశరాలయానికి ఆమడదూరంలో ఉన్న అర్ధనారీశ్వరాలయం అభివృద్ధిలో భక్తులను ఆకట్టుకుంటోంది. నిధులు సుమారు రూ.2కోట్లతో ఆలయాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. మూడేళ్ళ క్రితం వరకు శిథిలావస్థలె ఉన్న ఆలయాభివృద్ధికి శ్రీకాళహస్తీశ్వరుని నిధులు అందాన్ని ఆపాందిస్తున్నాయి. స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అర్ధనారీశ్వర ఆలయంలో వెలసిన స్వయంభువు లింగం రెండు వర్ణాల్లో కనిపిస్తుంది. జీవనది స్వర్ణముఖి ఒడ్డున వెలసిన ఈ దివ్యక్షేత్రానికి ఎప్పుడో పరిపాలించిన రాజులు మణిమాక్యాలను కేటాయించారు. కాలక్రమంలో కొన్ని ఆక్రమణలకు గురైనా నేడు ఆలయ పరిసరాలు 10 ఎకరాలుగా మారింది. నాయుడుపేట-తిరుపతి జాతీయరహదారిగా రూ.1750కోట్లతో ఆరులేన్ల రోడ్డును తీర్చిదిద్దారు. శ్రీకాళహస్తికి కిలోమీటరు దూరంలో ఈ రహదారి పయనిస్తుంది. ఈ రహదారికి సుమారు కిలోమీటరు దూరంలో అర్ధనారీశ్వరాలయం వెలసి భక్తులకు కొంగుబంగారంగా వరాలిస్తోంది. వెళ్ళడానికి దారి దొంక లేని ఆలయానికి మహార్ధశ కల్పించుటకు గత పాలకులు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి బైపాస్ నుంచి సుమారు కిలోమీరు దూరంలో అర్ధనారీశ్వరాలయం వెలసింది. ఇక్కడ సోమ, మంగళ, శుక్ర, వారాల్లో కాకుండా మిగిలినరోజుల్లో కూడా భక్తులు విశేష సంఖ్యలో హజరై పూజలు జరుపుకుంటారు. ముఖ్యంగా మహిళలకు ఆకర్షణీయంగా మారిన ఈ ఆలయంలో కార్తీకమాసంలో వేలాది మంది భక్తులు పాల్గొంటూ దీపారాధన చేస్తుంటారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చుట్టుపక్కల పది గ్రామాల ప్రజలు కదలిరావడం ఆనవాయితీ. మరో నెలరన్నర రోజుల్లో పూర్తికానున్న ఆలయం సర్వాంగసుందరంగా కనిపించనుంది. సుమారు 200మంది భక్తులు వరకు కూర్చుని స్వామిఅమ్మవార్లను దర్శించుకునే భాగ్యం కలగనుంచి సుమారు పది ఎకరాల్లో రూపుదిద్దుకుంటున్న ఆలయం వద్ద గోశాల, బిల్వనవృక్షం వనంలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక మహాశివరాత్రి సందర్భంగా విచ్చేసే భక్తులకు ఇప్పటికే క్యూలైన్లు ఏర్పాటు చకచగా చేస్తున్నారు. ఎక్కడా జరగని విధంగా ఇక్కడ అన్నదానాలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. హరుడు, భవహరుడు, భక్తవశంకుడు, మూగజీవులకు ముక్తిని ప్రసాదించిన ముక్కంటీశుడు శ్రీకాళహస్తీశ్వరుడు. ఎంతో పవిత్రపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పరమేశ్వరుడు స్వయంభువుగా వాయులింగ రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నాడు. తనశరీరంలో అర్ధభాగాన్ని పార్వతీదేవికి ఇచ్చిన పరమశివుడు అర్ధనారీశ్వరునిగా వెలిశాడు. ఈరూపాన్ని లింగాకారంగా మార్చి సువర్ణముఖినదీ తీరాన శ్రీకాళహస్తి లోనే ఆ ఆదిదంపతులు కొలువై భక్తులకు కోరిన వరాలిస్తున్నారు. ఇక్కడికి మరొకొద్ది దూరంలో ఈసలాపురం(విశాలపురం) గ్రామంకు సమీపం సువర్ణముఖి నదిలో అర్ధనారీశ్వరుడు కొలువై ఉన్నాడు.

శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బిఐఎస్ అధికారి డి వివేక్‌వర్ధన్‌రెడ్డి

బిఐఎస్ కార్యక్రమాల బలోపేతానికి రిసోర్స్ పర్సన్ల నియామకం

విజయవాడ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌లో బిఐఎస్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి రిసోర్స్ పర్సన్లను నియమించి వారికి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం విజయవంతంగా నిర్వహించార. ఈసందర్భంగా బిఐఎస్ విజయవాడ సైంటిస్ట్ సి/డిప్యూటి డైరెక్టర్ డి వివేక్‌వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 130 మంది నిపుణులను ఎంప్యానల్ చేశామని వారంతా ఎప్పటికప్పుడు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు బిఐఎస్ కార్యకలాపాలను ప్రచారం చేయాలన్నారు. ప్రభత్వ శాఖలు, పరిశ్రమ, వాణిజ్య సంస్థల హెచ్ఓడిలకు సందేశాల ద్వారా బిఐఎస్ పాత్రను మరింత లోతుగా వ్యాపి్ త చేయడానికి మనక్‌మిత్రాస్ నిమగ్నమయ్యా రన్నారు. కార్యక్రమంలో బిఐఎస్ విజయవాడ సా్టండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి కృష్ణ వీర్ వర్మ, బిఐఎస్ అధికారులు పాల్గొన్నారు.

విఆర్ఓల సమస్యలను పరిష్కరించండి: మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం

విజయవాడ, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : విఆర్ఓలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలంటూ విఆర్ఓ అసోసియేషన్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరింది. సోమవారం అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. సచివాలయాల రేషనలైజేషన్ వల్ల భవిష్యత్తులో విఆర్ఓలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఖాళీగా వున్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సివిల్‌సప్లై, ఇతర శాఖల్లో ఖాళీగా వున్న పోస్టుల్లో అర్హులైన గ్రేడ్1, 2 విఆర్ఓలకు అవకాశం కల్పించాలన్నారు. రేషనలైజేషన్ చేసేప్పుడు విఆర్ఓల సంఘంతో చర్చించాలన్నారు. ఒక సచివాలయానికి ఒక విఆర్ఓ వుండేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన విఆర్ఏలకు ప్రమోషన్లివ్వాలని, గ్రేడ్1, 2 విఆర్ఓ లకు కామన్ డిడిఓగా తహసీల్దార్ వుండేలా నిర్ణయం తీసుకోవాలని, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ లైన్ డిపార్ట్‌మెంట్ ద్వారానే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లను మంత్రికి వినతిపత్రం రూపంలో అందించారు. అనంతరం మంత్రి బాల వీరాంజనేయ స్వామిని కలిసి సచివాలయ వ్యవస్థ మార్పులపై చర్చించారు. అనంతరం సిసిఎల్ఏ అడిషనల్ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డిని కలిసి విఆర్ఓలపై జరుగుతున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలన్నారు.

స్వామి అమ్మవార్లకు పూజాదికాలు నిర్వహిస్తున్న దృశ్యం

దుర్గమ్మ ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వేదోక్తంగా ప్రారంభం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 24, ప్రభాత'వార్త' : అమ్మలగన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో శివరాత్రి ఉత్సవాల సంబరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఆదిదంపతులకు పట్టువస్త్రాలను అధికారులు సమర్పించారు. శ్రీ గంగా, పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్ల ఉత్సవర్లకు మంగళస్నానములు జరిపించి నూతన వధూవరులుగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవచనము, అంకురార్పణ, మండపారాధన, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, మూల వినియోగంతో మొదటిరోజు పూజాదికాలు జరిపారు. ఆదిదంపతులకు నిర్వహించే కళ్యాణోత్సవ టికెట్లను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కనకదుర్గమ్మ.ఓఆర్‌జి ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్‌చేసుకోవాలని ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. 26వ తేదీ ఉదయం నుండి సాయంత్రం వరకు శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు త్రికాల అభిషేకాదులు జరుపుతామన్నారు. ఉదయం 6 నుండి 9 వరకు, ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 వరకు అభిషేకాలు జరుగుతాయన్నారు. రాత్రి 9 గంటల నుండి మహన్యాసం, అనంతరం లింగోద్భవ అభిషేకం, మహానివేదిన, హారతి, మంత్రపుష్పం జరుగుతాయన్నారు. అనంతరం కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, డిప్యూటి ఇఓ రత్నరాజు, ఎఇఓ ఎం దుర్గారావు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

- ఆన్లైన్‌లో కళ్యాణోత్సవ టికెట్లు: శివరాత్రి పర్వదినాన శ్రీ మల్లేశ్వర స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో శ్రీ గంగా, పార్వతి(దుర్గా) సమేత శ్రీ మల్లేశ్వర స్వామివార్ల దివ్య లీలా కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు.

- 27 న రథోత్సవం: 27న సాయంత్రం 4 గంటలకు రథోత్సవము, 28వ తేదీన ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకోటోత్సవం, వసంతోత్సవము, అవభృథోత్సవం (దుర్గాఘాట్‌నందు) , తదుపరి ధ్వజారోహణం జరుగుతాయన్నారు. మార్చి 1న శ్రీ మల్లేశ్వర స్వామివార్లకు సాయంత్రం పంచహారతులు, ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవ, మార్చి2, 3వ తేదీల్లో ఉదయం 8 గంటలకు పవళింపు సేవలు జరుగుతాయన్నారు. 26వ తేదీ నిర్వహించే మహాశివరాత్రి కళ్యాణోత్సవంలో పాల్గొన వలసిన ఉభయ దాతలు ఆర్జిత సేవా రుసుము రు.1,116లను చెల్లించి పాల్గొనాలన్నారు. పాల్గొన్న వారికి శేషవస్త్రము, రవిక, శ్రీ చక్రలడ్డూ అందిస్తామన్నారు. టిక్కెట్లను డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు. కనకదుర్గమ్మ. ఓఆర్‌జి నందు టిక్కెట్లు బుక్‌చేసుకోవాలన్నారు.

పూడి గ్రామ హరిజనవాడలో మహిళపై జీబిఎస్ కేసు నమోదు

- జిల్లాలోనే తొట్టంబేడు మండలంలో తొలికేసు నమోదు

తొట్టంబేడు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త తిరుపతి జిల్లా, తొట్టంబేడు మండలం పూడి గ్రామంలోని హరిజనవాడలో ఓమహిళకు జీవిఎస్ కేసు జిల్లాలోనే తొలిసారిగా నమోదయ్యిందని కాసరం ప్రాథమిక వైద్యాదికారి డాక్టర్ మాధవుడు అన్నారు. పూడి హరిజనవాడలో నివాసం ఉంటున్న ధర్మయ్య భార్య వెంకటమ్మ ఈనెల 10వ తేదీన సాధారణ జ్వరం, ఆరోగ్యం నిస్సత్తువగా ఉందని పూడి హెచ్‌డబ్ల్యుసి నందు ఎంఎల్‌హెచ్‌పి తేజ వద్ద చికిత్స పొందిందని మూడు రోజుల తర్వాత తిరుపతిలో నివాసం ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్ళినట్లు పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన స్విమ్స్‌లో తిరుపతి నందు అడ్మిట్ అయ్యిందని అదేరోజు నిర్వహించిన వైద్యపరీక్షల్లో గులియన్ బారే సిండ్రోమ్(జిబిఎస్)కేసుగా స్విమ్స్ తిరుపతి న్యూరాలజీ విభాగం నిర్ధారణ చేసినట్లు తెలిపారు. దీంతో సోమవారం కాసరం పిహెచ్‌సి వైద్యాదికారి డాక్టర్ ఈ.మాధవుడు, సూపర్‌వైజర్ సిబ్బంది క్షేత్రస్థాయి సిబ్బందితో కలసి కేసుకు సంబందించిన వివరాలు రీజాయిండర్ రిపోర్ట్ నివేదికను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపామన్నారు. 22పతేదీన సంబందిత పూడి హరిజన వాడలో వైద్యశిబిరం నిర్వహించి క్షేత్రస్థాయి సిబ్బందితో ఇంటింటి సర్వే చేసి జ్వరాలు మరియు ఇతర జబ్బులకు చికిత్స అందించామన్నారు. ఎలాంటి జ్వరకేసులు నమోద కాలేదని పంచాయతీ సిబ్బందితో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అన్ని రకాల తాగునీటి వనరుల వద్ద నీటి నమూనాలు సేకరించామని, ల్యాబ్ నివేదికలు అనుసరించి తాగునీటి ప్రమాణాలు తీసి నీటి వనరులు మెరుగు పరిచే చర్యలను తొట్టంబేడు ఎంపిడిఓ సురేంద్రనాథ్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు చేపట్టారు.

మంచినీటి సురక్షితకేంద్రంలో శాంపిల్స్‌ను సేకరిస్తున్న దృశ్యం

వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. వ్యాధిలక్షణాలను పరిశీలిస్తే జీబిఎస్ సోకిన వారికి నరాల బలహీనత, శ్వాసకోశకు సంబందించి ఊపిరితిత్తులపై ప్రభావం ఉంటుందన్నారు. అయితే ఇది విస్తరించే వ్యాధికాదని సరైన వైద్యపొందితే ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.

ఆద్యంతం ఆధ్యాత్మికతతో తిరుపతి ఆవిర్భావ వేడుకలు

తిరుపతి,ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి: ఆధ్యాత్మిక నగరం తిరుపతి ఆవిర్భావ దినోత్సవ వేడకలను రాయలసీమరంగస్థలి ఆద్యంతం ఘనంగా జరుపుకుంది. సోమవారం ఉదయం రాయలసీమ రంగస్థలి సంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు కెఎన్‌రాజా, కల్పన, నిర్మల, జ్యోతి, జయమ్మ ,పద్మ, పొన్నాలజేజిరెడ్డి, వాసురావు, ఉషారాణి, పార్వతి, చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు విశేష వేషధారణలతో తిరుపతి నగరం ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. తిరుమలతిరుపతిదేవస్థానం, తిరుపతి నగరపాలకపసంస్థ ఈ వేడుకలను నిర్వహించాలని ఆయన కోరారు. పురాతన పట్టణాల్లో తిరుపతి ఒకటిగా నిలిచిందన్నారు. మహాపుణ్యక్షేత్రం తిరుపతి నగరానికి ఖచ్చితమైన ఆవిర్భావం దినోత్సవం లభించడం గర్వించదగిన విషయమన్నారు. ఇటీవల తిరుపతిగ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయం పున:నిర్మాణంలో భాగగంగా లభ్యమైన శాసనాలు పరిశీలన చేసిన చరిత్రకారులు 900 సంవత్సరాలు ముందే తిరుపతి ఆవిర్భవించిందని పేర్కొన్నారు.

అధికారులు చెప్పిన సాక్ష్యం ఆధారంగా రుజువైన నేరం!

సంచలన తీర్పు వెలువరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్

అనంతపురం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త బ్యూరో అనంతపురం జిల్లా నార్పలకు చెందిన మట్టి పవన్ కుమార్ హత్య కేసులో ఐదుగురికి జీవిత కాలపు కఠిన కారాగార శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ .శ్రీనివాస్ సోమవారం సంచలన తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాల్లోకి వెళితే, నార్పలకు చెందిన హతుడు మట్టి పవన్ కుమార్, మెదటి ముద్దాయి డిపో షాజిద్ మంచి స్నేహితులు. వారి మధ్య భేదాభిప్రాయాలు వచ్చి కొట్లాడుకుంటూ, తరచూ మట్టి పవన్ కుమార్ ఈ డిపో షాజిద్ ను, నాల్గవ ముద్దాయి తలారి సుధాకర్ ను చంపుతానని బెదిరించేవాడు. వారి మధ్య భేదాభిప్రాయాలు తారాస్థాయికి చేరడంతో మట్టి పవన్ కుమార్ తన తల్లిదండ్రులతోపాటు సంసారాన్ని నార్పల నుండి అనంతపురం కు మార్చారు. 2022 సంవత్సరం ఏప్రిల్ 12 తేదీన తేదీ మట్టి పవన్ కుమార్ అతని తండ్రి మట్టి శ్రీనివాసులు రేషన్ బియ్యం తెచ్చుకోవడం కోసం నార్పలకు వెళ్లారు. మధ్యాహ్నం తండ్రికి చెప్పకుండా మట్టి పవన్ కుమార్ నార్పల తహసీల్దార్ ఆఫీస్ వద్దకు పోయాడు, అక్కడ డిపో షాజిద్ తారస పడడంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు, ఆ క్రమంలో మట్టి పవన్ కుమార్ డిపో షాజిద్ పై కత్తితో దాడి చేయగా, అతని చేతికి గాయాలయ్యాయి. ఆ తర్వాత అదే రోజు రాత్రి డిపో షాజిద్ తన అనుచరులైన చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, మరియు తలారి అరుణ్ లను వెంట పెట్టుకొని మట్టి పవన్ కుమార్ కోసం వెతుకుతూ వుండగా, రాత్రి సుమారు 1030 గంటల సమయంలో నార్పల గ్రామంలోని వడ్డే తిమ్మన్న తోట వద్ద మట్టి పవన్ కుమార్ వున్నాడన్న సమాచారం తెలుసుకొని పై వారందరూ స్టీల్ రాడ్, రెండు కట్టెలు తీసుకొని అక్కడికి పోయి, డిపో షాజిద్ ఏమిరా నీవు మధ్యాహ్నం నాతో గొడవపడి నన్నే కొట్టడానికి వస్తావా నిన్ను చంపితే నీకు దిక్కెవరు".. అంటూ డిపో షాజిద్, తలారి సుధాకర్, తలారి అరుణ్ తమ వెంట తెచ్చుకొన్న స్టీల్ రాడ్, కట్టెలతో అతి దారుణంగా కొడుతూ, కొట్టేటప్పుడు తలారి సుధాకర్, చిక్కేపల్లి నాగేంద్రను వీడియో తీయమని ఆదేశిస్తూ,

ఈ వీడియో చూచి అందరూ మనమంటే భయపడాలి అని చెప్పగా నాగేంద్ర తన సెల్ నుండి మట్టి పవన్ కుమార్ ను చంపేటపుడు వీడియో తీసి, దానిని తలారి సుధాకర్ సెల్ కు ఫార్వర్డ్ చేశాడు. అందులో .. సుధాకర్ అంటే ఒక బ్రాండ్".. అంటూ రాడ్ తో ఇష్టానుసారంగా కొట్టే దృశ్యాలు వున్నాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో హల్చల్ చేసింది. పోలీసులు నాగేంద్ర మరియు తలారి సుధాకర్ సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని ఫారెన్సిక్ ల్యాబ్ కు పంపి, అందుకు సంబంధించిన బలమైన డిజిటల్ సాక్ష్యాలను కోర్టు ముందు ప్రవేశపెట్టడం వలన, ప్రత్యక్ష సాక్షులు సాక్ష్యం చెప్పక పోయినప్పటికీ, సెల్ ఫోన్ లో నిక్షిప్తమైన సాక్ష్యంతో పాటు అధికారులు చెప్పిన సాక్ష్యం ఆధారంగా నేరం ఋజువు కావడంతో ముద్దాయిలు డిపో షాజిద్, చింతాకు రమేష్, చిక్కేపల్లి నాగేంద్ర, తలారి సుధాకర్, తలారి అరుణ్.. లకు జీవిత కాలపు కఠిన కారాగార శిక్ష విధిస్తూ,ఒక్కొక్కరికి 20,000/ జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరపున రాచమల్లు హరినాథ్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు.

ఈ కేసులోని ముద్దాయిలు అందరూ 25 సంవత్సరాల లోపు యువకులు, ఒక్కరు మినహా అందరూ అవివాహితులు. ఈ కేసులో అప్పటి నార్పల ఎస్సై యు .వెంకట ప్రసాద్, సెక్షన్ 302 ఆర్ / డబ్ల్యు సెక్షన్ 34 ఐపీసీ క్రింద ఎఫ్ఐఆర్ నెంబర్ 57/2022 గా నమోదు చేయగా, అప్పటి ఇటుకలపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్లు శ్రీ. విజయ భాస్కర్ గౌడ్, శ్రీ.అస్రార్ బాషా, సమగ్ర దర్యాప్తు జరిపి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.

ఈ కేసులో సాక్షులను తీసుకు రావడంలో తిశ్రీ, మల్లి రెడ్డి, కానిస్టేబుళ్ళు రామమోహన్, షానవాజ్ తదితరులు బాగా సహకరించారు. వీరందరిని అనంతపురం జిల్లా ఎస్పీ పి .జగదీష్ అభినందించారు.

బస్సు బోల్తా - 17 మందికి గాయాలు - ఇద్దరి పరిస్థితి విషమం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త పాండిచ్చేరి నుంచి విజయవాడకు ఆదివారం సాయంత్రం బయలుదేరిన ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు అర్ధరాత్రి సమయంలో సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు వద్ద జాతీయ రహదారి క్రాస్ రోడ్డు సమీపంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 17 మంది గాయపడగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

25-2P□g7exHMNWJQE.qxd:25-2P□g7exHMNWJQE.qxd 01/01/01 9:15 AM Page 1

సభాపతి, మీడియాపై ఆంక్షలు ఎందుకు, పునరాలోచించండి: ఎపియూడబ్ల్యూజే

విజయవాడ.ఫిబ్రవరి24.ప్రభాతవార్తప్రతినిధివ రాష్ట్ర శాసనసభ సమావేశాల కవరేజికి కొన్ని పత్రికల, చానళ్ల,రిపోర్టర్లను అనుమతించకపోవడం సమంజసం కాదని , ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) వ్యాఖ్యానించింది.ఈ ఆంక్షలను తొలిగించాలని విజ్ఞప్తి చేసింది.ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు , ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డీ సోమసుందర్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ ఏచూరి, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, విజయవాడ అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు తప్పుపట్టారు. ఆమేరకు సోమవారం వారు ఒక మీడియా ప్రకటన జారీ చేసారు.రాజ్యాంగంలో చట్టసభలకు అత్యున్నత గౌరవం ఉందని, అదే విధంగా పత్రికా రంగానికి కూడా నాలుగో స్థంభంగా కీలకస్థానం ఉందని, శాసనసభ కవరేజికి అన్ని పత్రికల చానళ్ల విలేఖరులకు అవకాశం ఇవ్వాల్సి ఉండగా కొందరికి అనుమతి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం విచారకరమని , మీడియా పట్ల అలాంటి పక్షపాత ధోరణులు కొనసాగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో అభిప్రాయ పడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అలాంటి నిర్ణయం తీసుకుంటారని తాము ఊహించలేదని, అపారమైన రాజకీయ అనుభవం, ప్రజాస్వామ్య పరిణతి కలిగిన సభాపతి తమ నిర్ణయాన్ని పునరాలోచించాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. గతంలో వైఎస్ ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని పత్రికలు , ఛానెళ్ల ప్రతినిధులకు శాసనసభ కవరేజికి అవకాశం నిరాకరించడం జరిగిందని , అవే తప్పులను కూటమి ప్రభుత్వం కొనసాగించడం 2024 ఎన్నికల తీర్పులోని ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి అధికారిక సమావేశాలకు కూడా కొన్ని పత్రికలు చానల్స్ ను పిలవకపోవడం తగదన్నారు. శాసనసభ స్పీకర్, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునః పరిశీలించి , మీడియా ప్రతినిధులు అందరికీ అవకాశం ఇవ్వాలని , రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మీడియా పాస్‌లో విషయంలో అత్యంత ప్రాచుర్యం కలిగిన తటస్ట పత్రికలకు సైతం తగిన పాస్‌లు ఇవ్వడం సరికాదన్నారు.

శిద్దనకొండూరు కొండపై బయటపడిన శిలాశాసనం

కలిగిరి,(నెల్లూరు) ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: కలిగిరి మండలం శిద్దనకొండూరు కొండపై 13వ శతాబ్దపు శిలాశాసనం బయట పడింది. వివివరాల్లోకి వెళ్తే శిద్దనకొండూరు కొండపై శ్రీ శిద్దేశ్వర స్వామి ఆలయం ఉంది. ఆ ఆలయానికి గ్రామస్తులు వెళ్తుంటారు. ఈక్రమంలో గ్రామానికి చెందినపాలిశెట్టి లక్ష్మీకాంతారావు అనేవ్యక్తికి ఆలయ పరిసరాల్లో శిలాశాసనాన్ని కనుగొనడం జరిగింది. ఈవిషయం కలిగిరి మండల బిజెపి నాయకునికి చేరవేయడంతోఆయన సహకారంతో చెన్నైకి చెందిన బారతీయ పురావస్తుశాఖ చెన్నై శాసన విబాగపతి డాక్టర్ ఎం .ఏసుబాబు, చిత్రకారులు రసూల్‌బాబు శిద్దనకొండూరు చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో గ్రామానికి 2కిలోమీటర్ల దూరంలో ఉన్న శిలాశాసనాన్ని గుర్తించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిలాశాసనం 13వ శతాబ్దంలో రాయబడిందన్నారు.తెలుగు చోళరాజైన మనుమశిద్ది మహారాజుకుమారుడు శ్రీమనుమ గాండగోపాలుని కాలంలో శిద్దనకొండూరు ను పాలించే నూంకినాయకుడి కుమారుడు శిద్దప్ప క్రీస్తువకం 1290 వికృతనామ సంవత్సరం దశమి సోమవారం జారీ చేశారని వివరించారు.శిద్దనకొండూరు గ్రామం వెయ్యి సంవత్సరముల క్రితమే ఉన్నట్లు వాస్త్రం చేబుతుందన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్తాన చైర్మన్ రూపిశెట్టి రామబద్రరావు,జాతీయ అత్యుత్తమ ఉపాద్యాయ పురస్కారగ్రహీత నందనవనం ప్రబాకర్‌రావు, పాలిశెట్టిలఇక్ష్మీకాంతారావు,అంబటి శివశకర్,మురుగమ్మశ్రీకాంత్,గనిశెట్టిమాదవ, నేతి బాను, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్రెడిట్ కార్డులు, స్మార్ట్‌ఫోన్ గిఫ్ట్‌లతో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

బహుమతులు వస్తే జాగ్రత్తగా ఉండాలి: టిజిసిఎస్‌బి

హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : ప్రజలను మాయచేయడంలో ఆరితేరిన సైబర్ నేరగాళ్లు ఈ క్రమంలో కొత్త పంథాను ఎంచుకున్నారు. ఇప్పటి వరకు స్టాక్ ట్రే డింగ్, డిజిటల్ అరెస్టు, లాటరీలు తదితర పద్ధతుల్లో అమాయకులను బురిడి కొట్టించిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్తగా ఉచిత క్రెడిట్ కార్డులు వాటితో పాటు స్మార్ట్ ఫోన్‌లను బహుమతులుగా పంపుతూ వాటిని వాడుతున్న వారి బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకుని నిమిషాల్లో నగదును కాజేస్తున్నారు. ఈ తరహా మోసం బెంగళూరులో వెలుగు చూడగా బాధితుడు ఏకంగా 2.8 కోట్ల రూపాయలను పోగొట్టుకున్నాడు. ఈ తరహా మోసాలపై అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని తెలం గాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) అధికారులు హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న కొత్త పద్ధతి వింతగా వుండడం విశేషం. గుర్తు తెలియని వ్యక్తు లు మేము పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాము. మీరు ఉత్తమ కస్టమర్‌గా ఎంపికయ్యారు. అందుకుగానూ మీకు అపరిమితంగా వాడుకునే క్రెడిట్ కార్డుతో పా టు దీనిని తీసుకుంటే ఖరీదైన స్మార్ట్ ఫోన్‌ను బహుమతిగా ఇస్తున్నాము. దయచేసి కాదనకుండా స్వీకరించండి. అని చెబుతారు. దీని తరువాత పార్శిల్‌లో ఇంటికి క్రెడి ట్ కార్డుతో పాటు స్మార్ట్ ఫోన్ వస్తుంది. వీటిని తీసుకుని ఫోన్‌లో సిం కార్డు అమర్చి ఫోన్‌ను వాడడం మొదలుపెట్టాక బ్యాంకు ఖాతాలో గల గూగూల్ పే, ఫోన్ పే వివరాలన్నీ సైబర్ నేరగాళ్లకు నిమిషాల వ్యవధిలో తెలిసిపోతుంటాయి. సైబర్ నేరగాళ్లు ఈ వివరాలు తెలుసుకునేందుకు బహుమతిగా పంపిన సెల్‌ఫోన్‌లో అంతకు ముందుగానే ఇన్‌స్టాల్ చేసిన క్లోనింగ్ యాప్ కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ యాప్ వల్ల ఎలాంటి ఓటిపి అవసరం లేకుండానే బహుమతిగా వచ్చిన స్మార్ట్ ఫోన్‌లో సిమ్ కార్డులు వాడి వినియో గించిన ఖాతాదారుల వివరాలు సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారు. ఈ తరహా మోసాల పట్ల అన్ని వర్గాల వారు అప్రమత్తంగా వుండాలని టిజిసిఎస్‌బి అధికారులు కోరారు. ఉచితం గా క్రెడిట్ కార్డులు వాటితో పాటు స్మార్ట్ ఫోన్‌లు బహుమతిగా వస్తే ఎవరూ ఆశపడవద్దని వారు కోరారు. దీనిపై వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలని వారు కోరారు.

జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు.. కలెక్టరేట్ల వద్ద నిరసనలు

హైదదరాబాద్ ముషీరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్క రించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవ పున్నయ్య విజ్ఞప్తి చేశారు. టిడబ్ల్యుజెఎఫ్ పిలుపు మేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సమాచారభవన్ వద్ద ఫెడ రేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలపగా, జిల్లా కలెక్టరేట్ల ముందు జిల్లా కమిటీ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎస్.హరీష్‌ను కలసి వినతిపత్రం అందచేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం తదితర సమస్య లను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, కార్యదర్శులు గుడిగ రఘు, ఎస్.కే.సలీమ కార్యవర్గ సభ్యులు, కె.పాండురంగారావు, పి. నాగవాణి, మణిమాల, నాయకులు యర్రమిల్లి రామారావు, శ్రీనివాస్ గౌడ్, రవికుమార్, సిహెచ్ రంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించేలా సిఎంకు నివేదిస్తా

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించే అంశాన్ని సిఎం రేవంత్‌రెడ్డిని సంప్రదించి కమిషన్ తరఫున నివేదిక అందజేస్తామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విద్య రక్షణకు ఉద్యమించాలని, విద్యా హక్కు కల్పిం చకపోతే దళితులు చదువుకు దూరమయ్యేవారని అన్నారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారయణ మాట్లాడుతూ మనువాద భావాజాలం వల్లనె విద్యకు బడ్జెట్ కేటాయించకుండా దళితులను విద్యకు దూరం చేసే కుట్ర చెస్తున్నారన్నారు.

యంవి ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామి ప్రకారం 15 శాతం బడ్జెట్ కేటాయించి నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు పసుపురంగులా!

-రుయా ఆస్పత్రిని విశాఖలోని ఆస్పత్రి తరహాలో అభివృద్ధి చేయాలి - కాంగ్రెస్ ధర్నాలో మాజీమంత్రి డాక్టర్ చింతా

తిరుపతి.ఫిబ్రవరి 24ప్రభాతవార్తప్రతినిధి: గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో తిరుపతిలో దామినేడు వద్ద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళకు జిల్లా అధికారులు పసుపురంగు వేయడం దారుణమని కేంద్రమాజీమంత్రి, మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ ఖండించారు.తిరుపతిలోని రూయా ఆస్పత్రిని కర్నూలు, గుంటూరు, విశాఖలోని ప్రభుత్వ ఆస్పత్రుల తరహాలో అభివృద్ధిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలన్నారు.అన్ని విభాగాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిరుపేదలందరికీ ఉచితంగా సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలను అందించాలని ఆయన సూచించారు. అలిపిరి వద్ద నిర్మిస్తున్న చిన్నపిల్లల ఆస్పత్రి భవనాన్ని రుయాకు కేటాయించాలన్నారు. టిటిడి పాలకమండలిలో ఈ విషయం చర్చించి ఛైర్మన్, ఇఒ నిర్ణయం ప్రకటించాలన్నారు. స్విమ్స్ ఆస్పత్రిలో పేదలకు వైద్యసేవలు గగనంగా మారాయన్నారు. డబ్బు కట్టందే వైద్యసేవలు అందడం లేదని ఆవేదన చెందారు. ఈ మద్యకాలంలో కూటమి నేతల పాపాలు ఎక్కువయ్యాయన్నారు.. డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ళను పేదలకు ఉచితంగా ఇవ్వాలని చింతా రాష్ట్రప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ళకు పసుపు రంగులు వేయడం ఏంటని, జిల్లా కలెక్టర్,అధికారులకు ప్రభుత్వంపై మమకారం ఉంటే పసుపుచొక్కాలు వేసుకోవాలని ఆయన సూచించారు.

ఎస్వీయూ రిటైర్డ్ టైం స్కేలు ఉద్యోగుల వయో పరిమితి పెంచండి

- సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ఎస్వీయూ ఉద్యోగుల విజ్ఞప్తి

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీలో జూనియర్ అసిస్టెంట్లుగా 30 సంవత్సరాలు పనిచేసి రిటైర్డ్ అయిన తర్వాత ఎటువంటి బెనిఫిట్స్ లేకపోవడంతో మా కుటుంబాల ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని, కనీసం 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు రెండు సంవత్సరాలు వయోపరిమితి పెంచితే సంతోషంగా ఉంటుందని ఎస్వీయూ నాన్ టీచింగ్ టైం స్కేలు ఉద్యోగుల సంఘం సభ్యులు, ఎస్వీయూ రిటైర్డ్ టైం స్కేలు ఉద్యోగులు డీఎం విజయచంద్ర నాయుడు, కె. రెడ్డెప్పరెడ్డి, ఏ రమేష్‌బాబు, జి. నాగరాజు, బి. సిద్దయ్య, టీకే వెంకటరమణ ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబుకు విజ్ఞప్తి చేశారు. దీనిలో భాగంగా సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డీఎం విజయచంద్రనాయుడు మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా టైం స్కేలు ఉద్యోగులకు సమాన వేతనం లేదని, అలాగే రిటైర్డ్ అయిన తర్వాత రావాల్సిన బెనిఫిట్స్ ఏమీలేదని బాధపడ్డారు. అంతే కాకుండా గత ప్రభుత్వం 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పర్మినెంట్ ఉద్యోగులకు వయోపరిమితి పెంచారని టైం స్కేలు ఉద్యోగులనఉ పట్టించుకోక పోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ టైం స్కేలు ఉద్యోగులను గుర్తించి 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలు వరకు రెండు సంవత్సరాలు పాటు వయోపరిమితి పెంచాలని కోరారు. ఇప్పటికే రిటైర్డ్ టైం స్కేలు ఉద్యోగులు ఈ విషయమై సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌బాబు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు.

గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికల వివరణ : మంత్రి పార్థసారథి

విజయవాడ,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త ప్రతినిధి:గవర్నర్ ప్రసంగంలో గత ప్రభుత్వ విధ్వంసకర పాలన,రాష్ట్రానికి జరిగిన నష్టం,పది సూత్రాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు స్పష్టంగా వివరించబడ్డాయని గృహ నిర్మాణం,సమాచార శాఖ మంత్రి పార్థసారథి అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని 10 లక్షల కోట్ల అప్పులతో అభోగతి పాలు చేసిందని, 9400 కోట్ల కేంద్ర రాయితీలను సద్వినియోగం చేసుకోకుండా రాష్ట్రపై భారం మోపారని ఆయన విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం 9,300 కోట్ల బకాయిలు చెల్లించి కోల్పోయిన పథకాలను పునరుద్ధరించిందని, గత ఐదేళ్ళలో 10.4 శాతంకి పడిపోయిన జిడిపీని 2024-25లో 12.5%కి పెంచామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 ద్వారా ఈ లక్ష్యాలు సాధ్యమవుతాయని,బలహీన వర్గాల అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.గీత కార్మికులకు 15% రిజర్వేషన్,నాయీ బ్రాహ్మణులకు పలు రకాల సహాయాలు అందిస్తున్నామని వివరించారు. గృహ నిర్మాణానికి గత ప్రభుత్వం 1.80 లక్షలలో 30వేలు మాత్రమే ఇస్తుంటే,ప్రస్తుత ప్రభుత్వం 50వేల నుండి 70వేల వరకు అందిస్తోందని తెలిపారు.చంద్రబాబు గతంలో ప్రజల వద్దకు పాలన తీసుకువెళ్ళగా,ఇప్పుడు ప్రజల చేతుల్లోకి పాలన వచ్చిందని, దీనివల్ల పరిపాలన సులభతరమైందన్నారు.6లక్షల కోట్లతో 4 లక్షల ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించామని,తల్లికి వందనం వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలవుతుందని ప్రకటించారు.ప్రస్తుత ప్రభుత్వంలో అభివృద్ధి,సంక్షేమం రెండూ సమతుల్యంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడాల్సిన జగన్ ఎంఎల్‌ఏలు ఒక వ్యక్తి కోసం దిగజారారని,పదవుల కోసం,హాజరు కోసం మాత్రమే సభకు వస్తున్నారని ప్రజలు వీరిని నిందిస్తున్నారని విమర్శించారు.

వాల్తేర్ డివిజన్ మేనేజర్ గా లలిత్ బోహ్రా బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: ట్రాఫిక్, వాణిజ్య విధాన రూపకల్పనలో విస్తృత అనుభవం ఉన్న 1998 బ్యాచ్ ఐ.ఆర్.టి.ఎస్ అధికారి లలిత్ బోహ్రా విశాఖపట్నంలోని వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన భారత ప్రభుత్వ పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. ఎమ్మెన్నార్‌ఈలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నప్పుడు, ఆయన పీ.ఎం సూర్యఘర్ ముఫ్త్ బిజలి యోజన, పి.ఎం కుసుం, ఆఫ్‌షోర్ విండ్‌తో సహా పవన శక్తి విధానం, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, సౌర తయారీ కోసం పిఎల్ఐ పథకం తదితర పథకాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఆయన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోలార్ ఎనర్జీకి డైరెక్టర్ జనరల్ గా కూడా పనిచేశారు.

వన్యప్రాణుల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం

బోర్డు సమావేశంలో మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: వన్య ప్రాణుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ అధ్య క్షతన 8వ రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వన్య ప్రాణుల సంరక్షణ, అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగింది. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ అటవీ, జీవవైవిధ్య నిర్వహణ మెరుగుపరిచే దిశగా నిపుణుల సూచనలను ఆమె స్వాగతించారు. 7వ ఎన్‌బిడబ్ల్యూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించిన మంత్రి.. జాతీయ వన్యప్రాణుల సంరక్షణ మండలి సమీక్షకు పంపిన పలు రాష్ట్ర ముఖ్య ప్రాజెక్టులపై ఆరా తీసారు. సమావేశంలో ప్రధాన అటవీ సం రక్షణాధికారి మాట్లాడుతూ 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ బోర్డు ఏర్పాటు తప్పనిసరిగాజరగాల్సిన అంశమని వివరించారు .జీవో నం 52, (2.12.2024) ద్వారా తెలంగాణలో ఎన్‌డబ్ల్యూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోచారం వన్యప్రాణుల అభయారణ్యం నుంచి వెళ్లే మెదక్ యల్లారెడ్డి రహదారి విస్తరణకు అనుమతి మంజూరు చేశారు.అటవీ ప్రాంతాల్లో వీనీది లైన్ల ఏర్పాటు ప్రతి పాదనలపై చర్చ జరింది.ములుగులో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, నాగార్జునసాగర్ డివిజన్‌లో పెద్దగట్టు ఎత్తిపోతల పథకానికి అనుమతి మంజూరు చేశారు. యానిమల్ పాసేజ్‌ల మార్పుల కోసం 18 ప్రతిపాదనలు, మొబైల్ టవర్ల కోసం 13 ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించారు. ఎన్‌బిడబ్ల్యూకు పంపే ముందు అవసరమైన సవరణలపై చర్చించారు.మీసేవ ద్వారా యానిమల్‌మ్యాన్ కాంఫ్లిక్ట్ బాధితులకు పరిహారం చెల్లించడానికి కార్పస్ నిధి గురించి ఈ సమావేశంలో చర్చించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ల నుంచి 1,088 కుటుంబాల పునరావాసం వివరాల పై అధికారుల నుంచి వివరాలలను మంత్రి అడి తెలుసుకున్నారు.కమ్యూనిటీ ఆధారిత ఎకో టూరిజం ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించడమే కాకుండా అలాగే కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో భారీ వాహనాల రాకపోకలపై నిషేధాన్ని తొలగించే అంశాలను ఈ సమావేశంలో పరి శీలిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా జంతు ప్రదర్శనశాలలు, జాతీయ పార్కులు, ఇంకా పట్టణ పార్కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.స్థానిక సేంద్రీయ చెట్లను ప్రాధాన్యతగా పెంచి, సహజ అటవీ వ్యవస్థను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా బోర్డు సభ్యుల సూచనలను మంత్రి కొండా సురేఖ అభినందించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, ముఖ్య కార్యదర్శి నదీమ్, శిదిదినీ దోబ్రియాల్, ఎలు సింగ్, మంత్రి పీఎస్ సోమరాజు, ఇతర న్నతాధికారులు పాల్గొన్నారు.

కెసిఆర్ 14 నెలలు అసెంబ్లీకి రాకపోవడం కూడా రికార్డే: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : కోహ్లీ దుబాయ్ వేదికగా 14 వేల రన్నులు కొట్టి రికార్డు సృష్టిస్తే ప్రతిపక్ష నేత కేసిఆర్ 14 నెలల 14 రోజులు అసెంబ్లీకి రాకుండా రికార్డు సృష్టించారని మత్రి కొండా సురేఖ ఎద్దేవా.

హంస,యాళీ వాహనాలపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లు హంస,యాళీ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు.ఉత్సవాల్లో ఏర్పాట్లలో ఆలయాధికారులు సిబ్బంది నిమగ్నమై ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నారు. ఉత్సవాలను విజయవంతం చేయటానికి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశించారు. మూడు రోజులుగా ఆయన మాతృమూర్తి,మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ ర ంగినేని చెంచయ్యనాయుడులు పర్యవేక్షిస్తున్నారు. అయితే కొత్త నాయకత్వంతో కార్యాలయంలో శాఖల మధ్య సమన్వయం కుదరటం లేదు. ఎవరు ఏ పని చేస్తున్నారో అంతా అయోమయంగా మారింది.సోమవారం ఉదయం స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా అలంకరించారు.రాజేష్,సూరి గురుకుల్స్ స్వామి అమ్మవార్లతో పాటు పంచమూర్తులను చక్కగా ముస్తాబు చేయగా రంగినే చెంచయ్యనాయుడు హాజరు కాగా డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిలు హాజరు కాగా ఆలయ అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామి నాథన్ గురుకుల్ స్వామి అమ్మవార్లకు హారతులిచ్చి గ్రామోత్సవానికి తరలించారు. వివిధ వాయుద్య బృందాలతో భక్తుల్ని గగుర్పాటు కల్పిస్తూ ఉత్సవాన్ని శివయ్య గోపురం, రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. స్వామి వారిని బంగారు హంస వాహనంపై, అమ్మవారిని బంగారు యాళీ వాహనంపై ప్రతిష్టించారు. స్వామి అమ్మవార్ల ముందు వినాయకుడు, వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి, కన్నప్ప వెళుతుండగా కోలాటాల బృందాలు కోలాటాలతో భక్తులను ఆకర్షించారు. గా ఓ వైపు తప్పెట్ల మోత,మరో వైపు బ్యాంకుమేళాలు, ఇంకొక వైపు సంప్రదాయ సన్నాయి,డోలు, ఇంకో వైపు శాక్స్,బ్యాంకు మేళాలతో ఊరేగింపు దద్దరిల్లింది.ఉత్సవాలను ఆలయ ఎఇఓ లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు. ఊరేగింపు సందర్భంగా పట్టణ సిఐ డి.గోపి సూచనలతో ట్రాఫిక్ ఎఎస్ఐ, బాలాజి,వెంకటరెడ్డిలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలను దారి మళ్ళించారు. గ్రామోత్సవం తేరువీధి, నెహ్రూవీధి, సినిమావీధి, బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల గుండా సాగింది.

నందీశ్వరులకు నిలయం శ్రీకాళహస్తి ఆలయం

శ్రీకాళహస్తి , ఫిబ్రవరి 24: పద్యాలల్లో ప్రబంద గణాల్లో మొట్టమొదటి వాడైన నందీశ్వరుని ప్రాధాన్య తను చక్కగా వివరించారు.ఏ శైవక్షేత్రంలో అయినా శివుని దర్శించుకోవడానికి ముందు నందీశ్వరుని అనుమతి కావాలన్నది భావ .శాంతానంద ప్రదాయమైన నందీశ్వరునికి సమస్కారం.పరమేశ్వరుని దర్శనానికి నీ అనుమతి ఇవ్వు నందీశ్వరా! అంటూ పేర్కొన్నారు.రెండవ శ్లోకంలో తిరుగుప్రయాణంలో నందీశ్వరుని వృషణాలను తాకుతూ కొమ్ముల నుంచి దర్శిస్తే కైలాసాన్ని దర్శించినంత భాగ్యమని పేర్కొన్నారు.ఈ ఏడాది 'మహాశివరాత్రి పర్వదినం' బుధవారం వచ్చింది. అంతేకాకుండా అరుదైన ఈ రో

25-2pg10.qxd:25-2pg10.qxd 01/01/01 7:00 AM Page 1

ఛాంపియన్‌షిప్ సాధించిన ఆండ్రీవా

న్యూఢిల్లీ: రష్యన్ టీనేజర్ మిర్రా ఆండ్రీవా తన కెరీర్‌లో అతిపెద్ద విజయాన్ని సాధించింది. ఈ టోర్నీలో హేమాహేమీ క్రీడాకారిణులను ఓడించిన ఆండ్రీవా తాజా ర్యాంకింగ్స్‌లో టాప్10లోకి ప్రవేశించింది. క్లారా టౌసన్‌ను76 (1), 61 తేడాతో ఓడించి దుబాయ్ ఛాంపియన్‌షిప్‌లను గెలుచుకుంది. ఈ విజయం ఆండ్రీవాను డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో టాప్ 10లోకి చేర్చింది. 2007లో నికోల్ వైడిసోవా తర్వాత ఈ ఘనత సాధించిన మొదటి 17 ఏళ్ల అమ్మాయిగా ఆమె నిలిచింది. కాగా 2023 వింబుల్డన్ ఛాంపియన్ మార్కెటా వొండ్రౌసోవా, ఐదుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్, 2022 వింబుల్డన్ ఛాంపియన్ ఎలెనా రైబాకినాపై విజయాలు సాధించిన ఆండ్రీవాకు ఇది అసాధారణమైన సంఘటనగా చరిత్రలో నిలిచింది. తద్వారా, 2004 డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో షరపోవా తర్వాత ఒకే ఈవెంట్‌లో ముగ్గురు ప్రధాన ఛాంపియన్‌లను ఓడించిన అతి పిన్న వయస్కురాలిగా ఆమె నిలిచింది. డబ్ల్యూటీఏ 1000 ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్న అతి పిన్న వయస్కురాలిగా కూడా ఆమె చరిత్ర సృష్టించింది. గత సంవత్సరం రొమేనియాలో జరిగిన ఇయాసి ఓపెన్‌లో ఆండ్రీవా గెలిచిన ఏకైక టైటిల్ ఇది.

సిడ్నీ క్లాసిక్ స్క్వాష్ ఛాలెంజర్‌లో.. విజేతగా భారత్ స్క్వాష్ స్టార్ సౌరవ్

న్యూఢిల్లీ: భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషాల్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. గత ఏడాది ఏప్రిల్లో ఆట నుంచి వీడ్కోలు తీసుకున్న సౌరవ్ ఈ ఏడాది మళ్లీరాకెట్ పట్టాడు. ఆస్ట్రేలియాలో ముగిసిన ఆక్టేన్ ఓపెన్ సిడ్నీ క్లాసిక్ స్క్వాష్ చాలెంజర్ టోర్నీలో సౌరవ్ విజేతగానిలిచాడు. ఫైనల్లో ప్రపంచమాజీ పదో ర్యాంకర్ సౌరవ్11-2,11-6,11-2తోఈజిప్టుదేశానికి చెందిన అబ్దుల్ రెహమాన్ నాసర్‌పై గెలుపొందాడు. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లో కలిపి మొత్తం12 పతకాలు సాధించినసౌరవ్, ఈటోర్నమెంట్‌లో తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ మాత్రమే కోల్పోవడం విశేషం. సెమీ ఫైనల్లో సౌరవ్ 11-9, 5-11, 11-1, 11-2తో ఆస్ట్రేలియాకు చెందిన రైస్ డౌలింగ్‌పై, క్వార్టర్ ఫైనల్లో 11-6, 11-6, 11-5తో దక్షిణ కొరియాకు చెందిన మిన్వూ లీపై, రెండో రౌండ్‌లో 11-8, 11-2, 11-8తో మాల్టాకు చెందిన కిజాన్‌పై గెలుపొందాడు. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన సౌరవ్‌కు తొలి రౌండ్‌లో బై లభించింది. 2003లో ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) టూర్‌లో అరంగేట్రం చేసిన సౌరవ్ ఇప్పటివరకు 11 పీఎస్ఏ సింగిల్స్ టైటిల్స్ సాధించాడు. 18 టోర్నీలలో రన్నరప్‌గా నిలిచాడు.

ఇంటర్నేషనల్ ఛాలెంజ్ టోర్నీలో రన్నరప్‌గా భారత్ షట్లర్ ఉన్నతి ఇండోనేసియా చేతిలో ఓటమి

న్యూఢిల్లీ: సింగపూర్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్ ఉన్నతి హుడా రన్నరప్‌గా నిలిచింది. సింగపూర్‌లో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ ఉన్నతి 17-21, 16-21 పాయింట్ల తేడాతో ఇండోనేసి యాకు చెందిన రుజానా చేతిలో పరాజయం పాలైంది. 42 నిమిషాల్లో ముగిసిన పోరులో ఉన్నతి వరుస గేమ్‌ల్లో ఓడింది. టోర్నీ ఆసాంతం రాణించిన ఉన్నతి రెండో రౌండ్‌లో ఆసియా క్రీడల పతక విజేత, ఆస్ట్రేలియాకు చెందిన సయిన కవాకమిను ఓడించింది. సెమీఫైనల్‌కు చేరే క్రమంలో చైనీస్ తైపీకి చెందిన ఇద్దరు షట్లర్లు సైయాంగ్ స్యూన్ లిన్, యీ టింగ్‌పై కూడా ఉన్నతి విజయాలు సాధించింది. సెమీఫైనల్లో ఉన్నతి 18-21, 21-19, 22-20తో వియత్నాంకు చెందిన థి ట్రూంగ్ వు ను చిత్తు చేసింది. తొలి గేమ్‌లో పరాజయం పాలైన తర్వాత తిరిగి పుంజుకున్న ఉన్నతి హోరాహోరీ పోరులో చక్కటి విజయంతో ఫైనల్ చేరింది. అయితే తుది పోరులో యువ షట్లర్ అదే జోరు కనబర్చలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇక ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన మరో యువ షట్లర్ దేవిక సిహాగ్ క్వార్టర్ ఫైనల్లో ఓటమి పాలైంది.

ఛాంపియన్స్ ట్రోఫీలో.. లోపాలే పాక్ ఫెయిల్యూర్స్

చెత్తగా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ పాకిస్థాన్ ఓటమికి ఇవే కారణాలు

న్యూఢిల్లీ: ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో కీలకమైన మ్యాచ్‌లో పాకిస్తాన్ 6 వికెట్ల తేడాతో భారత్ చేతిలో పరాభవం చెందింది. ఈ విజయంతో, భారత జట్టు సెమీఫైనల్స్‌ల్లోకి అడుగుపెట్టింది. ఈ ఐసీసీ టోర్నమెంట్‌లో ఆతిథ్య పాకిస్తాన్ పరిస్థితి దయనీయమైంది. ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడిపోవడానికి జట్టులో లోపాలు కారణమయ్యాయి. మ్యాచ్ ప్రారంభంలో పాకిస్తాన్ భారత్ పై పైచేయి సాధించినట్టు కనిపించింది. కానీ, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వంటి అన్ని విభాగాల్లోనూ ఒక్కొక్కటిగా లోపాలు బయటపడ్డాయి. బాబర్ ఆజం ఓపెనింగ్ బ్యాటింగ్‌లో విఫలం కావడం ప్రధాన కారణం. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ జట్టు ఆరంభం చాలా దారుణంగా ఉంది. బాబర్ ఆజం, ఇమామ్ ఉల్ హక్ నెమ్మదిగా ఆరంభించారు. దీని కారణంగా పవర్ ప్లేలో జట్టు స్కోరు చాలా తక్కువగా ఉంది. అలాగే, వన్డే సగటు 50 కంటే ఎక్కువ ఉన్న అనుభవజ్ఞుడైన బ్యాట్స్‌మన్ బాబర్ 23 పరుగులు చేసిన తర్వాత ఔటయ్యాడు. ఆ తర్వాత వెంటనే, ఇమామ్ కూడా రనౌట్ గా పెలియన్ కు చేరాడు. ఇక పవర్ ప్లేలోనే కాకుండా మిడిలార్డర్‌లో కూడా పాకిస్తాన్ బ్యాటింగ్ చాలా నెమ్మదిగా సాగింది. మహ్మద్ రిజ్వాన్, షకీల్ మూడోసారి 104 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు, కానీ దాని కోసం 144 బంతులు ఎదుర్కొన్నారు. దీని కారణంగా, ఒత్తిడి చాలా పెరిగింది. పరుగులు సాధించడానికి ప్రయత్నిస్తూ ఒకరి తర్వాత ఒకరు బ్యాట్స్‌మెన్ వరుసగా పెవిలియన్‌కు చేరారు. అలాగే పాక్ తన ఫాస్ట్ బౌలింగ్ పట్ల చాలా గర్వంగా ఉంటుంది. ఆ జట్టు ప్రధాన బలాల్లో పేస్ బౌలింగ్ అటాక్ ఒకటి. కానీ పాక్ పేస్ అటాక్ కూడా భారత బ్యాట్స్‌మెన్ ముందు పనిచేయలేదు. ప్రారంభం నుండే శుభ్ మన్ గిల్, రోహిత్ శర్మలు బౌండరీలు బాదడం మొదలుపెట్టారు. షాహీన్ షా, నసీమ్ షా బౌలింగ్ ను సైతం రఫ్పాడించారు. షాహీన్ రోహిత్‌ను అవుట్ చేసినప్పటికీ, అప్పటికి చాలా ఆలస్యమైంది. మరోపక్క భారత్‌తో పోలిస్తే స్పిన్ బౌలింగ్ సాధారణమే. మిడిలార్డర్‌లో భారత బ్యాట్స్‌మెన్‌ను పాకిస్తాన్ జట్టు అవుట్ చేయలేకపోయింది. స్పిన్ బౌలింగ్‌లో నాణ్యత కనిపించలేదు. అయితే, అబ్రార్ మంచి బంతితో శుభ్‌మన్ గిల్‌ను ఖచ్చితంగా అవుట్ చేశాడు. కానీ అతని బౌలింగ్ భారత స్పిన్నర్ల మాదిరిగా ప్రభావం చూపించలేదు. కాగా విరాట్ కోహ్లీని అవుట్ చేయడంలో విఫలమైంది. పాక్‌పై కోహ్లీ బ్యాట్ ఎప్పుడూ పనిచేస్తుంది. మరోసారి అదే జరిగింది. ఈ సారి కోహ్లీ 100 పరుగుల ఇన్నింగ్స్ తో భారత్ ను గెలిపించాడు. ఈ మ్యాచ్‌కు ముందు విరాట్ అంత ఫామ్‌లో లేడు. అయినప్పటికీ, కోహ్లీని అవుట్ చేయడానికి పాకిస్తాన్ వద్ద ఎటువంటి ప్రణాళిక ఉన్నట్లు అనిపించలేదు. ఏ బౌలర్ కూడా కోహ్లీని అడ్డుకోలేకపోయారు. ఇదే సమయంలో భారత్ ఫీల్డింగ్ లో కొన్ని తప్పిదాలు చేసినప్పటికీ బౌలింగ్, బ్యాటింగ్‌లో అదరగొట్టడంతో పాకిస్తాన్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది.

కబడ్డీ ఛాంపియన్స్‌గా సర్వీసెస్

ఉత్కంఠ పోరులో రైల్వేస్‌పై 6-4తో విజయం

న్యూఢిల్లీ: ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ జట్టు విజేతగా అవతరించింది. కటక్‌లో జరిగిన తుదిపోరులో సర్వీసెస్ జట్టు టైబ్రేక్‌లో 6-4 పాయింట్ల తేడాతో రైల్వేస్‌పై విజయం సాధించింది.

నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరు నిర్ణీత సమయంలో 30-30 పాయింట్లతో సమం అయింది. దాంతో విజేతను తేల్చేందుకు టైబ్రేక్ నిర్వహించగా, సర్వీసెస్ రెండు పాయింట్లతో పైచేయి సాధించింది. ప్రొ కబడ్డీ లీగ్ స్టార్ నవీన్ కుమార్ సారథ్యంలో బరిలోకి దిగిన సర్వీసెస్ జట్టు టోర్నీ ఆసాంతం కనబర్చిన నిలకడనే ఫైనల్లోనూ కొనసాగించింది. పీకేఎల్ 11వ సీజన్ విజేతలైన జైదీప్ దహియా, రాహుల్ సర్వీసెస్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.

అంతకుముందు సెమీఫైనల్లో సర్వీసెస్ 43-35 పాయింట్ల తేడాతో పంజాబ్‌పై విజయం సాధించగా, మరో సెమీస్‌లో రైల్వేస్ 42-34 పాయింట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై గెలుపొందింది.

8 నెలల కనిష్టానికి సెన్సెక్స్

ముంబై, ఫిబ్రవరి 24: దేశీయ మార్కెట్ల లో బేర్ పట్టు కొనసాగుతోంది. ట్రంప్ టారిఫ్ భయాల నుంచి సూచీలు కోలుకోవట్లేదు. దీనికి తోడు భౌగోళిక రాజకీయ పరిస్థితులు, విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు మార్కెట్లను మరింత ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. దీంతో సోమవారం ఏకంగా 8 నెలల కనిష్టాలకు పడిపోగా, ఈ ఒక్క రోజే దాదాపు రూ.4 లక్షల కోట్లకుపైగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. చివరికి సెన్సెక్స్ 856.66 పాయింట్లు నష్టపోయి 74,454.41 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 242.55 పాయింట్లు నష్టపోయి 22,553.35 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 4 పైసలు నష్టపోయి రూ.86.72 వద్ద స్థిరపడింది. ఆటో,

ఫార్మా, ఎఫ్ఎంసిజి మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు కుదేలయ్యాయి. ముఖ్యంగా ఐటి, మెటల్, టెలికం సూచీలు 2 శాతం మేర పతనమయ్యాయి. నిఫ్టీలో విప్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టిసిఎస్, టాటా స్టీల్ వంటి షేర్లు కూడా నష్టాలను చవిచూశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఐషర్ మోటార్స్, డాక్టర్ రెడ్డీస్, హీరో మోటార్స్, కోటాక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. అమెరికాలో ట్రంప్ అధిక టారిఫ్‌ల అమలుతో అక్కడ ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదు కావొచ్చని, దాంతో బాండ్ల ప్రతిఫలాలు పెరిగి భారత్ వంటి వర్ధమాన విపణుల్లో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపబోరని బ్రోకరేజీ సంస్థ నోమురా అంచనా వేస్తోంది. ఇది సూచీల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నెలకొన్నాయి. ఇవి ఇప్పుడప్పుడే సద్దుమణిగేలా కనిపించట్లేదు. ఇక రూపాయి పతనం, అమెరికా డాలర్ రిజర్వ్‌లు తగ్గడం, దేశీయంగా కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండడం, జిడిపి వృద్ధిపై ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలహీనపరుస్తున్నాయి.

వాణిజ్యం

క్వాలిటీ పవర్ ఐపిఒ లిస్టింగ్

ముంబై, ఫిబ్రవరి 24: సోమవారం కూడా స్టాక్ మార్కెట్‌లో భారీ క్షీణత వాతావరణం నెలకొంది. ఉదయం ట్రేడింగ్ సెషన్‌లోనే బిఎస్ఇ సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు పడిపోయింది. దీంతో దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడిదారులు నష్టపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఎనర్జీ ట్రాన్సిషన్ ఎక్విప్‌మెంట్ తయారీదారి క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్ (క్వాలిటీ పవర్) ఐపిఒ రిటర్న్స్ ఇచ్చింది. దీని షేర్లు రూ. 7.05 లేదా 1.66 శాతం ప్రీమియంతో బిఎస్ఇలో లిస్ట్ అయ్యింది. ఐపిఒ ద్వారా రూ.10 ఫేస్ వాల్యూ ఉన్న కంపెనీ షేరు రూ.425కి అందుబాటులోకి

వచ్చింది. బిఎస్ఇలో కంపెనీషేర్లురూ.432.05 వద్ద లిస్టయ్యాయి. ఇది దాని అత్యున్నత స్థాయి. అయితే కొద్ది కాలంలోనే, దాని షేర్లు రూ.415.85కి పడిపోయాయి. 1.18 శాతం ప్రీమియంతో రూ.430 వద్ద ఎన్ఎస్ఇలో లిస్ట్ అయ్యింది. క్వాలిటీ పవర్ ఐపిఒ రెండు వారాల క్రితం అంటే శుక్రవారం (14 ఫిబ్రవరి 2025) నాడు ప్రారంభమైంది. గత మంగళ వారం (18 ఫిబ్రవరి 2025) ముగిసింది. క్వాలిటీ పవర్ ఐపిఒ ధర బ్యాండ్‌ను ఒక్కో షేరుకు రూ.401-425గా నిర్ణయించింది. హై వోల్టేజ్ ఎలక్ట్రిక్ పరికరాలు అలాగే పవర్ సొల్యూషన్స్ సంబంధిత ఉత్పత్తులను తయారు చేసే ఈ కంపెనీ ఐపిఒ ద్వారా రూ.858.70 కోట్లు సేకరించాలని ప్రణాళికవేసింది. ఇందులో రూ.225 కోట్ల విలువైన కొత్త షేర్లు జారీ చేసింది. అదనంగా, ఇప్పటికే ఉన్న 1.49 కోట్ల షేర్లను కూడా అమ్మకానికి ఉంచారు. క్వాలిటీ పవర్ ఐపిఒ దాదాపుగా ఆశించిన సబ్‌స్క్రిప్షన్ పొందలేదు. బిఎస్ఇ డేటా ప్రకారం, ఐపిఒ 1,11,12,530 షేర్లకు గాను 1,43,31,330 షేర్లకు బిడ్లను అందుకుంది. పబ్లిక్ ఇష్యూ మొత్తం 1.29 సార్లు సబ్‌స్క్రైబ్ చేయబడింది.

ఇపిఎఫ్ఒ భేటీపైనే ప్రైవేట్ ఉద్యోగుల ఆశలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడానికి ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) అందించే సేవలను ఆధునికీకరించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) కోసం ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై వడ్డీ రేటును

ఆమోదించాల్సి ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుతం 8.25 శాతం అందించే ఈ రేటు గత మూడు సంవత్సరాలలో ఇపిఎఫ్ఒ అందించే అత్యధిక వడ్డీ రేటుగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ రేటు 8.15 శాతం అందించగా, ఇటీవలి కాలంలో అత్యల్ప రేటు 2021-22లో 8.10 శాతమే అందించింది. గత దశాబ్దం కాలంలో ఇపిఎఫ్ఒ తరచుగా వడ్డీ రేట్లను మారుస్తోంది 2010-11లో అత్యధికంగా 9.50 శాతం వడ్డీ రేటును అందించింది. 2019 2021 మధ్య వడ్డీ రేట్లు 8.50శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి. కోట్లాది మంది ఇపిఎఫ్ఒ సభ్యులకు రాబడిలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి ఇపిఎఫ్ఒ డిపాజిట్లపై స్థిర వడ్డీ రేటును అందించాలని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

ఖరారు చేయడానికి ఇపిఎఫ్ఒ కు సంబంధించిన అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) ఫిబ్రవరి 28న సమావేశమవుతుంది. సీబీటీ సమావేశం ప్రతి త్రైమాసికంలో నిర్వహిస్తూ ఉంటారు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి అధ్యక్షతన ఏర్పడిన సీబీటీలో ఉద్యోగి సంఘాలు, కార్మిక సంఘాల ప్రతి నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రభుత్వ అధికారులు కూడా ఉంటారు. ఇపిఎఫ్ఒ ప్రస్తుతం ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. అయితే సీబీటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా అదే రేటును కొనసాగించేందుకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ రేటును ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదించడానికి ముందు ఫిబ్రవరి 28న సీబీటీ

ఇంటర్నెట్ లేకుండానే యుపిఐ చెల్లింపులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా, యూపిఐ చెల్లింపులు చేయడం సాధ్యం కాదని అందరూ అనుకుంటారు. కానీ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ప్రారంభించిన 'స్టార్99హ్యాష్' సర్వీస్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండానే లావాదేవీలను పూర్తి చేయవచ్చు. ఇంటర్నెట్ కనెక్షన్‌లేకుండా యుపిఐ ట్రాన్సక్షన్ ఎలా చేయాలో చూద్దాం. 'స్టార్99హ్యాష్' సర్వీస్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం లేకుండానే, బ్యాంక్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవచ్చు. ఇంటర్‌బ్యాంక్ ఫండ్ బదిలీ చేయవచ్చు. యుపిఐ పిన్‌ను సెట్ ఉంటుంది. మీ బ్యాంకు ఖాతాకు లింక్ అయిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి 'స్టార్99హ్యాష్'కు డయల్ చేయాలి. డయల్ చేసిన తర్వాత భాషను ఎంచుకోవాలి. మీ బ్యాంకు పేరును ఎంటర్ చేసిన తర్వాత, మీ మొబైల్ నంబర్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతాల జాబితా కనిపిస్తుంది. కావాల్సిన ఖాతాను ఎంచుకోవాలి. ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయడానికి డెబిట్ కార్డు చివరి ఆరు అంకెలు, గడువు తేదీని ఎంటర్ చేయాలి. యుపిఐ పిన్ నంబర్ సెట్ చేయకపోతే, సెట్ చేసుకోవాలి. మీ ఫోన్‌లో 'స్టార్99హ్యాష్' డయల్ చేసిన తర్వాత డబ్బు పంపడానికి ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత ఎవరికైతే డబ్బు పంపించాలనుకుంటున్నారో. వారి యుపిఐ ఐడి, బ్యాంకు ఖాతా నంబర్ ఎంటర్ చేయడానికి కావాల్సిన ఆప్షన్ ఎంచుకోవాలి. మీరు పంపించాలనుకున్న మొత్తాన్ని ఎంటర్ చేసిన తర్వాత, లావాదేవీలను ధృవీకరించడానికి పిన్ నంబర్ నమోదు చేయాలి.

ఎయిర్‌టెల్ కస్టమర్లకు ఆపిల్ టివిప్లస్

ముంబై, ఫిబ్రవరి 24: కస్టమర్లకు మెరుగైన కంటెంట్ సేవలు అందించేందుకు ప్రముఖ టెలికం సంస్థ ఎయిర్‌టెల్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. తమ వినియోగదారులకు ఆపిల్ టివి ప్లస్, ఆపిల్ మ్యూజిక్ కంటెంట్ సేవలను అందు బాటులోకి తీసుకొస్తోంది. దీని కోసం టెక్ దిగ్గజం ఆపిల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ మేరకు ఎయిర్‌టెల్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ సదుపాయం ఎయిర్‌టెల్ వైఫై, పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు అందుబాటులో ఉండనుంది. రూ.999 అంతకంటే ఎక్కువ ధర ఉన్న ప్లాన్లపై వైఫై యూజర్లు ఆపిల్ టివిప్లస్ కంటెంట్‌ను వీక్షించొచ్చు. పోస్ట్ పెయిడ్ యూజర్లయితే ఇదే ప్లాన్లపై ఆపిల్ టివిప్లస్ కంటెంట్‌తో

అదనంగా ఆరు నెలల పాటు ఉచితంగా ఆపిల్ మ్యూజిక్ యాక్సెస్‌ను పొందవచ్చని కంపెనీ ఆ ప్రకటనలో పేర్కొంది. కాగా గతేడాది ఆగస్టులోనూ ఎయిర్‌టెల్ కంపెనీ, ఆపిల్‌తో ఇదే తరహా ఒప్పందం కుదుర్చుకుంది. అప్పుడు ఎక్స్ ట్రీమ్ ప్రీమియం సబ్‌స్క్రైబర్లకు ఆపిల్ టివిప్లస్, ఆపిల్ మ్యూజిక్ కంటెంట్‌ను అందు బాటులోకి తీసుకొచ్చింది. తాజా నిర్ణ యంతో సాధారణ వైఫై, పోస్ట్‌పెయిడ్ యూజర్లూ ఈ సేవలు పొందొచ్చు. దీంతో కస్టమర్లు హాలీవుడ్, అవార్డ్ విన్నింగ్ సినిమాలు వీక్షించొచ్చు.

మెక్సికో ఆపిల్ ప్లాంట్లు యుఎస్‌కు తరలింపు

వాషింగ్టన్, ఫిబ్రవరి 24: మెక్సికోలోని ఆపిల్ సంస్థ యూనిట్లను అమెరికాకు తరలించే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసింది. టిమ్‌కుక్ మెక్సికోలో రెండు ప్లాంట్లను నిలివేశారని, దానికి బదులుగా అమెరికాలో ఉత్పత్తులను తయారు చేస్తారని అమెరికా గవర్నర్ల సదస్సులో ట్రంప్ పేర్కొన్నారు. పెరుగుతున్న ట్యారిఫ్ ఒత్తిళ్లు కొనసాగుతున్న అమెరికా-చైనా వాణిజ్య వివాదానికి ప్రతిస్పందనగా ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కొందరు చెబుతున్నారు. అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల టిమ్‌కుక్ ట్రంప్‌తో వైట్ హౌజ్‌లో సమావేశమయ్యారు. చైనాలో చూపిన తన తయారీ నుంచి భారీగా వివిధ దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. అందులో కొంతభాగం అమెరికా ఎగుమతి అవుతోంది. అయితే ఇటీవల అమెరికా- చైనాల మధ్య సుంకాల విషయంలో తీవ్ర చర్చ సాగుతున్న నేపథ్యంలో టిమ్ కుక్ ట్రంప్ బేటీ అయ్యారు. కానీ గతంలో మాదిరి కాకుండా ఈసారి ఆపిల్‌కు ఎలాంటి మినహాయింపులు ఉండవని ట్రంప్ సంకేతాలు ఇచ్చినట్లు, ఈ ఆలోచన ట్రంప్ కుక్‌తో సమావేశమైన మరుసటి రోజే యూఎస్‌కు తయారీ ప్లాంట్ తరలింపు ప్రకటన చేయడం చర్చనీయాంశం అయింది. అమెరికాలో వందల మిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతానని కుక్ హామీ ఇచ్చినట్లు ట్రంప్ తెలిపారు. ఈ పెట్టుబడి ఉద్యోగాలను సృష్టిస్తుంది. యూఎస్ సరఫరా గొలుసును బలపరుస్తుంది. ఉత్పత్తిని పునరుద్ధరించడం, బాహ్య ఆర్థిక ఒత్తిళ్ల నుంచి కీలక పరిశ్రమలను రక్షించేందుకు నిర్ణయించిన నిర్ణయాలు తన పరిపాలన విస్తృత లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఆపిల్‌పై ప్రభావం ట్రంప్‌కు సంబంధించి ఆపిల్ ఇంకా అధికారిక ప్రకటన చేయనప్పటికీ, తయారీ కార్యకలాపాలను అమెరికాకు తరలించడం ద్వారా దిగుమతి సుంకాల ప్రభావం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. ఇది లాభాల మార్జిన్లు, ధరలను ప్రభావితం చేస్తుంది. ఈ వ్యూహాత్మక మార్పు ఉద్యోగాల కల్పనతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని కొందరు అంచనా వేస్తున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14